

సేంద్రియం... దివ్యౌషధం

- ఆరోగ్యానికి భరోసానిచ్చే ఆహారపదార్థాలు
- ఏయూలో ప్రారంభమైన ఆర్గానిక్ మేళా
- 300 స్టాల్స్‌లో సేంద్రియ ఉత్పత్తుల విక్రయం
- కొనుగోలుకు ఆసక్తి చూపుతున్న నగరవాసులు



- 8లో

లోన్ యాప్‌ల ఆగడాలు

నగరంలో మళ్లీ మొదలు

- నాలుగు రోజుల క్రితం యువకుడి ఆత్మహత్య
- ఇన్‌స్టెంట్ లోన్ అంటూ వల
- మొబైల్ ఫోన్‌లకు మెసేజ్‌లు, లింక్‌లు...
- ఉచ్చులో పడితే అంతే సంగతులు
- అసలు, వడ్డీ కట్టినా ఇంకా బకాయి ఉన్నారంటూ వేధింపులు
- వారు అడిగిన మొత్తం చెల్లించకుంటే ఫొటోలు మార్ఫింగ్ చేసి బంధువులకు పంపుతామంటూ బెదిరింపులు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

దండుబజార్ ప్రాంతానికి చెందిన 21 ఏళ్ల యువకుడు చేపల వేట ద్వారా జీవనం సాగిస్తున్నాడు. ఒక యువతిని ప్రేమించి అక్టోబరు 20న వివాహం చేసుకున్నాడు. కొద్దిరోజుల కిందట మొబైల్ ఫోన్‌కు ఇన్‌స్టెంట్ లోన్ పేరుతో లింక్ రావడంతో క్లిక్ చేశాడు. రూ.రెండు వేలు లోన్ తీసుకున్నాడు. ఆ మొత్తాన్ని తరువాత తీర్చేశాడు. అయినా వడ్డీ కింద ఇంకా కట్టాల్సింది ఉందంటూ వేధించడం మొదలుపెట్టారు. నాలుగు రోజుల కిందట యువకుడితో పాటు కుటుంబ సభ్యుల ఫొటోలు మార్ఫింగ్ చేసి బంధువులకు వాట్సాప్ ద్వారా పంపించారు. దాంతో మనస్తాపం చెందిన యువకుడు ఈ నెల ఏడో తేదీన ఆత్మహత్య చేసుకున్నాడు.

లోన్ యాప్‌ల నిర్వాహకుల ఆగడాలు మళ్లీ పెరుగుతున్నాయి. రెండేళ్ల కిందట గాజువాక ప్రాంతానికి చెందిన ఒక యువతి ఆత్మహత్య చేసుకోవడంతో లోన్‌యాప్‌ల బాధితులు ఎవరైనా ఉంటే తమను సంప్రతించాలని పోలీసులు కోరారు. పదుల సంఖ్యలో బాధితులు స్టేషన్లకు రావడంతో వారిచ్చిన సమాచారం ఆధారంగా కొన్ని యాప్‌ల నిర్వాహకులను అరెస్టు చేశారు. ఆ సమయంలో ఇన్‌స్టెంట్ లోన్ పేరుతో ఉచ్చులోకి దింపే యాప్‌లు 204 ఉన్నట్టు గుర్తించి వాటి వివరాలను ప్రజలకు విడుదల చేశారు. తరువాత లోన్‌యాప్‌ల నిర్వాహకులు దూకుడు తగ్గించారు. తాజాగా దండుబజార్‌కు చెందిన నవవరుడు ఆత్మహత్య చేసుకోవడంతో లోన్ యాప్‌లపై మరోసారి చర్చ మొదలైంది. కుటుంబ సభ్యులు ఈనెల తొమ్మిదో తేదీన సీపీ శంఖబ్రతబాగ్చిని కలిసి ఫిర్యాదు చేయడంతో జరిగిన దారుణం వెలుగులోకి వచ్చింది.

పోలీసులు గుర్తించిన మోసపూరిత లోన్‌యాప్‌లు 204

వాటిలో ప్రధానమైనవి:

- షటిల్ లోన్
- ఈజీ లోన్
- క్యాష్ నీమ్
- లోన్ ఫ్రంట్
- సిల్వర్ కాయిన్
- హోమ్ క్యాష్
- ఎస్ క్యాష్
- క్రేజీ బీ
- డైలీ లోన్
- క్రెడిట్ బీ
- క్యాష్ జీ
- కాయిన్ పాకెట్
- షేర్ లోన్, రుపీ టైగర్
- ఆల్ఫా లోన్
- లోన్ రిస్క్

అడగకపోయినా రుణాలు మంజూరు

రుణం అడగకుండానే లోన్ యాప్ నిర్వాహకులు మొబైల్ ఫోన్‌కు మెసేజ్‌లు చేస్తుంటారు. లోన్ కావాలనుకుంటే తాము చెప్పిన నంబర్‌కు ఫోన్ చేయాలని లేదంటే లింక్‌ను క్లిక్ చేయాలని సూచిస్తారు. దీంతో యువకులు, ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నవారు తర్వాత ఎదురయ్యే పరిణామాల గురించి ఆలోచించకుండానే

... మిగతా 6వ పేజీలో

ముత్తంశెట్టి రాజీనామాతో

వైసీపీలో కలవరం

- మరికొంతమంది పార్టీని వీడనున్నారనే చర్చ
- అసంతృప్తులను గుర్తించి, బుజ్జగించే పనిలో నేతలు



ముత్తంశెట్టి శ్రీనివాసరావు

విశాఖపట్నం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి):

మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు రాజీనామా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో తీవ్ర కలకలం రేపింది. ఆయన బాటలో మరెంతమంది ఉన్నారోననే చర్చ జరుగుతోంది. ముత్తంశెట్టి 2019 ఎన్నికలకు కొద్దిరోజులు ముందు వైసీపీలో చేరారు. ఆయన్ను భీమిలి నియోజకవర్గ అభ్యర్థిగా పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారు. భీమిలి నుంచి గెలిచిన ముత్తంశెట్టికి మంత్రిగా అవకాశం కల్పించారు. మూడేళ్ల తర్వాత మంత్రివర్గం నుంచి ఆయన్ను తప్పించి పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. కొద్దిరోజులకే జిల్లా అధ్యక్ష పదవి నుంచి కూడా తప్పించారు. అప్పటినుంచీ పార్టీపై ముత్తంశెట్టి అసంతృప్తిగానే ఉన్నారు. 2024 ఎన్నికల్లో తిరిగి భీమిలి నుంచి పోటీ చేసినప్పటికీ ఆయన ఓటమి పాలయ్యారు. ఆ తరువాత పార్టీతో అంటీముట్టనట్టుగానే వ్యవహరిస్తున్నారు. ముఖ్యమైన కార్యక్రమాలకు తప్పనిసరి పరిస్థితిలో హాజరైనప్పటికీ ముభావంగా ఉండి

... మిగతా 6వ పేజీలో

ప్రాణాలు తీస్తున్న నిర్లక్ష్యం

హెల్మెట్ ధారణ విషయంలో నగరవాసుల అశ్రద్ధ

- ఎన్ని చర్యలు చేపట్టినా ఫలితం శూన్యం
- రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందుతున్న వారిలో సగానికిపైగా ద్విచక్ర వాహనదారులే
- అందులో అత్యధికులు హెల్మెట్ ధరించనివారే...
- మరోవైపు జరిమానాతోనే సరిపెడుతున్న పోలీసులు
- హైకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో ఉన్నతాధికారుల అప్రమత్తం
- ఇకపై కఠిన చర్యలు చేపట్టేందుకు సిద్ధం



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

హెల్మెట్ ధరించాలని పోలీసులు ఎంత మొత్తుకుంటున్నా కొంతమంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నగరంలో రోడ్డు ప్రమాదాల కారణంగా మృతిచెందుతున్న వారిలో సగానికిపైగా ద్విచక్ర వాహనదారులు, అందులోనూ అత్యధికులు హెల్మెట్ ధరించనివారు ఉంటున్నారు. అయినప్పటికీ ద్విచక్ర వాహన చోదకుల్లో ఎటువంటి మార్పు కానరావడం లేదు. మరోవైపు పోలీసులు కూడా హెల్మెట్ ధరించని వారిని సెల్‌ఫోన్‌తో ఫొటోలు తీసి చలానాలు జారీ చేయడానికే పరిమితమవుతున్నారు కానీ...అంతకుమించి ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం లేదు.

నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఏటా సగటున 1,400 రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయి. వీటిలో సగటున 350 మంది మరణిస్తే, మరో 1,300 మంది క్షతగాత్రులవుతున్నారు. సగానికిపైగా రోడ్డు ప్రమాదాల్లో ద్విచక్ర వాహనాల ప్రమేయం ఉంటోంది. మృతుల్లో సగానికి పైగా ద్విచక్ర వాహనదారులు, అందులోనూ 70 శాతం మంది హెల్మెట్ ధరించని వారు ఉంటున్నట్టు పోలీసులు చెబుతున్నారు. 2022 జనవరి నుంచి నవంబరు మధ్య జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 330 మంది మృతిచెందితే వారిలో 187 మంది ద్విచక్ర వాహనదారులు ఉన్నారు. ఆ 187 మందిలో 117 మంది హెల్మెట్ ధరించకపోవడం వల్ల మృతిచెందారు. 2023లో జనవరి నుంచి నవంబరు మధ్యకాలంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 300 మంది మృత్యువాతపడితే, వారిలో 160 మంది ద్విచక్ర వాహనదారులే. అందులో 95 మంది

... మిగతా 6వ పేజీలో

గత మూడేళ్లలో (జనవరి-నవంబరు) రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందిన ద్విచక్ర వాహన చోదకులు

సంవత్సరం	హెల్మెట్ లేక మృతిచెందినవారు	హెల్మెట్ ఉన్నా మరణించినవారు	మొత్తం
2022	117	70	187
2023	95	65	160
2024	100	73	173

ప్రైవేటు కళాశాలల హాస్టళ్లపై దృష్టి

- హాస్టళ్లలో భద్రత, వసతుల తనిఖీకి మూడు బృందాలు ఏర్పాటు



నగరంలోని ఓ ప్రైవేటు హాస్టల్

విశాఖపట్నం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి):

ప్రైవేటు జూనియర్ కళాశాలలు అనధికారికంగా నడుపుతున్న హాస్టళ్లపై జిల్లా యంత్రాంగం దృష్టిసారించింది. హాస్టళ్ల నిర్వహణ, భద్రత, ఆహారం తయారీ, మరుగుదొడ్లు, శానిటేషన్, తదితర అంశాలు పూర్తిస్థాయిలో పరిశీలించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. ఇందుకు మూడు కమిటీలను నియమించారు. మండల విద్యాశాఖాధికారుల నేతృత్వంలో పోలీస్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జీవీఎంసీ ఆరోగ్య విభాగం సిబ్బందిని కమిటీలో నియమించారు. రెండు రోజుల నుంచి ఈ కమిటీలు నగర పరిధిలో హాస్టళ్లను తనిఖీలు చేస్తున్నాయి.

గత నెల లాసన్స్‌బే కాలనీలోని ఒక జూనియర్ కళాశాలలో మధ్యాహ్నం వండిన బిర్యానీ, చేపలు, రొయ్యలు రాత్రికి వడ్డించారు. వాటిని తిన్న ఏడుగురు బాలికలు తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరారు. దీనిపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాలతో ఇంటర్ బోర్డు అధికారులు నగరంలో ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాలు 43 హాస్టళ్లు నడుపుతున్నట్టు గుర్తించి ఆయన నివేదిక అందజేశారు. ఇవి ఎక్కువగా మధురవాడ, పీఎం పాలెం, కొమ్మాది ప్రాంతాల్లో ఉన్నాయి. ఈ హాస్టళ్లలో సుమారు 22 వేల మంది ఉంటున్నారు. అందులో బాలురు 12 వేల మంది, బాలికలు 10 వేల మంది. వీరంతా ఉత్తరాంధ్ర జిల్లాలు, పొరుగు రాష్ట్రాలకు చెందినవారు. కాగా, హాస్టళ్ల ఏర్పాటుకు ఇంటర్ బోర్డు నుంచి కళాశాలలు ఎటువంటి అనుమతులు తీసుకోలేదు. ఆయా హాస్టళ్ల తనిఖీల కోసం మూడు బృందాలను కలెక్టర్ నియమించారు. ప్రతి బృందంలో మండల విద్యాశాఖాధికారితోపాటు పోలీస్,

... మిగతా 6వ పేజీలో

కనకమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు



మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా గురువారం కనకమహాలక్ష్మి అమ్మవారి దర్శనానికి భక్తులు వెల్లువలా తరలివచ్చారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని స్వర్ణాభరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు.

- వార్త 8వ పేజీలో

ఏపీ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీలో

విశాఖ నుంచి ముగ్గురికి చోటు

విశాఖపట్నం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్రప్రదేశ్ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీని కేంద్ర అటవీ, పర్యావరణ మంత్రిత్వశాఖ నియమించింది. రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన ఏర్పాటైన ఈ అథారిటీలో విశాఖ నుంచి ముగ్గురికి అవకాశం లభించింది. నిపుణుల కోటా కింద విశాఖలోని జాతీయ సముద్ర అధ్యయన విజ్ఞాన సంస్థ సైంటిస్ట్ ఇన్‌చార్జి డాక్టర్ వీవీఎస్ఎస్ శర్మ,కాలుష్య నియంత్రణ మండలి విశ్రాంత చీఫ్ ఇంజనీర్ ఎన్.వి.భాస్కరరావు, స్వచ్ఛంద సంస్థల కోటాలో ఇండియా యూత్ ఫర్ సొసైటీ కార్యదర్శి ఎన్.సత్య సంతోషి శరత్‌చంద్ర నియమితులయ్యారు.

ఉక్కులో గందరగోళం

- మార్కెటింగ్ విభాగంలో బదిలీలు
- సెయిల్ నుంచి డిప్యుటేషన్‌పై చీఫ్ జనరల్ మేనేజర్, జనరల్ మేనేజర్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ నియామకం
- ఉద్యోగ వర్గాల్లో ఆందోళన
- సౌత్‌లో సెయిల్‌కు ప్రధాన పోటీదారు విశాఖ స్టీల్‌ప్లాంటు
- అటువంటప్పుడు ఆ సంస్థ అధికారులకు ఇక్కడ కీలక స్థానాలు ఎలా కట్టబెడతారని ప్రశ్నలు
- కర్మాగారాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రగా ఆరోపణ



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం స్టీల్‌ప్లాంటును నిర్వీర్యం చేసేందుకు వ్యూహాత్మక కుట్ర జరుగుతోంది. కష్టాల నుంచి బయటకు తీసుకువస్తామని చెబుతూ మరింత ఊబిలోకి నెడుతున్నారు. కర్మాగారానికి అవసరమైన ముడి పదార్థాలు సమకూర్చడం లేదు. నష్టాలు పెరిగేలా చేస్తున్నారు. ఇప్పుడు తాజాగా మరో నిర్ణయం తీసుకున్నారు. ఇక్కడి మార్కెటింగ్ విభాగంలో పలువురిని బదిలీ చేశారు. ఇది సాధారణమే. కానీ సెయిల్‌లో పనిచేస్తున్న ముగ్గురు అధికారులను తీసుకువచ్చి ఇక్కడ నియమించారు. దీనిపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

విశాఖ స్టీల్‌ప్లాంటులో ఉద్యోగుల సంఖ్య అధికంగా ఉందని చెబుతూ ఇక్కడి నుంచి ఇతర ప్లాంట్లకు చాలామందిని డిప్యుటేషన్లపై పంపుతున్నారు. అటువంటి సమయంలో సెయిల్ నుంచి ఇక్కడకు ఉన్నతాధికారులను తేవలసిన అవసరం ఏమిటనేది ప్రధాన ప్రశ్న. స్టీల్‌ప్లాంటులో అన్ని

... మిగతా 6వ పేజీలో

గ్రీన్‌బెల్ట్ కబ్జా

ఏఎస్ఎన్ మెగా మాల్ బరితెగింపు



ఫిర్యాదు రావడంతో నిర్మాణాలు తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

- రెండేళ్లుగా నిర్మాణ పనులు
- గతంలో కథనం ప్రచురించిన 'ఆంధ్రజ్యోతి'
- స్పందించని జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం
- ఇప్పుడు ఎమ్మెల్యే ఫిర్యాదుతో చర్యలు

విశాఖపట్నం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి):

మహా విశాఖ నగర పాలక సంస్థ(జీవీఎంసీ)లో ప్లానింగ్ విభాగం తీరు ఎలా ఉంటుందో గురువారం జరిగిన ఓ ఘటన కళ్లకు కట్టినట్టు చూపించింది. నగరంలో భవన నిర్మాణాలకు ఈ విభాగమే అనుమతులు ఇస్తుంది. నిబంధనలకు వ్యతిరేకంగా ఎటువంటి నిర్మాణాలు ఉన్నా చర్యలు చేపట్టాల్సింది ఆ విభాగమే. అయితే ఎటువంటి అక్రమం చేసినా జేబు నింపితే చూసీచూడనట్టుగా వదిలేస్తుంటుంది.

జాతీయ రహదారిపై బిర్లా జంక్షన్ సమీపాన పాస్‌పోర్టు సేవా కేంద్రం ఎదురుగా రెండేళ్లుగా భారీ షాపింగ్‌మాల్ (ఏఎస్ఎన్ మెగా మాల్) నిర్మాణం జరుగుతోంది. మాల్ యాజమాన్యం నిర్మాణానికి ఎదురుగా ఉన్న గ్రీన్ బెల్ట్‌ను ఆక్రమించుకుంది. దీనిని ఎవరూ ప్రశ్నించకూడదని రెండేళ్ల క్రితం అప్పటి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఫొటోతో ఫ్లెక్సీలు పెట్టి పబ్బం గడుపుకొంది. దీనిపై అప్పట్లోనే 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించింది. కంటి తుడుపు చర్యలతో సరిపెట్టేశారు. ఆ తరువాత మరింత విస్తరించి గ్రీన్ బెల్ట్

... మిగతా 6వ పేజీలో



దళిత సంఘాల రాస్తారోకో

భీమునిపట్నం (రూరల్), డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో రాజ్యాంగ ప్రతిని చించి, బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన దోసి దత్తరావు పవార్‌ను కఠినంగా శిక్షించాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం వారు తాళ్లవలస కూడలిలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు బోని సన్నిబాబు మాట్లాడుతూ దత్తరావు పవార్ భారత రాజ్యాంగాన్ని కించపరుస్తూ మాట్లాడడం సరికాదన్నారు. అంతకముందు కుల వివక్ష పోరాట సమితి జిల్లా ఉపాధ్యక్షురాలు భాగం లక్ష్మి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు వ్యవస్థాపకుడు బి.గోపాలరావు, సియాద్రి రాంబాబు, మామిడి శివకుమార్, బోని ప్రసాద్, బోని నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.

'శ్మశానవాటిక స్థలాన్ని పరిరక్షించాలి'

మధురవాడ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 6వ వార్డు రేవళ్లపాలెం శ్మశానవాటిక స్థలం ఆక్రమణకు గురవ్వకుండా పరిరక్షించాలని కోరుతూ బంగారమ్మ భూలోకమాత సంక్షేమ సేవా సంఘం ప్రతినిధులు జోన్-2 జడ్సీ ఫణిరామ్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్వే నంబరు 6/2, 6/3, 6/4లో శ్మశానవాటిక పూర్వం నుంచీ ఉందని, దానికి హద్దులు నిర్ణయించి, జీవీఎంసీ నిధులతో ప్రహరీ నిర్మించడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, కార్యదర్శి పిళ్లా రమణబాబు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా వేదిక

పద్మనాభం/పద్మనాభం రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలో 2023 - 24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి సామాజిక తనిఖీ ప్రజా వేదిక శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు ఎంపీడీవో విజయకుమార్ తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు ఈ కార్యక్రమానికి విధిగా హాజరుకావాలన్నారు.

నేడు హనుమత్ వ్రతం

సింహాచలం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సింహగిరి మెట్లమార్గంలో ఉన్న సాక్షి ఆంజనేయస్వామి సన్నిధిలో శుక్రవారం జరిగే హనుమత్ వ్రతం ఉత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఈఓ వేంద్ర త్రినాధరావు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 6 నుంచి స్వామివారికి పంచామృతాభిషేకాలు, 7 నుంచి అలంకరణ, 7.30 నుంచి తమలపాకులతో లక్షపత్రి పూజ, 9.30 గంటలకు ప్రత్యేక హవనం, పూర్ణాహుతి జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

బయోమెడికల్‌లో ఎన్ఎంఆర్ కీలకం

సాగర్‌నగర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వైద్య రంగంలో ముఖ్యంగా బయో మెడికల్‌లో ఎన్ఎంఆర్ (న్యూక్లియర్ మాగ్నెటిక్ రిసోనెన్స్) సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తోందని లక్నోకు చెందిన సెంటర్ ఆఫ్ బయో మెడికల్ రీసెర్చి నిపుణులు వెల్లడించారు. గీతం వర్సిటీ స్కూల్ ఆఫ్ సైన్స్ ఆధ్వర్యంలో గురువారం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా ఫార్మ సూటికల్, బయో మెడికల్ రంగాల్లో ఎన్ఎంఆర్ ప్రయోజనాలపై నిపుణులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సెంటర్ ఆఫ్ బయో మెడికల్ రీసెర్చి నిపుణుడు ప్రొఫెసర్ నీరజ్ సిన్హా, ప్రొఫెసర్ దినేశ్ కుమార్, గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ జగత్తరణ్ దాస్, గీతం విశిష్ట ప్రొఫెసర్ మూర్తి, ప్రొఫెసర్ టీవీఆర్ టాటా, గీతం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ జీవీఆర్ శర్మ, ప్రొఫెసర్ జగదీశ్ భరతం, తదితరులు పాల్గొన్నారు.

రుషికొండ తీరానికి ఆలివ్ రిడ్లే తాబేలు కళేబరం



సాగర్‌నగర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ వద్ద బేపార్కు ఎదురుగా ఉన్న తీరానికి ఆలివ్ రిడ్లే తాబేలు కళేబరం గురువారం కొట్టుకువచ్చింది. ఆలివ్ రిడ్లే తాబేళ్లు ఈ సీజన్‌లో ఎక్కువగా గుడ్లు పొదిగేందుకు విశాఖ తీరం వైపు వస్తుంటాయి. ఈక్రమంలో అవి మర పడవలు, కొన్ని రకాల వలలకు చిక్కుకుని మృత్యువాత పడుతుంటాయి. భారీ కాయంతో వున్న తాబేలు కళేబరాన్ని సందర్శకులు ఆసక్తిగా తిలకించారు.

నేడు రెవెన్యూ సదస్సు

సాగర్‌నగర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రుషికొండలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్టు చినగదిలి రూరల్ తహసీల్దార్ పాల్ కిరణ్ తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పెద్ద రుషికొండ పోలమాంబ టెంపుల్ సమీపంలో ఉన్నసామాజిక భవనంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు సదస్సు జరుగుతుందన్నారు. స్థానికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అభివృద్ధి పనుల్లో అక్రమాలు

- ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీలో వెల్లడి
- అధికారులను నిలదీసిన ప్రజాప్రతినిధులు
- వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలని అధికారులకు డ్వామా పీడీ ఆదేశం



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

భీమునిపట్నం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) :మండలంలో ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనుల్లో అక్రమాలు జరిగాయని సామాజిక తనిఖీల్లో వెల్లడైంది. గురువారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సామాజిక తనిఖీ బృందం ప్రజా వేదిక నిర్వహించింది. గత ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకూ మండలంలోని 16 పంచాయతీల్లో మొత్తం 831 పనులకు వేతనాల రూపంలో రూ. 5 కోట్ల 58 లక్షల 11 వేల 329, మెటీరియల్ రూపంలో రూ. కోటి 49 లక్షల 56302 ఖర్చు చేసినట్టు అధికారులు వివరించారు. వీటికి సంబంధించి ఈనెల 1 నుంచి 12 వరకూ 8 జిల్లా రిసోర్స్ పర్సన్ల ఆధ్వర్యంలో 16 పంచాయతీల్లో సామాజిక తనిఖీలు చేపట్టారు. వీటిలో అధికంగా ఎం.బుక్‌లో ఎస్టిమేషన్స్‌కు, వేతనాల చెల్లింపులో నిబంధనలను ఉల్లంఘించినట్టు గుర్తించారు. అలాగే చెరువు గట్లపై మొక్కల పెంపకంలో కూడా అవకతవకలు జరిగాయని, వీటిలో అన్నవరం పంచాయతీలో మొక్కలు వేయకుండానే చెల్లింపులు జరిగాయని సామాజిక తనిఖీ బృందం తెలిపింది. దాకమర్రిలో గృహ నిర్మాణ లబ్ధిదారు సీహెచ్ పైడమ్మ 2022లో మృతి చెందగా, 2023-24లో ఆమె పేరున మస్టర్ వేసి రూ. 5,397 చెల్లించారని చెప్పారు. అలాగే ఎం. బుక్‌లో చెక్ కొలతలకు పాస్ ఆర్డర్ లేకుండానే చాలా పనులకు నిబంధనలకు విరుద్ధంగా వేతనాలు చెల్లించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు మాట్లాడుతూ మినీ గోకులం షెడ్ల నిర్మాణంలో కొంత మంది లబ్ధిదారులకు పార్టు పేమెంట్లు జరిగాయని, మరికొందరికి అసలు పేమెంట్లు జరగలేదని తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం డ్వామా పీడీ పూర్ణిమాదేవి మాట్లాడుతూ సామాజిక తనిఖీలో వెలుగు చూసిన అక్రమాలపై వారం రోజుల్లోగా సంబంధిత అధికారులు వివరణ ఇవ్వాలని, వాటిని విజిలెన్స్ అధికారులకు సమర్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ జిల్లా అధికారి నిర్మలాదేవి, ఉపాధి హామీ పథకం ఏపీడీ కె. ఆంజనేయులు, ఎంపీడీఓ హనుమంతరావు, ఈవోపీఆర్డీ రమేశ్ నాయుడు, స్టేట్ రిసోర్స్ పర్సన్ నాగరాజు, ఏపీవో గౌరి, తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర పాలనపై సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ



ఆనందపురం : శిక్షణలో పాల్గొన్న కార్యదర్శులు, సర్పంచులు

ఆనందపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు స్థిరమైన అభివృద్ధి, లక్ష్యాల స్థానికీకరణ అన్న అంశంపై మండల పరిషత్ కార్యాలయంలో గురువారం శిక్షణ జరిగింది. రెండు రోజుల పాటు జరిగే ఈ శిక్షణను ఎంపీడీవో డాక్టర్ జానకి, ఈఓఆర్డీ బి. సత్యన్నారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో సుస్థిరమైన అభివృద్ధే లక్ష్యంగా పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. పేదరిక నిర్మూలన, నీరు సమృద్ధిగా ఉన్న గ్రామాలను గుర్తించడం, క్లీన్ అండ్ గ్రీన్, గుడ్ గవర్నెన్స్, ఆరోగ్యవంతమైన గ్రామాలను తయారు చేయడం కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నామన్నారు.

అభివృద్ధి పనులపై అవగాహన అవసరం

భీమునిపట్నం : గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులపై పంచాయతీ పాలకులతో పాటు అధికారులకు పూర్తి అవగాహన ఉండాలని జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు అన్నారు. గురువారం ఆయన మండల పరిషత్ సమావేశ మందిరంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ పర్యవేక్షణలో పంచాయతీల ప్రజాప్రతినిధులకు, అధికారులకు, సచివాలయ సిబ్బందికి రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుత పంచాయతీల పాలకులు, అధికారుల మధ్య సమన్వయ లోపం వల్ల పంచాయతీల అభివృద్ధి కుంటుపడుతోందన్నారు. ఎంపీడీవో హనుమంతరావు మాట్లాడుతూ పంచాయతీ రాజ్ చట్టం, ఇతర విషయాలపై ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈఓఆర్డీ రమేశ్‌నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, రిసోర్స్ పర్సన్ కరుణాకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా తిరు నక్షత్ర పూజలు



సింహాచలం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో తిరుమంగై ఆళ్వార్ తిరు నక్షత్ర పూజలు సంప్రదాయబద్ధంగా జరుగుతున్నాయి. గురువారం వేకువజామున సుప్రభాతసేవతో స్వామి వారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులు, ఆళ్వార్లతో శోభాయమానంగా అలంకరించి వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో తొలుత షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం అధ్యాపకులు నాలాయిర దివ్య ప్రబంధంలోని వెయ్యి పాశురాలను అనుసంధానం చేశారు. మధ్యాహ్నం రాజభోగ నివేదన వేళ ప్రత్యేక పూజలు చేసి కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఆర్‌హెచ్ కాలనీలో రిజిస్ట్రేషన్లకు అవకాశం ఇవ్వాలని వినతి

మధురవాడ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 6వ వార్డు పోతిన మల్లయ్యపాలెం పునరావాస కాలనీలో ఇళ్ల రిజిస్ట్రేషన్‌లకు అవకాశం కల్పించాలని కోరుతూ టీడీపీ నాయకులు పీఎంపాలెం రెవెన్యూ అధికారులకు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ వార్డు అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, రెడ్డి సత్యనారాయణ, సర్వ దేవుళ్ళు మాట్లాడుతూ సర్వే నంబరు 35లో ఉన్న ప్రభుత్వ స్థలంలో రైతుబజార్ ఏర్పాటు చేయాలన్నారు. పీఎంపాలెం పునరావాస కాలనీ ఏర్పడి మూడున్నర దశాబ్దాలు పూర్తయినా రిజిస్ట్రేషన్‌లకు అవకాశం ఇవ్వకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అలాగే పీఎంపాలెం కాలనీ ప్రధానరహదారికి సమీపంలో ఉన్న సూపర్‌బజార్ వెనుక రహదారి స్థలం కబ్జాకు గురైందని, సర్వే చేసి ఆక్రమణలను తొలగించాలన్నారు.

సంక్షేమ భవనాన్ని సచివాలయంగా మార్చాలి : సీపీఐ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు రాంబాబు

తగరపువలస, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస బంతాట మైదానంలో ఉన్న జూట్‌మిల్లు కార్మిక సంక్షేమ భవనాన్ని గ్రామ సచివాలయంగా మార్చు చేయాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం తగరపువలస జీఆర్ భవన్‌లో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కానూరి రాంబాబు అధ్యక్షతన నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మిక సంక్షేమ భవనం ప్రస్తుతం నిరుపయోగంగా ఉండి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందన్నారు. చిట్టివలస గ్రామస్తులు చిల్లపేట సమీపంలో బొగ్గు రోడ్డులో ఉన్న సచివాలయానికి వెళ్లడానికి వ్యయ ప్రయాసాలకు గురవుతున్నారని చెప్పారు. ఈనేపథ్యంలో చిట్టివలస కూడలిలో అందరికీ అందుబాటులో ఉండేలా కార్మిక సంక్షేమ భవనంలో సచివాలయం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు మోర అప్పలరాజు, సన్నిబాబు, లక్ష్మణరావు, అప్పారావు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

భీమిలి జడ్జి నాగేశ్వరరావుకు బదిలీ



జడ్జి నాగేశ్వరరావును సన్మానిస్తున్న దృశ్యం

భీమునిపట్నం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : భీమిలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నాగేశ్వరరావుకు పదోన్నతిపై అనకాపల్లి సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ అయ్యింది. ఈ సందర్భంగా గురువారం భీమిలి కోర్టులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పట్టణ ఫస్ట్ ఏడీఎం కోర్టు జడ్జి సౌజన్య, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎంవీ పార్వతీశం, కేఎస్ఎం సుధాకర్, ఏజీపీ ఎంసీహెచ్ పాత్రుడు, కోశాధికారి ఎం. సునీల్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ గిరిజన యువ సమ్మేళనం



బహుమతులు పొందిన వారితో నెహ్రూ యువ కేంద్రం అధికారులు

ఎండాడ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గీతం వేదికగా నిర్వహిస్తున్న జాతీయ యువజన గిరిజన సమ్మేళనం గురువారంతో ముగిసింది. నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ ఏపీ రాష్ట్ర సంచాలకుడు అన్షుమన్ దాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సమ్మేళనంలో భాగంగా నిర్వహించిన పోటీల్లోని విజేతలకు ఆయన బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హోం మంత్రిత్వ శాఖ సెక్షన్ ఆఫీసర్ దినేశ్ కుమార్ మీనా, గీతం వర్సిటీ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్‌వీజీ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

32 రోజుల నృసింహ దీక్షలు ప్రారంభం



భక్తులకు మాలలు వేస్తున్న అర్చకుడు

సింహాచలం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) :వరాహలక్ష్మీనృసింహస్వామి దీక్షల్లో భాగమైన ద్వాత్రింశతి (32) రోజుల దీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలుత స్వామివారికి సుప్రభాత సేవలు పూర్తిచేశారు. చందన మాలలు, పుష్పమాలికలు, రాగి మాడలును శిరస్సున దాల్చి మంగళవాయిద్యాల నడుమ దేవస్థానం ఈఓ త్రినాధరావు, ఏఈఓ ఆనందకుమార్, స్థానాచార్యులు రాజగోపాల్, ప్రధానార్చకులు శ్రీనివాసాచార్యులు, రమణాచార్యులు బేడా మండపంలో ప్రదక్షిణలు చేసి అంతరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం ప్రధాన రాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన వేదికపై ఉంచిన సింహాద్రినాథుని విగ్రహానికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితులు చతుర్వేదాలను పఠిస్తుండగా. స్థానిక చందన పెరుమాళ్ పీఠం, సింహాద్రి మఠం సారథ్యంలో వందలాది మంది నృసింహ దీక్షలు చేపట్టారు.

గ్రీన్ బెల్ట్ కబ్జా

... 5వ పేజీ తరువాయి

ఏరియా మొత్తం కాంక్రీట్ వేసేసి, నిర్మాణంలో భాగంగా మార్చేసుకున్నారు. ప్రభుత్వం మారడంతో ఇప్పుడు కూటమి నేతల ఫొటోలతో ఫ్లెక్సీలు పెట్టి పనులు జరిపిస్తున్నారు.

ఎమ్మెల్యే విష్ణు ఫిర్యాదుతో...

విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు గురువారం అటువైపు వెళుతూ గ్రీన్ బెల్ట్ మొత్తం నాశనం చేసి ఆక్రమించిన వైనం గుర్తించి తక్షణమే జీవీఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రీన్‌బెల్ట్‌ను కాపాడాల్సిన బాధ్యత జీవీఎంసీపై ఉందని, అంత అడ్డగోలుగా పనులు చేస్తుంటే ఎందుకు చర్యలు చేపట్టడం లేదని ప్రశ్నించారు. ఆ షాపింగ్ మాల్ స్థలంలో ప్రభుత్వ స్థలం కూడా ఉందని, తనకు అనుమానంగా ఉందన్నారు. వారికి మాల్ నిర్మాణం కోసం ఇచ్చిన అనుమతులు ఏమిటి?, వారు చేపడుతున్న నిర్మాణం ఏమిటి?...మొత్తం పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రీన్ బెల్ట్‌ను నాశనం చేసినందుకు వారిపై క్రిమినల్ చర్యలు చేపట్టాలన్నారు. ఎమ్మెల్యే మధ్యాహ్నం 12 గంటలకు ఫిర్యాదు చేయగా...జీవీఎంసీ అధికారులు స్పందించి సాయంత్రం ఐదు గంటలకు అక్కడకు చేరి గ్రీన్ బెల్ట్‌లో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను కూలగొట్టారు. అయితే ఆ పని పూర్తిస్థాయిలో జరగలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అమ్మవారి ఉత్సవంలో మళ్లీ అదే తీరు

- అడుగడుగునా పోలీసులు
- ఆగని అడ్డగోలు దర్శనాలు



ప్రధాన ద్వారం వద్ద గుమిగూడిన జనం కంట్రోల్ చేయలేకపోతున్న పోలీసులు

విశాఖపట్నం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వన్‌టౌన్ కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర ఉత్సవాల్లో సామాన్యులకు దర్శనం గగనమైపోతోంది. అమ్మవారికి ప్రీతికరమైన గురువారాల్లో వీఐపీల తాకిడి పెరిగి ధర్మ దర్శనానికి గంటల సమయం పడుతోంది. దీంతో ప్రధాన ద్వారం వద్ద తోపులాట జరుగుతోంది. అమ్మవారి సన్నిధిలోను అదే పరిస్థితి.ప్రధాన ద్వారం పక్కనే పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేశారు. బందోబస్తులో 800 మంది పోలీసులున్నారు. భక్తులను లైన్లలో పంపితే రద్దీ ఉండదు. కానీ ప్రధాన ద్వారం నుంచి వీఐపీల పేరుతో అడ్డగోలు దర్శనాలతో గుంపులుగా చేరుతున్నారు. వందల మంది పోలీసులుండి భక్తులను క్యూలైన్లలో పంపలేకపోవడమేమిటో అధికారులే చెప్పాలి. అమ్మవారి సన్నిధిలో పదిమంది కంటే ఎక్కువ పట్టరు. అక్కడ సగం మంది (ఐదుగురు) పోలీసులే ఉంటున్నారు. సాఫీగా సాగాల్సిన క్యూలైన్లు గంటల కొద్దీ కదలకపోవడంతో చాలా మంది అక్కడే కూర్చొండిపోతున్నారు.

లోన్ యాప్‌ల ఆగడాలు

... 5వ పేజీ తరువాయి

రుణం వస్తుందనే ఉద్దేశంతో ఫోన్ చేయడం లేదా లింక్ క్లిక్ చేయడం చేస్తున్నారు. రుణం మంజూరు చేసినప్పుడే టర్మ్స్ అండ్ కండీషన్స్ పేరుతో బాధితుడి ఫోన్‌లోని కాంటాక్ట్స్, ఫొటో గ్యాలరీ యాక్సిస్‌ను యాప్‌ల నిర్వాహకులు తీసుకుంటారు. దీనివల్ల ఫోన్‌లోని ఫొటోలు, కాంటాక్ట్ నంబర్లు వంటి వివరాలన్నీ యాప్‌ల నిర్వాహకులు చేతుల్లోకి వెళ్లిపోతాయి. లోన్ మంజూరుచేసిన తర్వాత రోజు నుంచి తిరిగి చెల్లింపుల కోసం ఒత్తిడి ప్రారంభిస్తారు. వాయిదాలను సకాలంలో కట్టకపోయినా, వారు చెప్పినంత వడ్డీ చెల్లించకపోయినా ఫోన్‌లోని కాంటాక్టు నంబర్లు అన్నింటికీ మార్ఫింగ్ చేసిన ఫొటోలు పంపిస్తారు. దీంతో బాధితులు అవమాన భారంతో తీవ్రమైన నిర్ణయాలు తీసుకుంటున్నారు. కొన్నాళ్ల కిందట ఎండాడ పనోరమ హిల్స్‌లో నివాసముంటున్న ఒక మహిళ సెల్‌ఫోన్‌కు రూ.30 వేలు రుణం అర్హత ఉందంటూ మెసేజ్ వచ్చింది. అదేమిటో తెలుసుకునేందుకు మెసేజ్‌ను ఓపెన్‌చేసిన వెంటనే ఫోన్ పే ద్వారా ఆమె ఖాతాకు రూ.1,240 జమ అయ్యాయి. వెంటనే 'మీరు లోన్ తీసుకున్నందున వాయిదాలు కట్టాలని ఎవరో ఫోన్‌చేసి అడగడం ప్రారంభించారు. బాధితురాలు దానిని తేలిగ్గా తీసుకుని ఆ నంబర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టేశారు. దీంతో సదరు మహిళ ఫొటోలను యాప్ నిర్వాహకులు మార్ఫింగ్ చేసి ఆమె సెల్‌ఫోన్ కాంటాక్టులోని నంబర్లకు పంపించసాగారు. ఆ విషయం తెలిసి ఆందోళనకు గురైన ఆమె వాళ్లు అడిగిన రూ.20 వేలు మొత్తాన్ని ఫోన్‌పే ద్వారా కట్టేశారు. అయినప్పటికీ ఇంకా వేధింపులు కొనసాగించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విదేశాల నుంచే నిర్వహణ

ఇన్‌స్టంట్ లోన్ యాప్‌ల నిర్వాహకులంతా విదేశాల్లో ఉంటూ కార్యకలాపాలు సాగిస్తుంటారు. కాల్‌సెంటర్ ఏర్పాటుచేసుకుని అన్ని భాషలు మాట్లాడగలిగే వారిని ఉద్యోగాల్లో పెట్టుకుంటారు. ఏ రాష్ట్రానికి చెందిన వారితో మాట్లాడాల్సి వస్తే ఆ రాష్ట్ర భాష మాట్లాడే వారితో ఫోన్ చేయిస్తారు. ఒకవేళ ఎవరైనా పోలీసులకు ఫిర్యాదు చేసినాసరే తమ ఉనికి తెలియకుండా ఉండేందుకు దొంగపత్రాలతో పొందిన సిమ్‌కార్డులు, బ్యాంక్ ఖాతాలను వాడుతున్నారు. దీనివల్ల నిందితులను పట్టుకోవడం పోలీసులకు సవాల్‌గా మారుతోంది.

లోన్‌యాప్‌ల వలలో పడొద్దు

- కె.భవానీప్రసాద్, సైబర్‌క్రైమ్ సీఐ



లోన్‌యాప్‌లు యమపాశాలు వంటివి. ఒకసారి వాటి వలకు చిక్కితే జీవితకాలం ఇబ్బందులు పడాల్సి ఉంటుంది. ఎవరు వాటి జోలికి వెళ్లొద్దు. ఎవరైనా లోన్ ఇస్తామని మెసేజ్‌లు పంపినా, గుర్తుతెలియని లింక్‌లు వచ్చినా వాటికి స్పందించకూడదు. కొంతకాలంగా స్తబ్దుగా ఉన్న లోన్‌యాప్‌ల నిర్వాహకుల ఆగడాలు మళ్లీ మొదలయ్యాయి. లోన్‌యాప్‌ల మోసాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు సీపీ శంఖబ్రతబాగ్చి ఆదేశాలు మేరకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

ముత్తంశెట్టి రాజీనామాతో వైసీపీలో కలవరం

... 5వ పేజీ తరువాయి

వెళ్లిపోతున్నారు. ఈ నేపథ్యంలో హఠాత్తుగా గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి భీమిలి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి పదవితోపాటు పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించడంతో ఆ పార్టీ నేతలు ఉలిక్కిపడ్డారు. ఎన్నికల్లో ఓటమి తరువాత జగన్మోహన్‌రెడ్డి అన్నీ సమీక్షించుకొని, తప్పులు సరిచేసుకొని పార్టీని ముందుకు తీసుకువెళతారని భావించానని, కానీ అటువంటిదేమీ కనిపించలేదని ఆయన వ్యాఖ్యానించారు. ముత్తంశెట్టి బాటలో మరికొందరు వైసీపీని వీడనున్నారనే ప్రచారం జరుగుతోంది. దీంతో అసంతృప్తులను గుర్తించి బుజ్జగించాలని ఆ పార్టీ పెద్దలు భావిస్తున్నట్టు తెలిసింది.

ప్రాణాలు తీస్తున్న నిర్లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

హెల్మెట్ ధరించకపోవడం వల్లే మృతిచెందినట్టు పోలీసుల దర్యాప్తులో గుర్తించారు. 2024 జనవరి నుంచి నవంబరు వరకూ జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 290 మంది మృతిచెందగా, వారిలో 173 మంది ద్విచక్ర వాహనదారులు ఉన్నారు. వారిలో వంద మంది హెల్మెట్ ధరించకపోవడం వల్లే మృతిచెందినట్టు పోలీసులు గుర్తించారు. హెల్మెట్ ధారణ ఆవశ్యకతపై పోలీసులు ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా, జరిమానాలు విధిస్తున్నా సరే వాహన చోదకుల ధోరణిలో మాత్రం మార్పు కనిపించడం లేదు. పోలీసులను తప్పించుకునే యత్నంలో ఒక్కోసారి ఇతర వాహనాలను ఢీకొట్టి ప్రమాదాల బారినపడుతున్నారు.

ట్రాఫిక్ చలాన్‌లు విధించడంతోనే సరి...

హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనం నడుపుతున్న వారిని సెల్‌ఫోన్‌తో ఫొటో తీసి ఈ-చలాన్ జారీచేయడంతో తమ పని అయిపోయిందన్నట్టు పోలీసులు చేతులు దులిపేసుకుంటున్నారు తప్ప, అదే తప్పు మరోసారి చేయకుండా చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు. నగరంలో ట్రాఫిక్ విధులు నిర్వర్తించే పోలీసులతోపాటు ఇతర విభాగాల్లోని సిబ్బంది, అధికారులకు ఉన్నతాధికారులు ఈ-చలాన్‌లు టార్గెట్ ఇస్తున్నారు. ప్రతిరోజూ టార్గెట్ మేరకు సెల్‌లో ఫొటోలు తీయాలని ఒత్తిడి చేస్తున్నారు. దీంతో పోలీసులు కూడళ్ల వద్ద నిలబడి ఎవరు హెల్మెట్ లేకుండా వస్తున్నవారిని ఆపి సెల్‌ఫోన్‌తో ఫొటో తీసి పంపించేస్తున్నారు. జరిమానా విధించడంతో పాటు హెల్మెట్ కొనుగోలు చేసుకుని తీసుకువచ్చిన తరువాత వాహనం విడిచిపెడతామని షరతు విధిస్తే పరిస్థితి చాలావరకూ పరిస్థితి మారేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా హైకోర్టు కూడా ఇదే అంశంపై పోలీసుల తీరును తీవ్రంగా తప్పుపట్టింది. మూడు నెలల కాలంలో హెల్మెట్ ధరించని కారణంగా రాష్ట్రంలో 667 మంది మరణించడంపై ఆగ్రహం వ్యక్తంచేసింది. పోలీసులు జరిమానాలు విధించి చేతులు దులుపుకుంటున్నారని, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంలో విఫలమవుతున్నారంటూ వ్యాఖ్యానించింది. హైకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో నగర పోలీస్ ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే వారిపై చట్టపరంగా అందుబాటులో ఉన్న కఠిన చర్యలను తీసుకోవాలని యోచిస్తున్నట్టు సమాచారం. తద్వారా నగరంలో రోడ్డు ప్రమాదాల కారణంగా సంభవించే మరణాలకు అడ్డుకట్ట వేయవచ్చునని ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

ఉక్కులో గందరగోళం

... 5వ పేజీ తరువాయి

విభాగాలు దేనికవే ప్రత్యేకత ఉన్నవి. ఇక్కడ ముడి పదార్థాలు అందుబాటులో లేక పూర్తిస్థాయిలో ఉత్పత్తి జరగక నష్టాలు వస్తున్నాయి. ముడి పదార్థాలు ఇస్తే ఏ సమస్య ఉండదు. అదే మార్కెటింగ్ బృందం 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.28 వేల కోట్ల ఉత్పత్తులను విక్రయించింది. అదో రికార్డు. అటువంటి ప్లాంటు మార్కెటింగ్ విభాగానికి సెయిల్ నుంచి అధికారులను తేవలసిన అవసరం ఏమిటనేది స్పష్టం చేయాల్సి ఉంది. దక్షిణ భారతదేశంలో విశాఖ ఉక్కుకు ప్రధాన పోటీదారు సెయిలే. రీబార్లు అమ్మకాల్లో విశాఖ స్టీల్‌దే పైచేయి. ఇప్పుడు డిప్యుటేషన్‌పై చీఫ్ జనరల్ మేనేజర్, జనరల్ మేనేజర్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్లను తీసుకువచ్చి నియమించారు. వారు సెయిల్ నుంచి జీతం తీసుకుంటారు. విశాఖ ఉక్కును పోటీగా భావించే ఆ అధికారులు ఇక్కడ ఎవరి ఉత్పత్తులు ప్రమోట్ చేస్తారనేది అనుమానమే. అయినా ఇక్కడ అమ్మడానికి అంత పెద్దమొత్తంలో ఉత్పత్తులే లేనప్పుడు వారిని తీసుకురావడం దేనికో అర్థం కావడం లేదని ఉద్యోగ వర్గాలు అంటున్నాయి. విశాఖ స్టీల్ మార్కెటింగ్ వ్యూహాలు తెలుసుకోవడానికా?, లేదంటే ఇక్కడి మార్కెట్‌లో సెయిల్ ఉత్పత్తులు ప్రమోట్ చేసుకోవడానికా?...అని ప్రశ్నిస్తున్నాయి. అదేవిధంగా సెయిల్ నుంచి వచ్చిన అధికారులు ఇక్కడ పనిచేస్తున్న వారి కంటే జూనియర్లు. సెయిల్‌లో ప్రమోషన్ పాలసీ అమలు చేయడం వల్ల వారికి త్వరగా పదోన్నతులు వచ్చి ఆ స్థాయికి చేరారు. ఇక్కడ పదహారేళ్లుగా ఎవరికీ పదోన్నతులు లేవు. వేరే ప్లాంటు నుంచి జూనియర్లను తీసుకువచ్చి వారి కింద పనిచేయాలని చెప్పడంపై ఉద్యోగ వర్గాల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. విశాఖ ఉక్కును నాశనం చేయడానికే ఇలా చేస్తున్నారని ఆరోపిస్తున్నాయి. దీనిపై తక్షణమే కేంద్ర ప్రభుత్వంతో పాటు స్థానిక నేతలు కూడా స్పందించాలని డిమాండ్ చేస్తున్నాయి.

ప్రైవేటు కళాశాలల హాస్టళ్లపై దృష్టి

... 5వ పేజీ తరువాయి

జీవీఎంసీ ఆరోగ్య విభాగం, వైద్య ఆరోగ్య శాఖల నుంచి ఒక్కొక్క ఉద్యోగిని నియమించారు. వీరంతా గడచిన రెండు రోజుల నుంచి నగరంలో హాస్టళ్లను తనిఖీ చేస్తున్నారు. విశ్వసనీయంగా అందిన సమాచారం మేరకు...కొన్నిచోట్ల హాస్టళ్ల నిర్వహణ అధ్వానంగా ఉంది. విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు ఉండవు. ఉన్నవాటి నిర్వహణ కూడా అంతంతమాత్రమే. గదుల్లోకి వెలుతురు సరిగా రావడం లేదు. చాలా హాస్టళ్లలో భోజనం కూడా బాగుండడం లేదు. రెండు, మూడు రోజుల్లో మొత్తం హాస్టళ్లను తనిఖీలు పూర్తిచేసి కలెక్టర్‌కు నివేదిక అందజేయనున్నారు.

☛ సంక్షిప్తంగా..

కేంద్రకారగారంలో సెక్యూరిటీకి పటిష్ట చర్యలు

» సూపరింటెండెంట్ మహేశ్‌బాబు



ఆరిలోవ, డిసెంబరు 12 : (ఆంధ్రజ్యోతి) : కేంద్ర కారాగారంలో సెక్యూరిటీపరంగా పటిష్ట చర్యలు చేపట్టినట్టు సూపరింటెండెంట్ మహేశ్‌బాబు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కారాగారంలోకి వెళ్లే సిబ్బంది లంచ్ బాక్సులను వెలుపలే ఉంచేందుకు ఏర్పాటు చేశామన్నారు. లంచ్ బాక్సులను సిబ్బంది తమ అడ్మిన్ కార్యాలయాల వద్ద ఉంచుకోవాలని సూచించినట్టు చెప్పారు. మధ్యాహ్నం భోజనాలు అందుకోసం ఏర్పాటు చేసిన గదుల్లోనే చేయాలని స్పష్టం చేశామన్నారు. ప్రతి వ్యక్తిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాత లోపలకు అనుమతి ఇస్తున్నామన్నారు. బ్యారక్స్ తనిఖీలకు వెళ్లినప్పుడు తనకు కూడా పూర్తిగా తనిఖీ చేయమని స్పష్టం చేశానన్నారు. సీసీ కెమెరాల సంఖ్యను పెంచినట్టు తెలిపారు.

ప్రస్తుతం కారాగారంలో సుమారు 1100 మంది గంజాయి కేసుల్లో నిందితులు, 12 మంది రౌడీషీటర్లు ఉన్నట్టు సూపరింటెండెంట్ తెలిపారు. వీరికి కౌన్సెలింగ్ ఇస్తున్నట్టు చెప్పారు.

జైలులో 7 వాచ్‌టవర్‌లో ప్రతినిత్యం ఏపీ బెటాలియన్‌కు చెందిన నలుగురు సిబ్బంది రెండు గంటల పాటు నిశిత పహారా కాస్తున్నట్టు చెప్పారు. ప్రతి రెండు గంటలకు వీరు షిఫ్టులు మారుతుంటారన్నారు. ప్రస్తుతం ముగ్గురు డీఎస్పీలు ఉన్నారని తెలిపారు. కేంద్ర కారాగారం సామర్థ్యం పెంచే క్రమంలో కొత్తగా కొన్ని బ్లాకల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు వెల్లడించారు. ప్రస్తుతానికి ఈ జైలులో సుమారు 2014 మంది ఖైదీలు ఉన్నారని తెలిపారు.

ఎంవీపీ సర్కిల్‌ను అభివృద్ధి చేయండి



జీవీఎంసి కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న కార్పొరేటర్ మంగవేణి, పోలారావు

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ సర్కిల్‌ను సరికొత్త మోడల్ మాడ్యులర్ పార్కుగా ఆధునీకరించాలని పద్దెనిమిదో వార్డు కార్పొరేటరు గొలగాని మంగవేణి పోలారావు జీవీఎంసీ కమిషనర్‌ను కోరారు. జీవిఎంసం 18వ వార్డు పరిధిలోని సమతా కళాశాల సమీపంలో ఉన్న సర్కిల్ ఏళ్ల తరబడి అభివృద్ధి చేయకుండా వదిలేశారని పేర్కొన్నారు. స్మార్ట్‌సిటీ నిధులతో వివిధ కూడళ్లను అందంగా రూపొందిస్తున్న నేపథ్యంలో ఈ సర్కిల్‌ను కూడా అభివృద్ధి చేయాలని కోరారు.

సినిమా గైడ్

● **పుష్ప-2 :** జగదాంబ, శారద, రమాదేవి, శ్రీవెంకటేశ్వర, వెంకటేశ్వర, శ్రీకన్య సంగం, శరత్, మెలోడి, శరత్, కిన్నెర, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ, నరసింహ, సుకన్య, సౌజన్య, మౌర్య (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని, లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1,2 (పెందుర్తి), శ్రీరాములమ్మ, గణేష్, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 52, టమాటా 26, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 22, పచ్చిమిర్చి 24, కాకరకాయలు 34, బీరకాయలు 38, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 16, క్యాబేజి 18, క్యారెట్ 60 దొండకాయలు 30, బంగాళ దుంపలు 34, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 120, అల్లం (పాతది)56, బరబాటి 26, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 55, గోరుచిక్కుడు 24 దోస కాయలు 24, వె ల్లుల్లి (పెద్దవి) 300, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 60, పొటల్స్ 48, కీరదోస 28, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40, చిలగడ దుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 46, కొండఉసిరి 55, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, క్యాప్సికమ్ / క్యాప్సికంపెండలం 28, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	615
విజయనగరం	619
శ్రీకాకుళం	619

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	93
ఫారం ధర	113
విత్ స్కిన్	196
స్కిన్‌లెస్	206

ఆహార ప్రయోగశాలలో టెస్ట్‌లు చేపట్టరా?

» పనితీరుపై బీజేపీ విశాఖపట్నం పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర అసంతృప్తి



ఆహార ప్రయోగశాలను సందర్శించి సిబ్బందితో మాట్లాడుతున్న రవీంద్ర

పెదవాల్తేరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రధాన నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించిన రాష్ట్ర ఆహార ప్రయోగశాలలో ఒక్క టెస్ట్ కూడా చేపట్టకపోవడం ఆశ్చర్యంగా ఉందని బీజేపీ విశాఖపట్నం పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం ఆయన ప్రభుత్వ ఈఎన్‌టీ ఆస్పత్రి సమీపంలోని ఫుడ్ సేఫ్టీ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర ఆహార ప్రయోగశాలను సందర్శించారు. ఇప్పటి వరకూ ఒక్క టెస్ట్ కూడా చేపట్టలేకపోయామని సిబ్బంది చెప్పడంతో ఆశ్చర్యపోయారు. అనంతర ఆయన మాట్లాడుతూ తక్షణమే అధికారులు ఇక్కడ సిబ్బందికి పరిపడా పరికరాలు, రసాయనాలను సమకూర్చి టెస్టులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇక్కడ కొంతమంది సిబ్బంది ఉన్నా అవసరమైన పరికరాలు, సామగ్రి లేకపోవడంతో టెస్ట్‌లు నిర్వహించలేకపోవడం శోచనీయమన్నారు. ఫుడ్ టెస్టింగ్ లాబ్స్ లేకపోవడం వల్ల ఆహార కల్తీని అరికట్టడం కష్టమవుతోందన్నారు.

ఇటీవల తాను రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌ను కలిసిన సందర్భంగా ఇక్కడ పరిస్థితిని వివరించానన్నారు. దీంతో మంత్రి స్పందిస్తూ.. త్వరలోనే మిగిలిన సిబ్బంది, అవసరమైన పరికరాలను అందజేయనున్నట్టు తెలిపారన్నారు. ఈ నేపథ్యంలోనే ఆహార ప్రయోగశాలను సందర్శించినట్టు చెప్పారు.

ఇటీవల మానసిక చికిత్స కేంద్రంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ విభాగంలో కొన్ని ఏసీ మిషన్లు చోరీకి గురైనట్టు తెలిసిందని, ఇక్కడ పటిష్ట భద్రతా చర్యలు అవసరమన్నారు. ఇక్కడ కోట్ల రూపాయల పరికరాలు ఉన్నాయని, కాబట్టి పూర్తిస్థాయి భద్రత అవసరమన్నారు. ఇందుకోసం అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

15వ వార్డులో టీడీపీ సభ్యత్వాల నమోదు



సభ్యత్వాలు సేకరిస్తున్న కార్పొరేటర్ శ్రీవిద్య, టీడీపీ నేతలు సత్యనారాయణ, రవికుమార్ తదితరులు

వెంకోజీపాలెం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 15వ వార్డులోని కొత్త వెంకోజీపాలెం ఆంజనేయస్వామి ఆలయం వద్ద గురువారం కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, వార్డు అధ్యక్షులు బుగత సత్యనారాయణ, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్, బోర ధనరెడ్డి, సీహెచ్ గోవింద్, అప్పారి గిరిబాబు, తెలుగు మహిళా నేతలు టీడీపీ పార్టీ సభ్యత్వాలు సేకరించారు. సుమారు 250 మందికి సభ్యత్వ నమోదు చేయించినట్టు కార్పొరేటర్ తెలిపారు. రూ.100లతో సభ్యత్వాన్ని తీసుకుంటే బీమా సదుపాయం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బీసెట్టి జగదీస్, వరలక్ష్మి, మొల్లేటి కోటి, పెట్ల రాజు, ఎస్ఆర్‌జే.నాయుడు, సంపంగి సురేష్, సోని, సన్యాసమ్మ, గ్రామ పెద్దలు, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

కౌశల్-24 రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు వీరే



విద్యార్థుల పేర్లను ప్రకటిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్

విశాఖపట్నం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కౌశల్-2024 జిల్లా స్థాయి సైన్స్ ప్రతిభా అన్వేషణ పోటీల ఫలితాలను జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ గురువారం విడుదల చేశారు. ఇందులో ఎంపికైన విద్యార్థులు ఈ నెల 30న విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కి స్ట్రక్చర్ కళాశాలలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరు కావాలని పేర్కొన్నారు.

క్విజ్ టీమ్ 1: కణితి జెడ్పీ ఉన్నత పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థి టి.రోహిత, భీమిలి మునిసిపల్ హైస్కూల్ విద్యార్థి డి.మనోజ్, రేవిడి జెడ్పీ హైస్కూల్ విద్యార్థి మరగడ అశ్విని.

క్విజ్‌టీమ్ 2: జీవీఎంసీ 22వ వార్డు కేడీపీఎం హైస్కూల్ విద్యార్థి కె.డానియల్ నిరీక్షణ, భీమిలి కేజీబీవీ విద్యార్థి సోనియా, ఏడో వార్డు డాక్టర్ బీఆర్ఏఎంపీఎల్ హైస్కూల్ విద్యార్థి పి.సాయివర్ధన్.

పోస్టర్ విభాగంలో ఎనిమిదో తరగతి విభాగం నుంచి అడవివరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థి చైత్రవర్షిణి, క్వీన్‌మేరీ ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థిని మహిత, తొమ్మిదో తరగతి విభాగం నుంచి మధురానగర్ ఎంపీహెచ్ఎస్ నుంచి పి.చరణ్ కుమార్, 14వ వార్డు మున్సిపల్ హైస్కూల్ విద్యార్థిని ఎస్.వి జయదుర్గ ఎంపికయ్యారు. అలాగే పదో తరగతి విభాగం రీల్స్‌కు సంబంధించి నడుపూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థి ఎల్.కౌశిక్, రెండో వార్డు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని కృష్ణ హరిణి ఎంపికయ్యారు.

17వ వార్డులో ఎమ్మెల్యే వెలగపూడి పర్యటన



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వెలగపూడి

పెదవాల్తేరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : స్థానికంగా ఏ సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారిస్తానని తూర్పు నియోజకవర్గం శాసనసభ్యుడు వెలగపూడి రామకృష్ణ బాబు అన్నారు. గురువారం 17వ వార్డు పెదవాల్తేరు, ఇందిరా నగర్ తదితర ప్రాంతాలలో ఎమ్మెల్యే పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాళ్ల శంకర్, పోతన్న రెడ్డి, నరేంద్ర, కాకి శివ శంకర్ రెడ్డి, తారక్, జనసేన నాయకులు శ్రీనివాస్, పట్నాయక్, జీవీఎంసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వచ్చే నెల 10న వైకుంఠ ఏకాదశి

» సింహాచలం దేవస్థానం ఈవో త్రినాథరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఈవో త్రినాథరావు

సింహాచలం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : భక్తులందరికీ అప్పన్న స్వామి వైకుంఠ ద్వార దర్శనం కల్పించేందుకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని, అందుకు అవస రమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని దేవస్థానం ఈవో వేండ్ర త్రినాథరావు అధికారులను ఆదేశించారు. వచ్చే నెల 10న జరగనున్న వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని గురువారం ఆయన దేవస్థానం అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్సవంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీరు, క్యూలు, బారికేడ్లు ఏర్పాట్లతో పాటు నిత్యాన్న ప్రసాద విభాగం ద్వారా ప్రసాదం అందజేయాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా దేవస్థానం పరిధిలో ఉన్న సిసి కెమెరాల పనితీరును పరిశీలించి అవసరమైతే మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. సమావేశంలో దేవస్థానం స్థానాచార్యులు రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఈఈ దండుగణ శ్రీనివాసరాజు, ఈఈ బండారు రాంబాబు, ఏఈఓలు, పర్యవేక్షణాధికారులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు సమాయత్తం

పద్మనాభం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏడు సాగునీటి సంఘాలకు శనివారం ఎన్నికల నిర్వహణకు అధికారులు సమాయత్తమవుతున్నారు. ఆ ఒక్క రోజులోనే నామినేషన్ల స్వీకరణ, ఉపసంహరణ, ఎన్నిక నిర్వహణ, ఫలితాల వెల్లడి చేపడతారు. పోటీ ఉంటే చేతులు ఎత్తే పద్ధతి ద్వారా ఎన్నిక నిర్వహిస్తారు. ఒక్కో సాగునీటి సంఘానికి ఆరు ప్రాదేశిక నియోజకవర్గాలు (టీసీ) ఉంటాయి. ఇప్పటికే ఒక్కో సాగునీటి సంఘానికి ఒక ఎన్నికల అధికారి, సహాయ ఎన్నికల అధికారితో పాటు ఆరుగురు పోలింగ్ అధికారులు, ఆరుగురు పోలింగ్ సహాయకులతో 14 మంది సిబ్బంది చొప్పున 98 మందిని నియమించారు. ఎన్నికల నోడల్ అధికారిగా ఇరిగేషన్ డీఈఈ స్వామినాయుడు, అధీకృత అధికారిగా ఏఈ నళిని వ్యవహరిస్తారు. ఏడు సాగునీటి సంఘాల పరిధిలో 1475.98 ఎకరాల ఆయకట్టు ఉండగా 3462 మంది రైతులు ఓటర్లుగా నమోదయ్యారు.



సీఎం చంద్రబాబునాయుడు అధ్యక్షతన అమరావతిలోని సచివాలయంలో జరుగుతున్న జిల్లా కలెక్టర్ల సదస్సులో రెండో రోజు గురువారం హాజరైన కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్

సార్ఫ్ బ్రాంచ్‌ను సందర్శించిన ఎస్‌బీఐ డీజీఎం కేజీ రావు



బ్రాంచ్ ఆవరణలో మొక్కలు నాటుతున్న డీజీఎం రావు, ఏజీఎం విజయలక్ష్మి తదితరులు

సిరిపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సిరిపురంలోని స్టేట్ బ్యాంక్ ఇండియా సార్ఫ్ బ్రాంచ్‌ను హైదరాబాద్ సామ్రో డిప్యూటీ మేనేజర్ కేజీ రావు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వార్షిక సంవత్సరం రికవరీలో ఈ బ్రాంచ్ అద్భుత ప్రతిభ కనబరచిందన్నారు. భవిష్యత్‌లో కూడా అత్యధిక రికవరీలు సాధించాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. బ్రాంచ్ హెడ్, అసిస్టెంట్ జీఎం ఎం.విజయలక్ష్మి, సిబ్బందిని అభినందించారు. అనంతరం బ్రాంచ్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏజీఎం ఎం.విజయలక్ష్మి, చీఫ్ మేనేజర్లు బి.వరప్రసాద్, వై.శ్రీకాంత్, వై.కిరణ్‌చంద్ పాల్గొన్నారు.

కొత్త ఓటర్లు, సవరణకు దరఖాస్తులు స్వీకారం

వెంకోజీపాలెం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : విశాఖ తూర్పు, ఉత్తర నియోజకవర్గాల పరిధిలో 18, 19 సంవత్సరాలు నిండిన వారు నూతన ఓటు నమోదు చేసుకోవాలని జీవీఎంసీ జోన్-3 జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. నియోజకవర్గంలోని సమీపంలో గల సచివాలయంలో కొత్త ఓటరుగా నమోదు చేసుకోవలెనని చెప్పారు. ఈ నెల 24 ఆఖరి తేదీ అని ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి గల వారు సమీపంలో గల సచివాలయంలో దరఖాస్తు నింపి ఆధార్ కార్డు, పుట్టిన తేదీ, ఫోటో జత చేసి అందజేయాలని కోరారు. అలాగే ఓటరు కార్డులో చిరునామ, ఇతర వివరాలు మార్పు కోసం కూడా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వేరే నియోజకవర్గం నుంచి ఈ నియోజకవర్గంకి నివాసం మారిన వారు ఓటరు కార్డులో చిరునామ మార్పు కోసం గడువులోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసిన వారి ఇంటికి బీఎల్‌ఓలు వెళ్లి విచారణ చేశాక ఓటరు కార్డులు జనరేట్ అవుతాయని తెలిపారు. అనంతరం నెట్ సెంటర్‌లో కార్డు ప్రింట్ తీసుకోవాల్సి ఉంటుందని జెడ్సీ సూచించారు.

ఇసుక విక్రయాలు ప్రారంభం

ఆరిలోవ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అవసరమైన అందరికీ అందుబాటులోకి తీసుకు రావాలనే ఉద్దేశంతో ఇసుక అమ్మకాలకు ముడసర్లోవ చెరువు ఎగువ భాగాన (వనం అమ్మవారి ఆలయం ఎదురుగా) గల జీవీఎంసీ స్థలలో ఇసుక విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ గురువారం నుంచి ఇసుక విక్రయాలు ప్రారంభించారు. తొలి రోజు సుమారు 10 టన్నుల ఇసుక విక్రయించారు. ప్రస్తుతానికి ఇక్కడ 1600 టన్నుల ఇసుక నిల్వ ఉందని సిబ్బంది తెలిపారు. ఈ ఇసుకను శ్రీకాకుళం నుంచి తీసుకొస్తున్నట్టు తెలిపారు. ఇసుక అందుబాటులోకి రావడంతో భవన నిర్మాణదారులు అంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

14 నుంచి రెవెన్యూ సదస్సులు

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : తూర్పు నియోజకవర్గం పరిధిలో ఈ నెల 14 నుంచి 19వ తేదీ వరకూ వివిధ వార్డుల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తెలిపారు. 14న రవీంద్రనగర్ చివరి బస్టాపు వద్ద 9, 10, 11 వార్డులకు సంబంధించి, 16న ఆరిలోవ హిందీ కళాశాల వద్ద 12, 13 వార్డులకు సంబంధించి, 17న కృష్ణా కళాశాల ఆవరణలో 15, 16, 23 వార్డుల్లోని వారికి, 19న పెదవాల్తేరు గాంధీ సెంటర్ వద్ద 18, 19, 20, 21, 22 వార్డులకు సంబంధించి రెవెన్యూ సదస్సులు ఉంటాయని వెల్లడించారు. ఈ సదస్సులను నియోజకవర్గం ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

కార్పొరేటర్ క్షమాపణ చెప్పాలి

» సచివాలయ ఉద్యోగుల నిరసన

సిరిపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో చేసిన అనుచిత వ్యాఖ్యలపై సచివాలయ ఉద్యోగులు గురువారం సాయంత్రం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలియేశారు. సచివాలయ ఉద్యోగులకు ఏం పనిలేదని, ఖాళీగా ఉన్నారని చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ఉద్యోగులు శాంతియుతంగా మొబైల్ లైట్ వేస్తూ నిరసన తెలిపారు. ఉద్యోగులకు వెంటనే క్షమాపణ చెప్పాలని, ఒక రోజంతా సచివాలయ ఉద్యోగులతో విధి నిర్వహణలో పాల్గొంటే ఉద్యోగులు ఏం చేస్తున్నారో తెలుస్తుందని హితవు పలికారు. ఏ ప్రభుత్వ శాఖలో లేని విధంగా ఒక ఉద్యోగంతో అన్ని ప్రభుత్వ శాఖల విధులు చేస్తున్నది సచివాలయ ఉద్యోగులు మాత్రమేనన్నారు కార్యక్రమంలో పలువురు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యామండలి సదస్సులో ఏయూ వీసీ



సదస్సులో పాల్గొన్న వీసీ, రిజిస్ట్రార్

వెంకోజీపాలెం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఉన్నత విద్యా మండలి వర్చువల్ విధానంలో నిర్వహించిన సదస్సులో ఏయూ వీసీ జి.శశిభూషణరావు పాల్గొన్నారు. ఉన్నత విద్యా మండలి ఇన్‌చార్జి ఛైర్మన్ కె.రామ్మోహన్ రావు రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల ఉప కులపతులతో ఈ సమావేశంలో ప్రసంగించారు. ప్రధానంగా స్వర్ణాంధ్ర 2047 అంశం దిశగా చర్చించారు. రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయ్‌రావు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులపై అవగాహన కలిగించండి

» టీడీపీ శ్రేణులకు ఎమ్మెల్యే వెలగపూడి సూచన



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణబాబు

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల నిర్వహణకు సహకారం అందించాలని తూర్పు నియోజకవర్గం శాసనసభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే కార్యాలయం ఆవరణలో గురువారం వివిధ వార్డుల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల్లో సదస్సు పట్ల అవగాహన కల్పించడం, భూ కొలతల్లో తేడాలు, సర్వే నెంబర్లలో మార్పులు, వారసత్వ పేర్ల నమోదు, సరిహద్దు సమస్య, భూ విస్తీర్ణంలో తేడాలు, రీ-సర్వే రికార్డుల్లో నమోదైన తప్పులు, కబ్జాలతో ప్రజలు కోల్పోయిన భూములు వంటి వాటిపై వినతులు సమర్పణకు ప్రజలకు సహకారం అందించాలని సూచించారు. ఈ సమావేవలో నియోజకవర్గం పరిధిలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్విజ్ పోటీలో కృష్ణా కళాశాల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న వైస్ ప్రిన్సిపాల్ జయ, అధ్యాపకులు

మద్దిలపాలెం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కేరళలోని కొచ్చిన్ నగరంలో నిర్వహించిన జాతీయ స్థాయి క్విజ్ పోటీల్లో డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు తృతీయ బహుమతి గెలుచుకున్నారు. విజేతలుగా నిలిచిన బీఎస్సీ తృతీయ సంవత్సరం విద్యార్థులు ఎస్.నవీన్, ఎం.నానిలను కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, అధ్యాపకులు అభినందించారు.

ఈ సందర్భంగా జయ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 12 బృందాలు ఈనెల 11న క్విజ్ పోటీల్లో పాల్గొనగా, తమ కళాశాల విద్యార్థులు మూడో స్థానంలో నిలవడం ఆనందంగా ఉందన్నారు. తమ కళాశాల నుంచి చాలా మంది విద్యార్థులు అనేక పోటీల్లో తమ సత్తా చాటుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎస్.పద్మావతి, పి.స్వామినాయుడు, శ్రావణ్‌కుమార్, రవిబాబు, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు

» ప్రేమ పేరుతో బాలికకు వేధిస్తుండడంతో ఫిర్యాదు

మద్దిలపాలెం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రేమ పేరుతో బాలికను వేధింపులకు గురి చేస్తున్న యువకుడిపై గురువారం మూడోపట్టణ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. సీఐ రమణయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

చినవాల్తేరులో నివాసముంటున్న పి.ధనుష్ (20) అదే ప్రాంతానికి చెందిన బాలికను గత ఏడాదిన్నరగా ప్రేమ పేరుతో వెంటపడుతున్నాడు. వివాహం చేసుకుంటానని అత్యాచారం చేశాడు. బాలిక కుటుంబానికి ఈ విషయం తెలిసి ధనుష్‌ను నిలదీశారు. బాలికకు పద్దెనిమిది ఏళ్లు పూర్తయ్యాక వివాహం చేసుకోవాలని అడిగారు. అందుకు ధనుష్ నిరాకరించకడంతో మళ్లీ తమ కుమార్తె జోలికి రావద్దని హెచ్చరించారు. అయినప్పటికీ ధనుష్ బాలిక వెంటపడి వేధింపులకు గురి చేస్తుండడంతో మూడో పట్టణ పోలీసుల ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు ధనుష్‌ను అదుపులోకి తీసుకుని పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏయూకు టెక్సాస్ ఏ అండ్ ఎం వర్సిటీ బృందం



ఏయూను సందర్శించిన టెక్సాస్ ఏ అండ్ ఎం ఆచార్యులు

వెంకోజీపాలెం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి) : ఏయూను అమెరికాలోని టెక్సాస్ ఏ అండ్ ఎం యూనివర్సిటీ ఆచార్యులు గురువారం సందర్శించారు. గ్రాడ్యుయేట్ స్టడీస్ విభాగం డీన్ టింగ్‌లు, పబ్లిక్ హెల్త్ విభాగం ప్రొఫెసర్ విజయ్ గొల్లా, ఏయూ వీసీ జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఈఎస్ ధనుంజయరావుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రెండు వర్సిటీల మధ్య సంయుక్తంగా పనిచేసే అంశం దిశగా చర్చించారు. సంయుక్తంగా కోర్సులు నిర్వహణ, పరిశోధనా రంగంలో కలిసి పనిచేయడం తదితర అంశాలపై ప్రాథమిక చర్చలు జరిపారు. కంప్యూటర్ సైన్స్ మేనేజ్‌మెంట్ స్టడీస్, ఆటిజంకు సంబంధించిన కోర్సుల నిర్వహించడానికి వీరు ఆసక్తి వ్యక్తం చేశారు. రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పక్కదారి పడుతున్న పేదల బియ్యం

రేషన్ డిపోలపై పర్యవేక్షణ కరువు



ఎండీయూ వాహనం వద్ద సరుకులు తీసుకుంటున్న కార్డుదారులు

కంచరపాలెం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రేషన్ డిపోలు, ఎండీయూ వాహనాలపై పౌరసరఫరాల అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల పేదల బియ్యం పక్కదారిపడుతున్నాయి. కంచరపాలెం పరిసర ప్రాంతాల్లో ఈ పరిస్థితి మరీ తీవ్రంగా ఉండడంతో పేదలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిరుపేదలకు రేషన్ సరుకులు అందించడానికి ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి బియ్యం, పంచదార, కందిపప్పు సరుకులు అందిస్తుంది. అయితే వీటిని కార్డుదారులకు అందజేయడంలో డీలర్లు, ఎండీయూ వాహనదారులు తమ చేతివాటాన్ని చూపుతున్నారు. రైతుబజారు ప్రాంగణంలోని ఒకటో సర్కిల్ కార్యాలయంలో పేదలకు సరుకులు సక్రమంగా పంపిణీ జరుగుతుందా ? లేదా ? పర్యవేక్షించడానికి 8 మంది ఆర్ఐలు ఉన్నారు. అయితే చాలా మంది రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు తూతూమంత్రంగా తనిఖీలు నిర్వహిస్తుండడంతో డీలర్లు అవకాశంగా తీసుకుని సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పలుచోట్ల ఎండీయూ వాహనదారులు, డీలర్లు కొందరు కార్డుదారులతో బేరాలు కుదుర్చుకుని బియ్యాన్ని తక్కువ ధరకు తీసుకుని నల్లబజారుకు తరలిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవల బిర్లా జంక్షన్ సమీపంలో పోలీసుల తనిఖీల్లో తొమ్మిది క్వింటాళ్ల రేషన్ బియ్యం దొరకడం గమనార్హం. ఇప్పటికైనా పర్యవేక్షణాధికారులు దృష్టిసారించి బియ్యం పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జీవీఎంసీ కమిషనర్ దృష్టికి 27వ వార్డు సమస్యలు



జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ పీరారావు

అక్కయ్యపాలెం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 27వ వార్డులోని పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌ను స్థానిక కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ గొలగాని వీరారావు బుజ్జి వినతిపత్రం అందజేశారు. దొండపర్తి, పులివారి వీధి రోడ్డు పక్కన శిథిలావస్థలోని మీ సేవా కేంద్రం భవనం స్థానంలో స్థానికులకు అందుబాటులో ఉండేలా జీ ప్లస్ 2 సామాజిక భవనాన్ని నిర్మించాలని కోరారు. స్థానికులు చిన్న చిన్న వేడుకలు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. బీఎస్ లే అవుట్, పద్మశ్రీ ఆస్పత్రి, ఎన్జీజీవోస్ కాలనీ ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

14తో ఈపీఎఫ్ యూఏఎన్ లింక్ గడువు ముగింపు

మురళీనగర్, డిసెంబరు 12 : ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (పీఎఫ్) కార్యాలయంలో ఎంప్లాయ్‌మెంట్ లింక్డ్ ఇన్సెంటివ్ స్కీమ్ కోసం యూనివర్సల్ అకౌంట్ నంబరు (యూఏఎన్) లింక్ చేసి, యాక్టివేట్ చేయడానికి గడువు ఈనెల 15తో ముగియనుంది. తొలుత ఈ గడువు నవంబరు 30 వరకు మాత్రమే ఉన్నా.. ఖాతాదారుల అభ్యర్థనల మేరకు డిసెంబరు 15వ తేదీ వరకు పొడిగించారు.ఈ అవకాశాన్ని ఖాతాదారులు వినియోగించుకోవాలని పీఎఫ్ కార్యాలయ ప్రాంతీయ అధికారులు కోరారు.

ముత్తంశెట్టి రాజీనామాతో వైసీపీలో కలవరం

... 5వ పేజీ తరువాయి

వెళ్లిపోతున్నారు.

ఈ నేపథ్యంలో హఠాత్తుగా గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి భీమిలి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి పదవితోపాటు పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించడంతో ఆ పార్టీనేతలు ఉలిక్కిపడ్డారు. ఎన్నికల్లో ఓటమి తరువాత జగన్మోహన్‌రెడ్డి అన్నీ సమీక్షించుకొని, తప్పులు సరిచేసుకొని పార్టీని ముందుకు తీసుకువెళతారని భావించానని, కానీ అటువంటిదేమీ కనిపించలేదని ఆయన వ్యాఖ్యానించారు. ముత్తంశెట్టి బాటలో మరికొందరు వైసీపీని వీడనున్నారనే ప్రచారం జరుగుతోంది. దీంతో అసంతృప్తులను గుర్తించి బుజ్జగించాలని ఆ పార్టీ పెద్దలు భావిస్తున్నట్టు తెలిసింది.

ప్రైవేటు కళాశాలల హాస్టళ్లపై దృష్టి

... 5వ పేజీ తరువాయి

జీవీఎంసీ ఆరోగ్య విభాగం, వైద్య ఆరోగ్య శాఖల నుంచి ఒక్కొక్క ఉద్యోగిని నియమించారు. వీరంతా గడచిన రెండు రోజుల నుంచి నగరంలో హాస్టళ్లను తనిఖీ చేస్తున్నారు. విశ్వసనీయంగా అందిన సమాచారం మేరకు...కొన్నిచోట్ల హాస్టళ్ల నిర్వహణ అధ్వానంగా ఉంది. విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు ఉండవు. ఉన్నవాటి నిర్వహణ కూడా అంతంతమాత్రమే. గదుల్లోకి వెలుతురు సరిగా రావడం లేదు.

చాలా హాస్టళ్లలో భోజనం కూడా బాగుండడం లేదు. రెండు, మూడు రోజుల్లో మొత్తం హాస్టళ్లను తనిఖీలు పూర్తిచేసి కలెక్టర్‌కు నివేదిక అందజేయనున్నారు.

గ్రీన్ బెల్ట్ కబ్జా

... 5వ పేజీ తరువాయి

ఏరియా మొత్తం కాంక్రీట్ వేసేసి, నిర్మాణంలో భాగంగా మార్చేసుకున్నారు. ప్రభుత్వం మారడంతో ఇప్పుడు కూటమి నేతల ఫొటోలతో ఫ్లెక్సీలు పెట్టి పనులు జరిపిస్తున్నారు.

ఎమ్మెల్యే విష్ణు ఫిర్యాదుతో...

విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు గురువారం అటువైపు వెళుతూ గ్రీన్ బెల్ట్ మొత్తం నాశనం చేసి ఆక్రమించిన వైనం గుర్తించి తక్షణమే జీవీఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రీన్‌బెల్ట్‌ను కాపాడాల్సిన బాధ్యత జీవీఎంసీపై ఉందని, అంత అడ్డగోలుగా పనులు చేస్తుంటే ఎందుకు చర్యలు చేపట్టడం లేదని ప్రశ్నించారు. ఆ షాపింగ్ మాల్ స్థలంలో ప్రభుత్వ స్థలం కూడా ఉందని, తనకు అనుమానంగా ఉందన్నారు. వారికి మాల్ నిర్మాణం కోసం ఇచ్చిన అనుమతులు ఏమిటి?, వారు చేపడుతున్న నిర్మాణం ఏమిటి?...మొత్తం పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

గ్రీన్ బెల్ట్‌ను నాశనం చేసినందుకు వారిపై క్రిమినల్ చర్యలు చేపట్టాలన్నారు. ఎమ్మెల్యే మధ్యాహ్నం 12 గంటలకు ఫిర్యాదు చేయగా...జీవీఎంసీ అధికారులు స్పందించి సాయంత్రం ఐదు గంటలకు అక్కడకు చేరి గ్రీన్ బెల్ట్‌లో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను కూలగొట్టారు. అయితే ఆ పని పూర్తిస్థాయిలో జరగలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

14 నుంచి ఘంటసాల గానోత్సవం

అల్లూరి విజ్ఞాన కేంద్రంలో రెండు రోజుల పాటు నిర్వహణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

మద్దిలపాలెం, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి) : అమర గాయకుడు ఘంటసాల 102వ జయంతి సందర్భంగా డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఈనెల 14, 15 తేదీల్లో నిర్వహించే ఘంటసాల గానోత్సవాలను జయప్రదం చేయాలని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్ కోరారు. శివాజీపాలెంలో గురువారం ఆయన ఈ ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంగీతాభిమానుల మనసుల్లో ఘంటసాల పాటలు స్థిరస్థాయిగా నిలిచి ఉంటాయని కొనియడారు. ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ నిర్వాహకుడు చెన్నా తిరుమలరావు మాట్లాడుతూ పలువురు ప్రముఖులు హాజరయ్యే ఈ కార్యక్రమంలో సాయంత్రం 6 గంటల నుంచి ఘంటసాల సినీ సంగీత విభావరి ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో త్యాగరాజన్, వీరేంద్రయాదవ్, పిన్నింటి ఆదిమూర్తి పాల్గొన్నారు.

దత్త జయంతి రేపు



అక్కయ్యపాలెం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రైల్వే ఎగ్జిబిషన్ మైదానం ఎదురుగా ఉన్న షిర్డీ సాయి ధ్యానమందిరంలో ఈ నెల 14న దత్త జయంతి మహోత్సవాన్ని నిర్వహించనున్నట్టు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు తెలిపారు. గురువారం ఆలయ ఆవరణలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోజు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. భక్తులు పెద్దఎత్తున హాజరు కావాలని కోరారు.

కేవీలో బోధనాభ్యసన ఉపకరణాల ప్రదర్శన



విద్యార్థులు తయారు చేసిన ఉపకరణాలు

అక్కయ్యపాలెం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : తాటిచెట్లపాలెంలోని కేంద్రీయ విద్యాలయంలో ఏర్పాటు చేసిన బోధనాభ్యాసన ఉపకరణాల (టీఎల్ఎం) ప్రదర్శనను గురువారం ప్రిన్సిపాల్ కమల్‌జిత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాబోధనలో టీఎల్ఎం ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. విద్యార్థులు సృజనాత్మక పద్ధతిలో అభ్యసనం చేయడంలో ఉపయోగ పడుతుందన్నారు. తద్వారా బోధనా క్యాలెండర్‌తో సమర్థవంతంగా ఉండేందుకు వారికి సహాయపడుతుందని పేర్కొన్నారు. ఈ ప్రదర్శనలో ఉపాధ్యాయులు బోధనలో ఉపయోగించే వివిధ రకాలైన బోధనాభ్యాసన ఉపకరణలను ప్రదర్శించారు. కార్యక్రమంలో హెచ్ఎం వీఎం శైలజ, ప్రగతి, గోవింద, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రీడా దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యప్రతాప్

కంచరపాలెం, డిసెంబరు 12 (ఆంధ్రప్రదేశ్) : కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద కేంద్రీయ విద్యాలయం-1లో గురువారం నిర్వహించిన వార్షిక క్రీడా వేడుకలకు విద్యాలయ మేనేజ్‌మెంట్ నామినీ చైర్మన్ కమడోర్ సూర్యప్రతాప్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. విద్యాలయ ప్రిన్సిపాల్ జి.కిశోర్ మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ చూపడం అవసరమన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

తీరానికి ఆలివ్ రిడ్లే తాబేలు కళేబరం



సాగర్‌నగర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ వద్ద బేపార్కు ఎదురుగా ఉన్న తీరానికి ఆలివ్ రిడ్లే తాబేలు కళేబరం గురువారం కొట్టుకువచ్చింది. ఆలివ్ రిడ్లే తాబేళ్లు ఈ సీజన్‌లో ఎక్కువగా గుడ్లు పొదిగేందుకు విశాఖ తీరం వైపు వస్తుంటాయి. ఈక్రమంలో అవి మర పడవలు, కొన్ని రకాల వలలకు చిక్కుకుని మృత్యువాత పడుతుంటాయి. భారీ కాయంతో వున్న తాబేలు కళేబరాన్ని సందర్శకులు ఆసక్తిగా తిలకించారు.

ఉక్కులో గందరగోళం

... 5వ పేజీ తరువాయి

విభాగాలు దేనికవే ప్రత్యేకత ఉన్నవి. ఇక్కడ ముడి పదార్థాలు అందుబాటులో లేక పూర్తిస్థాయిలో ఉత్పత్తి జరగక నష్టాలు వస్తున్నాయి. ముడి పదార్థాలు ఇస్తే ఏ సమస్య ఉండదు. అదే మార్కెటింగ్ బృందం 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.28 వేల కోట్ల ఉత్పత్తులను విక్రయించింది. అదో రికార్డు. అటువంటి ప్లాంటు మార్కెటింగ్ విభాగానికి సెయిల్ నుంచి అధికారులను తేవలసిన అవసరం ఏమిటనేది స్పష్టంచేయాల్సి ఉంది.

దక్షిణ భారతదేశంలో విశాఖ ఉక్కుకు ప్రధాన పోటీదారు సెయిలే. రీబార్లు అమ్మకాల్లో విశాఖ స్టీల్‌దే పైచేయి. ఇప్పుడు డిప్యుటేషన్‌పై చీఫ్ జనరల్ మేనేజర్, జనరల్ మేనేజర్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్లను తీసుకువచ్చి నియమించారు. వారు సెయిల్ నుంచి జీతం తీసుకుంటారు. విశాఖ ఉక్కును పోటీగా భావించే ఆ అధికారులు ఇక్కడ ఎవరి ఉత్పత్తులు ప్రమోట్ చేస్తారనేది అనుమానమే. అయినా ఇక్కడ అమ్మడానికి అంత పెద్దమొత్తంలో ఉత్పత్తులే లేనప్పుడు వారిని తీసుకురావడం దేనికో అర్థం కావడం లేదని ఉద్యోగ వర్గాలు అంటున్నాయి. విశాఖ స్టీల్ మార్కెటింగ్ వ్యూహాలు తెలుసుకోవడానికా?, లేదంటే ఇక్కడి మార్కెట్‌లో సెయిల్ ఉత్పత్తులు ప్రమోట్ చేసుకోవడానికా?...అని ప్రశ్నిస్తున్నాయి.

అదేవిధంగా సెయిల్ నుంచి వచ్చిన అధికారులు ఇక్కడ పనిచేస్తున్న వారి కంటే జూనియర్లు. సెయిల్‌లో ప్రమోషన్ పాలసీ అమలు చేయడం వల్ల వారికి త్వరగా పదోన్నతులు వచ్చి ఆ స్థాయికి చేరారు. ఇక్కడ పదహారేళ్లుగా ఎవరికీ పదోన్నతులు లేవు. వేరే ప్లాంటు నుంచి జూనియర్లను తీసుకువచ్చి వారి కింద పనిచేయాలని చెప్పడంపై ఉద్యోగ వర్గాల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. విశాఖ ఉక్కును నాశనం చేయడానికే ఇలా చేస్తున్నారని ఆరోపిస్తున్నాయి. దీనిపై తక్షణమే కేంద్రంతో పాటు స్థానిక నేతలు కూడాస్పందించాలని డిమాండ్ చేస్తున్నాయి.





అమ్మవారికి పూజ చేస్తున్న మహిళలు, ముత్యాల వస్త్రాల అలంకరణలో కన్యకా పరమేశ్వరి

కన్యకాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు

మహారాణిపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వన్‌టౌన్‌లో ఉన్న వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.తెల్లవారుజామున అమ్మవారిని మేల్కొలిపి ప్రభాత ఆరాధనలు పూర్తి చేశారు.అనంతరం 108 స్వర్ణ పుష్పాలతో అర్చన జరిపారు. అమ్మవారిని ముత్యాల వస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా 250 మంది మహిళలతో సామూహిక కుంకుమార్చన, లలితా సహస్ర పారాయణం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆరిశెట్టి దినకర్, తదితరులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

సాంకేతిక పరిజ్ఞానం అవసరం

మహారాణిపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు చిన్నతనం నుంచే సాంకేతికత పరిజ్ఞానంపై అవగాహన అవసరమని క్వెస్ట్ అలయన్స్ ఏపీ ప్రతినిధి సమీరా అన్నారు. గురువారం ఆమె జిల్లా పరిషత్ జంక్షన్‌లో ఉన్న సమావేశ మందిరంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) పాఠ్యాంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ పాఠ్యాంశాలను అందిం చేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో క్వెస్ట్ అలయన్స్ భాగస్వామ్యం కానున్నట్టు చెప్పారు.

32వ వార్డులో అధికారుల పర్యటన



అల్లిపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 32వ వార్డులో మౌలిక వసతులు కల్పించాలని కార్పొరేటర్ కందుల నాగరాజు జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులను కోరారు. గురువారం ఏఈ శివ తేజస్వని వార్డులోని నేరెళ్ల కోనేరు, చలవతోట, ఏడుగుళ్లు, అల్లిపురం మార్కెట్, కర్నాల వీధి ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పెండింగ్ పనులను ఆమె దృష్టికి తీసుకువచ్చి, తక్షణమే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ గిరిబాబు, నాయకులు శాలివాహన, బుజ్జి, ఆదిబాబు, కందుల బద్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు తీస్తున్న నిర్లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

హెల్మెట్ ధరించకపోవడం వల్లే మృతిచెందినట్టు పోలీసుల దర్యాప్తులో గుర్తించారు. 2024 జనవరి నుంచి నవంబరు వరకూ జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 290 మంది మృతిచెందగా, వారిలో 173 మంది ద్విచక్ర వాహనదారులు ఉన్నారు. వారిలో వంద మంది హెల్మెట్ ధరించకపోవడం వల్లే మృతిచెందినట్టు పోలీసులు గుర్తించారు. హెల్మెట్ ధారణ ఆవశ్యకతపై పోలీసులు ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా, జరిమానాలు విధిస్తున్నా సరే వాహన చోదకుల ధోరణిలో మాత్రం మార్పు కనిపించడం లేదు. పోలీసులను తప్పించుకునే యత్నంలో ఒక్కోసారి ఇతర వాహనాలను ఢీకొట్టి ప్రమాదాల బారినపడుతున్నారు.

ట్రాఫిక్ చలాన్‌లు విధించడంతోనే సరి

హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనం నడుపుతున్న వారిని సెల్‌ఫోన్‌తో ఫొటో తీసి ఈ-చలాన్ జారీ చేయడంతో తమ పని అయిపోయిందన్నట్టు పోలీసులు చేతులు దులిపేసుకుంటున్నారు తప్ప, అదే తప్పు మరోసారి చేయకుండా చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు. నగరంలో ట్రాఫిక్ విధులునిర్వర్తించే పోలీసులతోపాటు ఇతర విభాగాల్లోని సిబ్బంది, అధికారులకు ఉన్నతాధికారులు ఈ-చలాన్‌లు టార్గెట్ ఇస్తున్నారు. ప్రతిరోజూ టార్గెట్ మేరకు సెల్‌లో ఫొటోలు తీయాలని ఒత్తిడి చేస్తున్నారు. దీంతో పోలీసులు కూడళ్ల వద్ద నిలబడి ఎవరు హెల్మెట్ లేకుండా వస్తున్నవారిని ఆపి సెల్‌ఫోన్‌తో ఫొటో తీసి పంపించేస్తున్నారు. జరిమానా విధించడంతో పాటు హెల్మెట్ కొనుగోలు చేసుకుని తీసుకవచ్చిన తరువాత వాహనం విడిచిపెడతామని షరతు విధిస్తే పరిస్థితి చాలావరకూ పరిస్థితి మారేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా హైకోర్టు కూడా ఇదే అంశంపై పోలీసుల తీరును తీవ్రంగా తప్పుపట్టింది. మూడు నెలల కాలంలో హెల్మెట్ ధరించని కారణంగా రాష్ట్రంలో 667 మంది మరణించడంపై ఆగ్రహం వ్యక్తంచేసింది. పోలీసులు జరిమానాలు విధించి చేతులు దులుపుకుంటున్నారని, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంలో విఫలమవుతున్నారంటూ వ్యాఖ్యానించింది. హైకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో నగర పోలీస్ ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపేవారిపై చట్టపరంగా అందుబాటులో ఉన్న కఠిన చర్యలను తీసుకోవాలని యోచిస్తున్నట్టు సమాచారం. తద్వారా నగరంలో రోడ్డు ప్రమాదాల కారణంగా సంభవించే మరణాలకు అడ్డుకట్ట వేయవచ్చునని ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

మరో ముగ్గురు అరెస్టు

మహారాణిపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్ వ్యభిచారం కేసులో టూ టౌన్ పోలీసులు మరో ముగ్గురిని అరెస్టు చేశారు. ఇటీవల టూ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లాడ్జిలో వ్యభిచారం చేస్తున్న ఇద్దరు మహిళలు పోలీసులకు పట్టుబడ్డారు. వారు ఇచ్చిన సమాచారంతో దీపక్ అనే వ్యక్తిని కూడా అరెస్టు చేశారు. దీపక్ ఇచ్చిన సమాచారంతో గురువారం కపరాడకు చెందిన ఎన్. శ్యామలరావు, పెందుర్తికి చెందిన పి. జయ గంగాధర కృష్ణ, కె. రత్నంను అదుపులోకి తీసుకున్నారు.

నేడు టేబుల్ టెన్నిస్ జిల్లా జట్టు ఎంపిక

విశాఖపట్నం, స్పోర్ట్సు, డిసెంబరు 12 : అండర్-15 బాల బాలికల టేబుల్ టెన్నిస్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు శుక్రవారం నిర్వహించనున్నట్టు జిల్లా సంఘం కార్యదర్శి డాక్టర్ డీవీఎస్‌వై శర్మ తెలిపారు. రైల్వే ఇండోర్ స్పోర్ట్సు ఎన్‌క్లేవ్‌లో సాయంత్రం 4 గంట ల నుంచి జరిగే ఎంపికలో పాల్గొనేవారు వయసు ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డుతో సహా హాజరుకావాలన్నారు. ఆసక్తి గలవారు 9052667766 వాట్సాప్ నంబరుకు ఎంట్రీలు పంపించాలన్నారు.

బచేలి, కిరండోల్ సెక్షన్‌లో జీఎం పర్యటన



సిబ్బందితో మాట్లాడుతున్న జీఎం పరమేశ్వర ఫంక్వాల్

విశాఖపట్నం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వాల్తేరు డివిజన్ పరిధిలోని బచేలి, కిరండోల్ సెక్షన్‌లో తూర్పు కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర ఫంక్వాల్ గురువారం పర్యటించారు. కిరండోల్, జగదల్‌పూర్ లైనులో కొనసాగుతున్న డబ్లింగ్ పనులు, సైడింగ్ సౌకర్యాలను పరిశీలించి తనిఖీ చేశారు. కిరండోల్ వద్ద వ్యాగన్ లోడింగ్ సమయాన్ని గణనీయంగా తగ్గించడం, కార్యాచరణ సామర్థ్యాన్ని పెంచడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన వ్యాగన్ డిశ్చార్జ్ సైలో సిస్టమ్‌పై సమీక్షించారు. అనంతరం బచేలి, జగదల్‌పూర్ సెక్షన్‌లో గ్యాంగ్‌మెన్, సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్ సిబ్బందితో, అలాగే ట్రాక్షన్ నిర్వహణ సిబ్బందితో మాట్లాడి పలు వివరాలు ఆరా తీశారు. అనంతరం ఎన్ఎండీసీ అధికారులతో పెట్రో లోడింగ్ కార్యకలాపాలపై చర్చించారు. ఆయనతో పాటు డీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహు ఉన్నారు.



ప్రధాన ద్వారం వద్ద గుమిగూడిన జనం. కంట్రోల్ చేయలేకపోతున్న పోలీసులు.



అమ్మవారి సన్నిధిలో ఒకే దగ్గర పోలీసులు

అమ్మవారి ఉత్సవంలో మళ్లీ అదే తీరు

- అడుగడుగునా పోలీసులు
- ఆగని అడ్డగోలు దర్శనాలు

విశాఖపట్నం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్ కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర ఉత్సవాల్లో సామాన్య భక్తులకు దర్శనం గగనమైపోతోంది. అమ్మవారికి ప్రీతికరమైన గురువారాల్లో వీఐపీల తాకిడి పెరిగి ధర్మ దర్శనానికి గంటల సమయం పడుతోంది. దీంతో ప్రధాన ద్వారం వద్ద తోపులాట జరుగుతోంది. అమ్మవారి సన్నిధిలోను అదే పరిస్థితి. ఆలయ ప్రధాన ద్వారం పక్కనే పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేశారు. బందోబస్తులో 800 మంది పోలీసులున్నారు. క్యూలైన్లకు అనేక ఏర్పాట్లు ఉన్నాయి.భక్తులను లైన్లలో పంపితే రద్దీ ఉండదు. కానీ ప్రధాన ద్వారం నుంచి వీఐపీల పేరుతో అడ్డగోలు దర్శనాలతో గుంపులుగా చేరుతున్నారు. వందల మంది పోలీసులుండి భక్తులను క్యూలైన్లలో పంపలేకపోవడమేమిటో అధికారులే చెప్పాలి. అమ్మవారి సన్నిధిలో పది మంది కంటే ఎక్కువ పట్టరు. అక్కడ సగం మంది (ఐదుగురు) పోలీసులే ఉంటున్నారు. సాఫీగా సాగాల్సిన క్యూలైన్లు గంటల కొద్దీ కదలకపోవడంతో చాలామంది అక్కడే కూర్చొండిపోతున్నారు. నియోజకవర్గం, వార్డు నాయకులు, దేవస్థానం ట్రస్టు మాజీ సభ్యుల పేరుతో వందలాది మంది ఉచిత వీఐపీ దర్శనాలకు రావడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దేవదాయ, పోలీసు శాఖల మధ్య సమన్వయం లేదన్న విమర్శలు ఉన్నాయి.

సింహగిరిపై సంప్రదాయబద్ధంగా తిరు నక్షత్ర పూజలు

సింహాచలం, డిసెంబరు 12 (ఆంధ్ర జ్యోతి) : వరాహలక్ష్మీ నృసింహస్వామి సన్నిధిలో తిరుమంగై ఆళ్వార్ తిరునక్షత్ర పూజలు సంప్రదాయబద్ధంగా జరుగుతున్నాయి. గురువారం వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని ఉభయదేవేరులు, ఆళ్వార్లతో శోభాయమానంగా అలంకరించి వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో తొలుత షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం అధ్యాపకులు నాలాయిర దివ్య ప్రబంధంలోని వెయ్యి పాశురాలను అనుసంధానం చేశారు. మధ్యాహ్నం రాజభోగ నివేదన వేళ పూజలు చేసి కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

లోన్ యాప్‌ల ఆగడాలు

... 5వ పేజీ తరువాయి

రుణం వస్తుందనే ఉద్దేశంతో ఫోన్ చేయడం లేదా లింక్ క్లిక్ చేయడం చేస్తున్నారు. రుణం మంజూరు చేసినప్పుడే టర్మ్స్ అండ్ కండీషన్స్ పేరుతో బాధితుడి ఫోన్‌లోని కాంటాక్ట్స్, ఫొటో గ్యాలరీ యాక్సిస్‌ను యాప్‌ల నిర్వాహకులు తీసుకుంటారు. దీనివల్ల ఫోన్‌లోని ఫొటోలు, కాంటాక్ట్ నంబర్లు వంటి వివరాలన్నీ యాప్‌ల నిర్వాహకులు చేతుల్లోకి వెళ్లిపోతాయి. లోన్ మంజూరుచేసిన తర్వాత రోజు నుంచి తిరిగి చెల్లింపుల కోసం ఒత్తిడి ప్రారంభిస్తారు. వాయిదాలను సకాలంలో కట్టకపోయినా, వారు చెప్పినంత వడ్డీ చెల్లించకపోయినా ఫోన్‌లోని కాంటాక్టు నంబర్లు అన్నింటికీ మార్ఫింగ్ చేసిన ఫొటోలు పంపిస్తారు. దీంతో బాధితులు అవమాన భారంతో తీవ్రమైన నిర్ణయాలు తీసుకుంటున్నారు. కొన్నాళ్ల కిందట ఎండాడ పనోరమ హిల్స్‌లో నివాసముంటున్న ఒక మహిళ సెల్‌ఫోన్‌కు రూ.30 వేలు రుణం అర్హత ఉందంటూ మెసేజ్ వచ్చింది. అదేమిటో తెలుసుకునేందుకు మెసేజ్‌ను ఓపెన్‌చేసిన వెంటనే ఫోన్ పే ద్వారా ఆమె ఖాతాకు రూ.1,240 జమ అయ్యాయి. వెంటనే 'మీరు లోన్ తీసుకున్నందున వాయిదాలు కట్టాలని ఎవరో ఫోన్‌చేసి అడగడం ప్రారంభించారు. బాధితురాలు దానిని తేలిగ్గా తీసుకుని ఆ నంబర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టేశారు. దీంతో సదరు మహిళ ఫొటోలను యాప్ నిర్వాహకులు మార్ఫింగ్ చేసి ఆమె సెల్‌ఫోన్ కాంటాక్టులోని నంబర్లకు పంపించసాగారు. ఆ విషయం తెలిసి ఆందోళనకు గురైన ఆమె వాళ్లు అడిగిన రూ.20 వేలు మొత్తాన్ని ఫోన్‌పే ద్వారా కట్టేశారు. అయినప్పటికీ ఇంకా వేధింపులు కొనసాగించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విదేశాల నుంచే నిర్వహణ

ఇన్‌స్టంట్ లోన్‌యాప్‌ల నిర్వాహకులంతా విదేశాల్లో ఉంటూ కార్యకలాపాలు సాగిస్తుంటారు. కాల్‌సెంటర్ ఏర్పాటుచేసుకుని అన్ని భాషలు మాట్లాడగలిగే వారిని ఉద్యోగాల్లో పెట్టుకుంటారు. ఏ రాష్ట్రానికి చెందిన వారితో మాట్లాడాల్సి వస్తే ఆ రాష్ట్ర భాష మాట్లాడే వారితో ఫోన్ చేయిస్తారు. ఒకవేళ ఎవరైనా పోలీసులకు ఫిర్యాదు చేసినాసరే తమ ఉనికి తెలియకుండా ఉండేందుకు దొంగపత్రాలతో పొందిన సిమ్‌కార్డులు, బ్యాంక్ ఖాతాలను వాడుతున్నారు. దీనివల్ల నిందితులను పట్టుకోవడం పోలీసులకు సవాల్‌గా మారుతోంది.

లోన్‌యాప్‌ల వలలో పడొద్దు

- కె.భవానీప్రసాద్, సైబర్‌క్రైమ్ సీఐ



లోన్‌యాప్‌లు యమపాశాలు వంటివి. ఒకసారి వాటి వలకు చిక్కితే జీవితకాలం ఇబ్బందులు పడాల్సి ఉంటుంది. ఎవరు వాటి జోలికి వెళ్లొద్దు. ఎవరైనా లోన్ ఇస్తామని మెసేజ్‌లు పంపినా, గుర్తు తెలియని లింక్‌లు వచ్చినా వాటికి స్పందించకూడదు. కొంతకాలంగా స్తబ్దుగా ఉన్న లోన్ యాప్‌ల నిర్వాహకుల ఆగడాలు మళ్లీ మొదలయ్యాయి. లోన్‌యాప్‌ల మోసాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు సీపీ శంఖబ్రతబాగ్చి ఆదేశాలు మేరకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

☛ సంక్షిప్తంగా..

కేంద్రకారగారంలో సెక్యూరిటీకి పటిష్ట చర్యలు

» సూపరింటెండెంట్ మహేశ్‌బాబు



ఆరిలోవ, డిసెంబరు 12 : (ఆంధ్రజ్యోతి) : కేంద్ర కారాగారంలో సెక్యూరిటీపరంగా పటిష్ఠ చర్యలు చేపట్టినట్టు సూపరింటెండెంట్ మహేశ్‌బాబు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కారాగారంలోకి వెళ్లే సిబ్బంది లంచ్ బాక్సులను వెలుపలే ఉంచేందుకు ఏర్పాటు చేశామన్నారు. లంచ్ బాక్సులను సిబ్బంది తమ అడ్మిన్ కార్యాలయాల వద్ద ఉంచుకోవాలని సూచించినట్టు చెప్పారు. మధ్యాహ్నం భోజనాలు అందుకోసం ఏర్పాటు చేసిన గదుల్లోనే చేయాలని స్పష్టం చేశామన్నారు. ప్రతి వ్యక్తిని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తర్వాత లోపలకు అనుమతి ఇస్తున్నామన్నారు. బ్యారక్స్ తనిఖీలకు వెళ్లినప్పుడు తనకు కూడా పూర్తిగా తనిఖీ చేయమని స్పష్టం చేశానన్నారు. సీసీ కెమెరాల సంఖ్యను పెంచినట్టు తెలిపారు.

ప్రస్తుతం కారాగారంలో సుమారు 1100 మంది గంజాయి కేసుల్లో నిందితులు, 12 మంది రౌడీషీటర్లు ఉన్నట్టు సూపరింటెండెంట్ తెలిపారు. వీరికి కౌన్సెలింగ్ ఇస్తున్నట్టు చెప్పారు.

జైలులో 7 వాచ్‌టవర్‌లో ప్రతినిత్యం ఏపీ బెటాలియన్‌కు చెందిన నలుగురు సిబ్బంది రెండు గంటల పాటు నిశిత పహారా కాస్తున్నట్టు చెప్పారు. ప్రతి రెండు గంటలకు వీరు షిఫ్టులు మారుతుంటారన్నారు. ప్రస్తుతం ముగ్గురు డీఎస్పీలు ఉన్నారని తెలిపారు. కేంద్ర కారాగారం సామర్థ్యం పెంచే క్రమంలో కొత్తగా కొన్ని బ్లాక్‌ల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు వెల్లడించారు. ప్రస్తుతానికి ఈ జైలులో సుమారు 2014 మంది ఖైదీలు ఉన్నారని తెలిపారు.

ఎంవీపీ సర్కిల్‌ను అభివృద్ధి చేయండి



జీవీఎంసీ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న కార్పొరేటర్ మంగవేణిపోలరావు

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ సర్కిల్‌ను సరికొత్త మోడల్ మాడ్యులర్ పార్కుగా ఆధునీకరించాలని పద్దెనిమిదో వార్డు కార్పొరేటరు గొలగాని మంగవేణి పోలారావు జీవీఎంసీ కమిషనర్‌ను కోరారు. జీవిఎంసం 18వ వార్డు పరిధిలోని సమతా కళాశాల సమీపంలో ఉన్న సర్కిల్ ఏళ్ల తరబడి అభివృద్ధి చేయకుండా వదిలేశారని పేర్కొన్నారు. స్మార్ట్‌సిటీ నిధులతో వివిధ కూడళ్లను అందంగా రూపొందిస్తున్న నేపథ్యంలో ఈ సర్కిల్‌ను కూడా అభివృద్ధి చేయాలని కోరారు.

సినిమా గైడ్

● **పుష్ప-2** : జగదాంబ, శారద, రమాదేవి, శ్రీవెంకటేశ్వర, వెంకటేశ్వర, శ్రీకన్య సంగం, శరత్, మెలోడి, శరత్, కిన్నెర, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ, నరసింహ, సుకన్య, సౌజన్య, మౌర్య (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని, లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1,2 (పెందుర్తి), శ్రీరాములమ్మ, గణేష్, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 52, టమాటా 26, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 22, పచ్చిమిర్చి 24, కాకరకాయలు 34, బీరకాయలు 38, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 16, క్యాబేజి 18, క్యారెట్ 60 దొండకాయలు 30, బంగాళదుంపలు 34, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 120, అల్లం (పాతది)56, బరబాటి 26, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 55, గోరుచిక్కుడు 24 దోస కాయలు 24, వె ల్లుల్లి (పెద్దవి) 300, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 60, పొటల్స్ 48, కీరదోస 28, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40, చిలగడదుంపలు 34, కంద 64, దేముడు చిక్కుడు 46, కొండఉసిరి 55, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, క్యారెపెండలం 28, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	615
విజయనగరం	619
శ్రీకాకుళం	619

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	93
ఫారం ధర	113
విత్ స్కిన్	196
స్కిన్‌లెస్	206

ఆహార ప్రయోగశాలలో టెస్ట్‌లు చేపట్టరా?

» పనితీరుపై బీజేపీ విశాఖపట్నం పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర అసంతృప్తి



ఆహార ప్రయోగశాలను సందర్శించి సిబ్బందితో మాట్లాడుతున్న రవీంద్ర

పెదవాల్తేరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రధాన నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించిన రాష్ట్ర ఆహార ప్రయోగశాలలో ఒక్క టెస్ట్ కూడా చేపట్టకపోవడం ఆశ్చర్యంగా ఉందని బీజేపీ విశాఖపట్నం పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం ఆయన ప్రభుత్వ ఈఎస్టీ ఆస్పత్రి సమీపంలోని ఫుడ్ సేఫ్టీ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర ఆహార ప్రయోగశాలను సందర్శించారు. ఇప్పటి వరకూ ఒక్క టెస్ట్ కూడా చేపట్టలేకపోయామని సిబ్బంది చెప్పడంతో ఆశ్చర్యపోయారు. అనంతర ఆయన మాట్లాడుతూ తక్షణమే అధికారులు ఇక్కడ సిబ్బందికి పరిపడా పరికరాలు, రసాయనాలను సమకూర్చి టెస్టులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇక్కడ కొంతమంది సిబ్బంది ఉన్నా అవసరమైన పరికరాలు, సామగ్రి లేకపోవడంతో టెస్టులు నిర్వహించలేకపోవడం శోచనీయమన్నారు. ఫుడ్ టెస్టింగ్ లాబ్స్ లేకపోవడం వల్ల ఆహార కల్తీని ఆరికట్టడం కష్టమవుతోందన్నారు.

ఇటీవల తాను రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌ను కలిసిన సందర్భంగా ఇక్కడ పరిస్థితిని వివరించానన్నారు. దీంతో మంత్రి స్పందిస్తూ.. త్వరలోనే మిగిలిన సిబ్బంది, అవసరమైన పరికరాలను అందజేయనున్నట్టు తెలిపారన్నారు. ఈ నేపథ్యంలోనే ఆహార ప్రయోగశాలను సందర్శించినట్టు చెప్పారు.

ఇటీవల మానసిక చికిత్స కేంద్రంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ విభాగంలో కొన్ని ఏసీ మిషన్లు చోరీకి గురైనట్టు తెలిసిందని, ఇక్కడ పటిష్ఠ భద్రతా చర్యలు అవసరమన్నారు. ఇక్కడ కోట్ల రూపాయల పరికరాలు ఉన్నాయని, కాబట్టి పూర్తిస్థాయి భద్రత అవసరమన్నారు. ఇందుకోసం అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

15వ వార్డులో టీడీపీ సభ్యత్వాల నమోదు



సభ్యత్వాలు సేకరిస్తున్న కార్పొరేటర్ శ్రీవిద్య, టీడీపీ నేతలు సత్యనారాయణ, రవికుమార్ తదితరులు

వెంకోజీపాలెం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 15వ వార్డులోని కొత్త వెంకోజీపాలెం ఆంజనేయస్వామి ఆలయం వద్ద గురువారం కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య, వార్డు అధ్యక్షులు బుగత సత్యనారాయణ, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్, బోర ధనరెడ్డి, సీహెచ్ గోవింద్, అప్పారి గిరిబాబు, తెలుగు మహిళా నేతలు టీడీపీ పార్టీ సభ్యత్వాలు సేకరించారు. సుమారు 250 మందికి సభ్యత్వ నమోదు చేయించినట్టు కార్పొరేటర్ తెలిపారు. రూ.100లతో సభ్యత్వాన్ని తీసుకుంటే బీమా సదుపాయం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బీసెట్టి జగదీస్, వరలక్ష్మి, మొల్లేటి కోటి, పెట్ల రాజు, ఎస్ఆర్‌జే.నాయుడు, సంపంగి సురేష్, సోని, సన్యాసమ్మ, గ్రామ పెద్దలు, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

కౌశల్-24 రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు వీరే



విద్యార్థుల పేర్లను ప్రకటిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్

విశాఖపట్నం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కౌశల్-2024 జిల్లా స్థాయి సైన్స్ ప్రతిభా అన్వేషణ పోటీల ఫలితాలను జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ గురువారం విడుదల చేశారు. ఇందులో ఎంపికైన విద్యార్థులు ఈ నెల 30న విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కి‌టెక్చర్ కళాశాలలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరు కావాలని పేర్కొన్నారు.

క్విజ్ టీమ్ 1: కణితి జెడ్పీ ఉన్నత పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థి టి.రోహిత, భీమిలి మునిసిపల్ హైస్కూల్ విద్యార్థి డి.మనోజ్, రేవిడి జెడ్పీ హైస్కూల్ విద్యార్థి మరగడ అశ్విని.

క్విజ్‌టీమ్ 2: జీవీఎంసీ 22వ వార్డు కేడీపీఎం హైస్కూల్ విద్యార్థి కె.డానియల్ నిరీక్షణ, భీమిలి కేజీబీవీ విద్యార్థి సోనియా, ఏడో వార్డు డాక్టర్ బీఆర్ఏఎంపీఎల్ హైస్కూల్ విద్యార్థి పి.సాయివర్ధన్.

పోస్టర్ విభాగంలో ఎనిమిదో తరగతి విభాగం నుంచి అడవివరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థి చైత్రవర్షిణి, క్వీన్‌మేరీ ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థిని మహిత, తొమ్మిదో తరగతి విభాగం నుంచి మధురానగర్ ఎంపీహెచ్ఎస్ నుంచి పి.చరణ్ కుమార్, 14వ వార్డు మున్సిపల్ హైస్కూల్ విద్యార్థిని ఎస్.విజయదుర్గ ఎంపికయ్యారు. అలాగే పదో తరగతి విభాగం రీల్స్‌కు సంబంధించి నడుపూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థి ఎల్.కౌశిక్, రెండో వార్డు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని కృష్ణ హరిణి ఎంపికయ్యారు.

17వ వార్డులో ఎమ్మెల్యే వెలగపూడి పర్యటన



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వెలగపూడి

పెదవాల్తేరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : స్థానికంగా ఏ సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారిస్తానని తూర్పు నియోజకవర్గం శాసనసభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. గురువారం 17వ వార్డు పెదవాల్తేరు, ఇందిరానగర్ తదితర ప్రాంతాలలో ఎమ్మెల్యే పర్యటించారు. స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాళ్ల శంకర్, పోతన్న రెడ్డి, నరేంద్ర, కాకి శివ శంకర్ రెడ్డి, తారక్, జనసేన నాయకులు శ్రీనివాస్, పట్నాయక్, జీవీఎంసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వచ్చే నెల 10న వైకుంఠ ఏకాదశి

» సింహాచలం దేవస్థానం ఈవో త్రినాథరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఈవో త్రినాథరావు

సింహాచలం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : భక్తులందరికీ అప్పన్న స్వామి వైకుంఠ ద్వార దర్శనం కల్పించేందుకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని, అందుకు అవస రమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని దేవస్థానం ఈవో వేండ్ర త్రినాథరావు అధికారులను ఆదేశించారు. వచ్చే నెల 10న జరగనున్న వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని గురువారం ఆయన దేవస్థానం అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉత్సవంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీరు, క్యూలు, బారికేడ్లు ఏర్పాట్లతో పాటు నిత్యాన్న ప్రసాద విభాగం ద్వారా ప్రసాదం అందజేయాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా దేవస్థానం పరిధిలో ఉన్న సిసి కెమెరాల పనితీరును పరిశీలించి అవసరమైతే మరమ్మతులు చేపట్టాలని తెలిపారు. సమావేశంలో దేవస్థానం స్థానాచార్యులు రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఈఈ దండుగణ శ్రీనివాసరాజు, ఈఈ బండారు రాంబాబు, ఏఈఓలు, పర్యవేక్షణాధికారులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు సమాయత్తం

పద్మనాభం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏడు సాగునీటి సంఘాలకు శనివారం ఎన్నికల నిర్వహణకు అధికారులు సమాయత్తమవుతున్నారు. ఆ ఒక్క రోజులోనే నామినేషన్ల స్వీకరణ, ఉపసంహరణ, ఎన్నిక నిర్వహణ, ఫలితాల వెల్లడి చేపడతారు. పోటీ ఉంటే చేతులు ఎత్తే పద్ధతి ద్వారా ఎన్నిక నిర్వహిస్తారు. ఒక్కో సాగునీటి సంఘానికి ఆరు ప్రాదేశిక నియోజకవర్గాలు (టీసీ) ఉంటాయి. ఇప్పటికే ఒక్కో సాగునీటి సంఘానికి ఒక ఎన్నికల అధికారి, సహాయ ఎన్నికల అధికారితో పాటు ఆరుగురు పోలింగ్ అధికారులు, ఆరుగురు పోలింగ్ సహాయకులతో 14 మంది సిబ్బంది చొప్పున 98 మందిని నియమించారు. ఎన్నికల నోడల్ అధికారిగా ఇరిగేషన్ డీఈఈ స్వామినాయుడు, అధీకృత అధికారిగా ఏఈ నళిని వ్యవహరిస్తారు. ఏడు సాగునీటి సంఘాల పరిధిలో 1475.98 ఎకరాల ఆయకట్టు ఉండగా 3462 మంది రైతులు ఓటర్లుగా నమోదయ్యారు.



సీఎం చంద్రబాబునాయుడు అధ్యక్షతన అమరావతిలోని సచివాలయంలో జరుగుతున్న జిల్లా కలెక్టర్ల సదస్సులో రెండో రోజు గురువారం హాజరైన కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్

సార్బ్ బ్రాంచ్‌ను సందర్శించిన ఎస్‌బీఐ డీజీఎం కేజీ రావు



బ్రాంచ్ ఆవరణలో మొక్కలు నాటుతున్న డీజీఎం రావు, ఏజీఎం విజయలక్ష్మి తదితరులు

సిరిపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సిరిపురంలోని స్టేట్ బ్యాంక్ ఇండియా సార్బ్ బ్రాంచ్‌ను హైదరాబాద్ స్ట్రామో డిప్యూటీ మేనేజర్ కేజీ రావు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వార్షిక సంవత్సరం రికవరీలో ఈ బ్రాంచ్ అద్భుత ప్రతిభ కనబరచిందన్నారు. భవిష్యత్‌లో కూడా అత్యధిక రికవరీలు సాధించాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. బ్రాంచ్ హెడ్, అసిస్టెంట్ జీఎం ఎం.విజయలక్ష్మి, సిబ్బందిని అభినందించారు. అనంతరం బ్రాంచ్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏజీఎం ఎం.విజయలక్ష్మి, చీఫ్ మేనేజర్లు బి.వరప్రసాద్, వై.శ్రీకాంత్, వై.కిరణ్‌చంద్ పాల్గొన్నారు.

కొత్త ఓటర్లు, సవరణకు దరఖాస్తులు స్వీకారం

వెంకోజీపాలెం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : విశాఖ తూర్పు, ఉత్తర నియోజకవర్గాల పరిధిలో 18, 19 సంవత్సరాలు నిండిన వారు నూతన ఓటు నమోదు చేసుకోవాలని జీవీఎంసీ జోన్-3 జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. నియోజకవర్గంలోని సమీపంలో గల సచివాలయంలో కొత్త ఓటరుగా నమోదు చేసుకోవలెనని చెప్పారు. ఈ నెల 24 ఆఖరి తేదీ అని ప్రకటనలో పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తి గల వారు సమీపంలో గల సచివాలయంలో దరఖాస్తు నింపి ఆధార్ కార్డు, పుట్టిన తేదీ, ఫోటో జత చేసి అందజేయాలని కోరారు. అలాగే ఓటరు కార్డులో చిరునామ, ఇతర వివరాలు మార్పు కోసం కూడా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వేరే నియోజకవర్గం నుంచి ఈ నియోజకవర్గంకి నివాసం మారిన వారు ఓటరు కార్డులో చిరునామ మార్పు కోసం గడువులోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసిన వారి ఇంటికి బీఎల్‌ఓలు వెళ్లి విచారణ చేశాక ఓటరు కార్డులు జనరేట్ అవుతాయని తెలిపారు. అనంతరం నెట్ సెంటర్‌లో కార్డు ప్రింట్ తీసుకోవాల్సి ఉంటుందని జెడ్సీ సూచించారు.

ఇసుక విక్రయాలు ప్రారంభం

ఆరిలోవ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అవసరమైన అందరికీ అందుబాటులోకి తీసుకు రావాలనే ఉద్దేశంతో ఇసుక అమ్మకాలకు ముడసర్లోవ చెరువు ఎగువ భాగాన (వనం అమ్మవారి ఆలయం ఎదురుగా) గల జీవీఎంసీ స్థలలో ఇసుక విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ గురువారం నుంచి ఇసుక విక్రయాలు ప్రారంభించారు. తొలి రోజు సుమారు 10 టన్నుల ఇసుక విక్రయించారు. ప్రస్తుతానికి ఇక్కడ 1600 టన్నుల ఇసుక నిల్వ ఉందని సిబ్బంది తెలిపారు. ఈ ఇసుకను శ్రీకాకుళం నుంచి తీసుకొస్తున్నట్టు తెలిపారు. ఇసుక అందుబాటులోకి రావడంతో భవన నిర్మాణదారులు అంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

14 నుంచి రెవెన్యూ సదస్సులు

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : తూర్పు నియోజకవర్గం పరిధిలో ఈ నెల 14 నుంచి 19వ తేదీ వరకూ వివిధ వార్డుల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తెలిపారు. 14న రవీంద్రనగర్ చివరి బస్టాపు వద్ద 9, 10, 11 వార్డులకు సంబంధించి, 16న ఆరిలోవ హిందీ కళాశాల వద్ద 12, 13 వార్డులకు సంబంధించి, 17న కృష్ణా కళాశాల ఆవరణలో 15, 16, 23 వార్డుల్లోని వారికి, 19న పెదవాల్తేరు గాంధీ సెంటర్ వద్ద 18, 19, 20, 21, 22 వార్డులకు సంబంధించి రెవెన్యూ సదస్సులు ఉంటాయని వెల్లడించారు. ఈ సదస్సులను నియోజకవర్గం ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

కార్పొరేటర్ క్షమాపణ చెప్పాలి

» సచివాలయ ఉద్యోగుల నిరసన

సిరిపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో చేసిన అనుచిత వ్యాఖ్యలపై సచివాలయ ఉద్యోగులు గురువారం సాయంత్రం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలియేశారు. సచివాలయ ఉద్యోగులకు ఏం పనిలేదని, ఖాళీగా ఉన్నారని చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ఉద్యోగులు శాంతియుతంగా మొబైల్ లైట్ వేస్తూ నిరసన తెలిపారు. ఉద్యోగులకు వెంటనే క్షమాపణ చెప్పాలని, ఒక రోజంతా సచివాలయ ఉద్యోగులతో విధి నిర్వహణలో పాల్గొంటే ఉద్యోగులు ఏం చేస్తున్నారో తెలుస్తుందని హితవు పలికారు. ఏ ప్రభుత్వ శాఖలో లేని విధంగా ఒక ఉద్యోగంతో అన్ని ప్రభుత్వ శాఖల విధులు చేస్తున్నది సచివాలయ ఉద్యోగులు మాత్రమేనన్నారు కార్యక్రమంలో పలువురు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యామండలి సదస్సులో ఏయూ వీసీ



సదస్సులో పాల్గొన్న వీసీ, రిజిస్ట్రార్

వెంకోజీపాలెం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఉన్నత విద్యా మండలి వర్చువల్ విధానంలో నిర్వహించిన సదస్సులో ఏయూ వీసీ జి.శశిభూషణరావు పాల్గొన్నారు. ఉన్నత విద్యా మండలి ఇన్‌చార్జి చైర్మన్ కె.రామ్మోహన్ రావు రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల ఉప కులపతులతో ఈ సమావేశంలో ప్రసంగించారు. ప్రధానంగా స్వర్ణాంధ్ర 2047 అంశం దిశగా చర్చించారు. రిజిస్ట్రార్ ఈఎస్ ధనుంజయ్‌రావు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులపై అవగాహన కలిగించండి

» టీడీపీ శ్రేణులకు ఎమ్మెల్యే వెలగపూడి సూచన



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామకృష్ణబాబు

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల నిర్వహణకు సహకారం అందించాలని తూర్పు నియోజకవర్గం శాసనసభ్యుడు వెలగపూడి రామకృష్ణబాబు టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే కార్యాలయం ఆవరణలో గురువారం వివిధ వార్డుల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల్లో సదస్సు పట్ల అవగాహన కల్పించడం, భూ కొలతల్లో తేడాలు, సర్వే నెంబర్లలో మార్పులు, వారసత్వ పేర్ల నమోదు, సరిహద్దు సమస్య, భూ విస్తీర్ణంలో తేడాలు, రీ-సర్వే రికార్డుల్లో నమోదైన తప్పులు, కబ్జాలతో ప్రజలు కోల్పోయిన భూములు వంటి వాటిపై వినతులు సమర్పణకు ప్రజలకు సహకారం అందించాలని సూచించారు. ఈ సమావేవలో నియోజకవర్గం పరిధిలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్విజ్ పోటీలో కృష్ణా కళాశాల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న వైస్ ప్రిన్సిపాల్ జయ, అధ్యాపకులు

మద్దిలపాలెం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కేరళలోని కొచ్చిన్ నగరంలో నిర్వహించిన జాతీయ స్థాయి క్విజ్ పోటీల్లో డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు తృతీయ బహుమతి గెలుచుకున్నారు. విజేతలుగా నిలిచిన బీఎస్సీ తృతీయ సంవత్సరం విద్యార్థులు ఎస్.నవీన్, ఎం.నానిలను కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.జయ, అధ్యాపకులు అభినందించారు.

ఈ సందర్భంగా జయ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 12 బృందాలు ఈనెల 11న క్విజ్ పోటీల్లో పాల్గొనగా, తమ కళాశాల విద్యార్థులు మూడో స్థానంలో నిలవడం ఆనందంగా ఉందన్నారు. తమ కళాశాల నుంచి చాలా మంది విద్యార్థులు అనేక పోటీల్లో తమ సత్తా చాటుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎస్.పద్మావతి, పి.స్వామినాయుడు, శ్రావణ్‌కుమార్, రవిబాబు, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు

» ప్రేమ పేరుతో బాలికకు వేధిస్తుండడంతో ఫిర్యాదు

మద్దిలపాలెం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రేమ పేరుతో బాలికను వేధింపులకు గురి చేస్తున్న యువకుడిపై గురువారం మూడోపట్టణ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. సీఐ రమణయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

చినవాల్తేరులో నివాసముంటున్న పి.ధనుష్ (20) అదే ప్రాంతానికి చెందిన బాలికను గత ఏడాదిన్నరగా ప్రేమ పేరుతో వెంటపడుతున్నాడు. వివాహం చేసుకుంటానని అత్యాచారం చేశాడు. బాలిక కుటుంబానికి ఈ విషయం తెలిసి ధనుష్‌ను నిలదీశారు. బాలికకు పద్దెనిమిది ఏళ్లు పూర్తయ్యాక వివాహం చేసుకోవాలని అడిగారు. అందుకు ధనుష్ నిరాకరించకడంతో మళ్లీ తమ కుమార్తె జోలికి రావద్దని హెచ్చరించారు. అయినప్పటికీ ధనుష్ బాలిక వెంటపడి వేధింపులకు గురి చేస్తుండడంతో మూడో పట్టణ పోలీసుల ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు ధనుష్‌ను అదుపులోకి తీసుకుని పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏయూకు టెక్సాస్ ఏ అండ్ ఎం వర్సిటీ బృందం



ఏయూను సందర్శించిన టెక్సాస్ ఏ అండ్ ఎం ఆచార్యులు

వెంకోజీపాలెం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి) : ఏయూను అమెరికాలోని టెక్సాస్ ఏ అండ్ ఎం యూనివర్సిటీ ఆచార్యులు గురువారం సందర్శించారు. గ్రాడ్యుయేట్ స్టడీస్ విభాగం డీన్ టింగ్‌లు, పబ్లిక్ హెల్త్ విభాగం ప్రొఫెసర్ విజయ్ గొల్లా, ఏయూ వీసీ జి.శశిభూషణ రావు, రిజిస్ట్రార్ ఈఎస్ ధనుంజయరావుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రెండు వర్సిటీల మధ్య సంయుక్తంగా పనిచేసే అంశం దిశగా చర్చించారు. సంయుక్తంగా కోర్సులు నిర్వహణ, పరిశోధనా రంగంలో కలిసి పనిచేయడం తదితర అంశాలపై ప్రాథమిక చర్చలు జరిపారు. కంప్యూటర్ సైన్స్ మేనేజ్‌మెంట్ స్టడీస్, ఆటిజంకు సంబంధించిన కోర్సుల నిర్వహించడానికి వీరు ఆసక్తి వ్యక్తం చేశారు. రెక్టార్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పక్కదారి పడుతున్న పేదల బియ్యం

రేషన్ డిపోలపై పర్యవేక్షణ కరువు


ఎండీయూ వాహనం వద్ద సరుకులు తీసుకుంటున్న కార్డుదారులు

కంచరపాలెం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రేషన్ డిపోలు, ఎండీయూ వాహనాలపై పౌరసరఫరాల అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల పేదల బియ్యం పక్కదారిపడుతున్నాయి. కంచరపాలెం పరిసర ప్రాంతాల్లో ఈ పరిస్థితి మరీ తీవ్రంగా ఉండడంతో పేదలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిరుపేదలకు రేషన్ సరుకులు అందించడానికి ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి బియ్యం, పంచదార, కందిపప్పు సరుకులు అందిస్తుంది. అయితే వీటిని కార్డుదారులకు అందజేయడంలో డీలర్లు, ఎండీయూ వాహనదారులు తమ చేతివాటాన్ని చూపుతున్నారు. రైతుబజారు ప్రాంగణంలోని ఒకటో సర్కిల్ కార్యాలయంలో పేదలకు సరుకులు సక్రమంగా పంపిణీ జరుగుతుందా ? లేదా ? పర్యవేక్షించడానికి 8 మంది ఆర్ఐలు ఉన్నారు. అయితే చాలా మంది రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు తూతూమంత్రంగా తనిఖీలు నిర్వహిస్తుండడంతో డీలర్లు అవకాశంగా తీసుకుని సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పలుచోట్ల ఎండీయూ వాహనదారులు, డీలర్లు కొందరు కార్డుదారులతో బేరాలు కుదుర్చుకుని బియ్యాన్ని తక్కువ ధరకు తీసుకుని నల్లబజారుకు తరలిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవల బిర్లా జంక్షన్ సమీపంలో పోలీసుల తనిఖీల్లో తొమ్మిది క్వింటాళ్ల రేషన్ బియ్యం దొరకడం గమనార్హం. ఇప్పటికైనా పర్యవేక్షణాధికారులు దృష్టిసారించి బియ్యం పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జీవీఎంసీ కమిషనర్ దృష్టికి 27వ వార్డు సమస్యలు


జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ వీరారావు

అక్కయ్యపాలెం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 27వ వార్డులోని పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌ను స్థానిక కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ గొలగాని వీరారావు బుజ్జి వినతిపత్రం అందజేశారు. దొండపర్తి, పులివారి వీధి రోడ్డు పక్కన శిథిలావస్థలోని మీ సేవా కేంద్రం భవనం స్థానంలో స్థానికులకు అందుబాటులో ఉండేలా జీ ప్లస్ 2 సామాజిక భవనాన్ని నిర్మించాలని కోరారు. స్థానికులు చిన్న చిన్న వేడుకలు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. బీఎస్ లే అవుట్, పద్మశ్రీ ఆస్పత్రి, ఎన్జీజీవోస్ కాలనీ ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

14తో ఈఎఫ్ యూఏఎన్ లింక్ గడువు ముగింపు

మురళీనగర్, డిసెంబరు 12 : ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (పీఎఫ్) కార్యాలయంలో ఎంప్లాయ్‌మెంట్ లింక్డ్ ఇన్సెంటివ్ స్కీమ్ కోసం యూనివర్సల్ అకౌంట్ నంబరు (యూఏఎన్) లింక్ చేసి, యాక్టివేట్ చేయడానికి గడువు ఈనెల 15తో ముగియనుంది. తొలుత ఈ గడువు నవంబరు 30 వరకు మాత్రమే ఉన్నా.. ఖాతాదారుల అభ్యర్థనల మేరకు డిసెంబరు 15వ తేదీ వరకు పొడిగించారు.ఈ అవకాశాన్ని ఖాతాదారులు వినియోగించుకోవాలని పీఎఫ్ కార్యాలయ ప్రాంతీయ అధికారులు కోరారు.

ముత్తంశెట్టి రాజీనామాతో వైసీపీలో కలవరం

... 5వ పేజీ తరువాయి

వెళ్లిపోతున్నారు.

ఈ నేపథ్యంలో హఠాత్తుగా గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటుచేసి భీమిలి నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి పదవితోపాటు పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించడంతో ఆ పార్టీనేతలు ఉలిక్కిపడ్డారు. ఎన్నికల్లో ఓటమి తరువాత జగన్మోహన్‌రెడ్డి అన్నీ సమీక్షించుకొని, తప్పులు సరిచేసుకొని పార్టీని ముందుకు తీసుకువెళతారని భావించానని, కానీ అటువంటిదేమీ కనిపించలేదని ఆయన వ్యాఖ్యానించారు. ముత్తంశెట్టి బాటలో మరికొందరు వైసీపీని వీడనున్నారనే ప్రచారం జరుగుతోంది. దీంతో అసంతృప్తులను గుర్తించి బుజ్జగించాలని ఆ పార్టీ పెద్దలు భావిస్తున్నట్టు తెలిసింది.

ప్రైవేటు కళాశాలల హాస్టళ్లపై దృష్టి

... 5వ పేజీ తరువాయి

జీవీఎంసీ ఆరోగ్య విభాగం, వైద్య ఆరోగ్య శాఖల నుంచి ఒక్కొక్క ఉద్యోగిని నియమించారు. వీరంతా గడచిన రెండు రోజుల నుంచి నగరంలో హాస్టళ్లను తనిఖీ చేస్తున్నారు. విశ్వసనీయంగా అందిన సమాచారం మేరకు...కొన్నిచోట్ల హాస్టళ్ల నిర్వహణ అధ్వానంగా ఉంది. విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు ఉండవు. ఉన్నవాటి నిర్వహణ కూడా అంతంతమాత్రమే. గదుల్లోకి వెలుతురు సరిగా రావడం లేదు.

చాలా హాస్టళ్లలో భోజనం కూడా బాగుండడం లేదు. రెండు, మూడు రోజుల్లో మొత్తం హాస్టళ్లను తనిఖీలు పూర్తిచేసి కలెక్టర్‌కు నివేదిక అందజేయనున్నారు.

గ్రీన్ బెల్ట్ కబ్జా

... 5వ పేజీ తరువాయి

ఏరియా మొత్తం కాంక్రీట్ వేసేసి, నిర్మాణంలో భాగంగా మార్చేసుకున్నారు. ప్రభుత్వం మారడంతో ఇప్పుడు కూటమి నేతల ఫొటోలతో ఫ్లెక్సీలు పెట్టి పనులు జరిపిస్తున్నారు.

ఎమ్మెల్యే విష్ణు ఫిర్యాదుతో...

విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు గురువారం అటువైపు వెళుతూ గ్రీన్ బెల్ట్ మొత్తం నాశనం చేసి ఆక్రమించిన వైనం గుర్తించి తక్షణమే జీవీఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రీన్‌బెల్ట్‌ను కాపాడాల్సిన బాధ్యత జీవీఎంసీపై ఉందని, అంత అడ్డగోలుగా పనులు చేస్తుంటే ఎందుకు చర్యలు చేపట్టడం లేదని ప్రశ్నించారు. ఆ షాపింగ్ మాల్ స్థలంలో ప్రభుత్వ స్థలం కూడా ఉందని, తనకు అనుమానంగా ఉందన్నారు. వారికి మాల్ నిర్మాణం కోసం ఇచ్చిన అనుమతులు ఏమిటి?, వారు చేపడుతున్న నిర్మాణం ఏమిటి?...మొత్తం పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

గ్రీన్ బెల్ట్‌ను నాశనం చేసినందుకు వారిపై క్రిమినల్ చర్యలు చేపట్టాలన్నారు. ఎమ్మెల్యే మధ్యాహ్నం 12 గంటలకు ఫిర్యాదు చేయగా...జీవీఎంసీ అధికారులు స్పందించి సాయంత్రం ఐదు గంటలకు అక్కడకు చేరి గ్రీన్ బెల్ట్‌లో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను కూలగొట్టారు. అయితే ఆ పని పూర్తిస్థాయిలో జరగలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

14 నుంచి ఘంటసాల గానోత్సవం

» అల్లూరి విజ్ఞాన కేంద్రంలో రెండు రోజుల పాటు నిర్వహణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

మద్దిలపాలెం, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి) : అమర గాయకుడు ఘంటసాల 102వ జయంతి సందర్భంగా డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఈనెల 14, 15 తేదీల్లో నిర్వహించే ఘంటసాల గానోత్సవాలను జయప్రదం చేయాలని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణశ్రీనివాస్ కోరారు. శివాజీపాలెంలో గురువారం ఆయన ఈ ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సంగీతాభిమానుల మనసుల్లో ఘంటసాల పాటలు స్థిరస్థాయిగా నిలిచి ఉంటాయని కొనియాడారు. ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ నిర్వహకుడు చెన్నా తిరుమలరావు మాట్లాడుతూ పలువురు ప్రముఖులు హాజరయ్యే ఈ కార్యక్రమంలో సాయంత్రం 6 గంటల నుంచి ఘంటసాల సినీ సంగీత విభావరి ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో త్యాగరాజన్, వీరేంద్రయాదవ్, పిన్నింటి ఆదిమూర్తి పాల్గొన్నారు.

దత్త జయంతి రేపు



అక్కయ్యపాలెం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రైల్వే ఎగ్జిబిషన్ మైదానం ఎదురుగా ఉన్న షిర్డీ సాయి ధ్యానమందిరంలో ఈ నెల 14న దత్త జయంతి మహోత్సవాన్ని నిర్వహించనున్నట్టు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నూకల శేషగిరిరావు తెలిపారు. గురువారం ఆలయ ఆవరణలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోజు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. భక్తులు పెద్దఎత్తున హాజరు కావాలని కోరారు.

కేవీలో బోధనాభ్యసన ఉపకరణాల ప్రదర్శన


విద్యార్థులు తయారు చేసిన ఉపకరణాలు

అక్కయ్యపాలెం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : తాటిచెట్లపాలెంలోని కేంద్రీయ విద్యాలయంలో ఏర్పాటు చేసిన బోధనాభ్యాసన ఉపకరణాల (టీఎల్ఎం) ప్రదర్శనను గురువారం ప్రిన్సిపాల్ కమల్‌జిత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాబోధనలో టీఎల్ఎం ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. విద్యార్థులు సృజనాత్మక పద్ధతిలో అభ్యసనం చేయడంలో ఉపయోగ పడుతుందన్నారు. తద్వారా బోధనా క్యాలెండర్‌తో సమర్థవంతంగా ఉండేందుకు వారికి సహాయపడుతుందని పేర్కొన్నారు. ఈ ప్రదర్శనలో ఉపాధ్యాయులు బోధనలో ఉపయోగించే వివిధ రకాలైన బోధనాభ్యాసన ఉపకరణలను ప్రదర్శించారు. కార్యక్రమంలో హెచ్ఎం వీఎం శైలజ, ప్రగతి, గోవింద, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రీడా దినోత్సవం


సమావేశంలో మాట్లాడుతున్న సూర్యప్రతాప్

కంచరపాలెం, డిసెంబరు 12 (ఆంధ్రప్రదేశ్) : కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద కేంద్రీయ విద్యాలయం-1లో గురువారం నిర్వహించిన వార్షిక క్రీడా వేడుకలకు విద్యాలయ మేనేజ్‌మెంట్ నామినీ చైర్మన్ కమడోర్ సూర్యప్రతాప్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. విద్యాలయ ప్రిన్సిపాల్ జి.కిశోర్ మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభ చూపడం అవసరమన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

తీరానికి ఆలివ్ రిడ్లే తాబేలు కళేబరం



సాగర్‌నగర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ వద్ద బేపార్కు ఎదురుగా ఉన్న తీరానికి ఆలివ్ రిడ్లే తాబేలు కళేబరం గురువారం కొట్టుకువచ్చింది. ఆలివ్ రిడ్లే తాబేళ్లు ఈ సీజన్‌లో ఎక్కువగా గుడ్లు పొదిగేందుకు విశాఖ తీరం వైపు వస్తుంటాయి. ఈక్రమంలో అవి మర పడవలు, కొన్ని రకాల వలలకు చిక్కుకుని మృత్యువాత పడుతుంటాయి. భారీ కాయంతో వున్న తాబేలు కళేబరాన్ని సందర్శకులు ఆసక్తిగా తిలకించారు.

ఉక్కులో గందరగోళం

... 5వ పేజీ తరువాయి

విభాగాలు దేనికవే ప్రత్యేకత ఉన్నవి. ఇక్కడ ముడి పదార్థాలు అందుబాటులో లేక పూర్తిస్థాయిలో ఉత్పత్తి జరగక నష్టాలు వస్తున్నాయి. ముడి పదార్థాలు ఇస్తే ఏ సమస్య ఉండదు. అదే మార్కెటింగ్ బృందం 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.28 వేల కోట్ల ఉత్పత్తులను విక్రయించింది. అదో రికార్డు. అటువంటి ప్లాంటు మార్కెటింగ్ విభాగానికి సెయిల్ నుంచి అధికారులను తేవలసిన అవసరం ఏమిటనేది స్పష్టంచేయాల్సి ఉంది.

దక్షిణ భారతదేశంలో విశాఖ ఉక్కుకు ప్రధాన పోటీదారు సెయిలే. రీబార్ల అమ్మకాల్లో విశాఖ స్టీల్‌దే పైచేయి. ఇప్పుడు డిప్యుటేషన్‌పై చీఫ్ జనరల్ మేనేజర్, జనరల్ మేనేజర్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్లను తీసుకువచ్చి నియమించారు. వారు సెయిల్ నుంచి జీతం తీసుకుంటారు. విశాఖ ఉక్కును పోటీగా భావించే ఆ అధికారులు ఇక్కడ ఎవరి ఉత్పత్తులు ప్రమోట్ చేస్తారనేది అనుమానమే. అయినా ఇక్కడ అమ్మడానికి అంత పెద్దమొత్తంలో ఉత్పత్తులే లేనప్పుడు వారిని తీసుకురావడం దేనికో అర్థం కావడం లేదని ఉద్యోగ వర్గాలు అంటున్నాయి. విశాఖ స్టీల్ మార్కెటింగ్ వ్యూహాలు తెలుసుకోవడానికా?, లేదంటే ఇక్కడి మార్కెట్‌లో సెయిల్ ఉత్పత్తులు ప్రమోట్ చేసుకోవడానికా?...అని ప్రశ్నిస్తున్నాయి.

అదేవిధంగా సెయిల్ నుంచి వచ్చిన అధికారులు ఇక్కడ పనిచేస్తున్న వారి కంటే జూనియర్లు. సెయిల్‌లో ప్రమోషన్ పాలసీ అమలు చేయడం వల్ల వారికి త్వరగా పదోన్నతులు వచ్చి ఆ స్థాయికి చేరారు. ఇక్కడ పదహారేళ్లుగా ఎవరికీ పదోన్నతులు లేవు. వేరే ప్లాంటు నుంచి జూనియర్లను తీసుకువచ్చి వారి కింద పనిచేయాలని చెప్పడంపై ఉద్యోగ వర్గాల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. విశాఖ ఉక్కును నాశనం చేయడానికే ఇలా చేస్తున్నారని ఆరోపిస్తున్నాయి. దీనిపై తక్షణమే కేంద్రంతో పాటు స్థానిక నేతలు కూడాస్పందించాలని డిమాండ్ చేస్తున్నాయి.

ప్రాణాలు తీస్తున్న నిర్లక్ష్యం

... 5వ పేజీ తరువాయి

హెల్మెట్ ధరించకపోవడం వల్లే మృతిచెందినట్టు పోలీసుల దర్యాప్తులో గుర్తించారు. 2024 జనవరి నుంచి నవంబరు వరకూ జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 290 మంది మృతిచెందగా, వారిలో 173 మంది ద్విచక్ర వాహనదారులు ఉన్నారు. వారిలో వంద మంది హెల్మెట్ ధరించకపోవడం వల్లే మృతిచెందినట్టు పోలీసులు గుర్తించారు. హెల్మెట్ ధారణ ఆవశ్యకతపై పోలీసులు ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా, జరిమానాలు విధిస్తున్నా సరే వాహన చోదకుల ధోరణిలో మాత్రం మార్పు కనిపించడం లేదు. పోలీసులను తప్పించుకునే యత్నంలో ఒక్కోసారి ఇతర వాహనాలను ఢీకొట్టి ప్రమాదాల బారినపడుతున్నారు.

ట్రాఫిక్ చలాన్‌లు విధించడంతోనే సరి

హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనం నడుపుతున్న వారిని సెల్‌ఫోన్‌తో ఫొటో తీసి ఈ-చలాన్ జారీ చేయడంతో తమ పని అయిపోయిందన్నట్టు పోలీసులు చేతులు దులిపేసుకుంటున్నారు తప్ప, అదే తప్పు మరోసారి చేయకుండా చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారు. నగరంలో ట్రాఫిక్ విధులునిర్వర్తించే పోలీసులతోపాటు ఇతర విభాగాల్లోని సిబ్బంది, అధికారులకు ఉన్నతాధికారులు ఈ-చలాన్‌లు టార్గెట్ ఇస్తున్నారు. ప్రతిరోజూ టార్గెట్ మేరకు సెల్‌లో ఫొటోలు తీయాలని ఒత్తిడి చేస్తున్నారు. దీంతో పోలీసులు కూడళ్ల వద్ద నిలబడి ఎవరు హెల్మెట్ లేకుండా వస్తున్నవారిని ఆపి సెల్‌ఫోన్‌తో ఫొటో తీసి పంపించేస్తున్నారు. జరిమానా విధించడంతో పాటు హెల్మెట్ కొనుగోలు చేసుకుని తీసుకువచ్చిన తరువాత వాహనం విడిచిపెడతామని షరతు విధిస్తే పరిస్థితి చాలావరకూ పరిస్థితి మారేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా హైకోర్టు కూడా ఇదే అంశంపై పోలీసుల తీరును తీవ్రంగా తప్పుపట్టింది. మూడు నెలల కాలంలో హెల్మెట్ ధరించని కారణంగా రాష్ట్రంలో 667 మంది మరణించడంపై ఆగ్రహం వ్యక్తంచేసింది. పోలీసులు జరిమానాలు విధించి చేతులు దులుపుకుంటున్నారని, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంలో విఫలమవుతున్నారంటూ వ్యాఖ్యానించింది. హైకోర్టు వ్యాఖ్యల నేపథ్యంలో నగర పోలీస్ ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే వారిపై చట్టపరంగా అందుబాటులో ఉన్న కఠిన చర్యలను తీసుకోవాలని యోచిస్తున్నట్టు సమాచారం. తద్వారా నగరంలో రోడ్డు ప్రమాదాల కారణంగా సంభవించే మరణాలకు అడ్డుకట్ట వేయవచ్చునని ఉన్నతాధికారులు భావిస్తున్నారు.



అమ్మవారికి పూజ చేస్తున్న మహిళలు, ముత్యాల వస్త్రాల అలంకరణలో కన్యకా పరమేశ్వరి

కన్యకాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు

మహారాణిపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వన్‌టౌన్‌లో ఉన్న వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు,తెల్లవారుజామున అమ్మవారిని మేల్కొలిపి ప్రభాత ఆరాధనలు పూర్తి చేశారు.అనంతరం 108 స్వర్ణ పుష్పాలతో అర్చన జరిపారు. అమ్మవారిని ముత్యాల వస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా 250 మంది మహిళలతో సామూహిక కుంకుమార్చన, లలితా సహస్ర పారాయణం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆరిశెట్టి దినకర్, తదితరులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

సాంకేతిక పరిజ్ఞానం అవసరం

మహారాణిపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు చిన్నతనం నుంచే సాంకేతికత పరిజ్ఞానంపై అవగాహన అవసరమని క్వెస్ట్ అలయన్స్ ఏపీ ప్రతినిధి సమీరా అన్నారు. గురువారం ఆమె జిల్లా పరిషత్ జంక్షన్‌లో ఉన్న సమావేశ మందిరంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) పాఠ్యాంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ పాఠ్యాంశాలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో క్వెస్ట్ అలయన్స్ భాగస్వామ్యం కానున్నట్టు చెప్పారు.

32వ వార్డులో అధికారుల పర్యటన



అల్లిపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 32వ వార్డులో మౌలిక వసతులు కల్పించాలని కార్పొరేటర్ కందుల నాగరాజు జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులను కోరారు. గురువారం ఏఈ శివ తేజస్విని వార్డులోని నేరెళ్ల కోనేరు, చలవతోట, ఏడుగుళ్లు, అల్లిపురం మార్కెట్, కర్నాల వీధి ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పెండింగ్ పనులను ఆమె దృష్టికి తీసుకువచ్చి, తక్షణమే పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ గిరిబాబు, నాయకులు శాలివాహన, బుజ్జి, ఆదిబాబు, కందుల బద్రీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

మరో ముగ్గురు అరెస్టు

మహారాణిపేట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆన్‌లైన్ వ్యభిచారం కేసులో టూ టౌన్ పోలీసులు మరో ముగ్గురిని అరెస్టు చేశారు. ఇటీవల టూ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లాడ్జిలో వ్యభిచారం చేస్తున్న ఇద్దరు మహిళలు పోలీసులకు పట్టుబడ్డారు. వారు ఇచ్చిన సమాచారంతో దీపక్ అనే వ్యక్తిని కూడా అరెస్టు చేశారు. దీపక్ ఇచ్చిన సమాచారంతో గురువారం కపరాడకు చెందిన ఎస్. శ్యామలరావు, పెందుర్తికి చెందిన పి. జయ గంగాధర కృష్ణ, కె. రత్నంను అదుపులోకి తీసుకున్నారు.

నేడు టేబుల్ టెన్నిస్ జిల్లా జట్టు ఎంపిక

విశాఖపట్నం, స్పోర్ట్సు, డిసెంబరు 12 : అండర్-15 బాల బాలికల టేబుల్ టెన్నిస్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు శుక్రవారం నిర్వహించనున్నట్టు జిల్లా సంఘం కార్యదర్శి డాక్టర్ డీవీఎస్‌వై శర్మ తెలిపారు. రైల్వే ఇండోర్ స్పోర్ట్సు ఎన్‌క్లేవ్‌లో సాయంత్రం 4 గంటల నుంచి జరిగే ఎంపికలో పాల్గొనేవారు వయసు ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డుతో సహా హాజరుకావాలన్నారు. ఆసక్తిగలవారు 9052667766 వాట్సాప్ నంబరుకు ఎంట్రీలు పంపించాలన్నారు.

బచేలి, కిరండోల్ సెక్షన్‌లో జీఎం పర్యటన


సిబ్బందితో మాట్లాడుతున్న జీఎం పరమేశ్వర ఫంక్వాల్

విశాఖపట్నం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వాల్తేరు డివిజన్ పరిధిలోని బచేలి, కిరండోల్ సెక్షన్‌లో తూర్పు కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర ఫంక్వాల్ గురువారం పర్యటించారు. కిరండోల్, జగదల్‌పూర్ లైనులో కొనసాగుతున్న డబ్లింగ్ పనులు, సైడింగ్ సౌకర్యాలను పరిశీలించి తనిఖీ చేశారు. కిరండోల్ వద్ద వ్యాగన్ లోడింగ్ సమయాన్ని గణనీయంగా తగ్గించడం, కార్యాచరణ సామర్థ్యాన్ని పెంచడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన వ్యాగన్ డిస్చార్జ్ సైలో సిస్టమ్‌పై సమీక్షించారు. అనంతరం బచేలి, జగదల్‌పూర్ సెక్షన్‌లో గ్యాంగ్‌మెన్, సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్ సిబ్బందితో, అలాగే ట్రాక్స్ నిర్వహణ సిబ్బందితో మాట్లాడి పలు వివరాలు ఆరా తీశారు. అనంతరం ఎన్ఎండీసీ అధికారులతో పెట్రో లోడింగ్ కార్యకలాపాలపై చర్చించారు. ఆయనతో పాటు డీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహు ఉన్నారు.


ప్రధాన ద్వారం వద్ద గుమిగూడిన జనం. కంట్రోల్‌లో చేయలేకపోతున్న పోలీసులు.


అమ్మవారి సన్నిధిలో ఒకే దగ్గర పోలీసులు

అమ్మవారి ఉత్సవంలో మళ్లీ అదే తీరు

» అడుగడుగునా పోలీసులు

» ఆగని అడ్డగోలు దర్శనాలు

విశాఖపట్నం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్ కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర ఉత్సవాల్లో సామాన్య భక్తులకు దర్శనం గగనమైపోతోంది. అమ్మవారికి ప్రీతికరమైన గురువారాల్లో వీఐపీల తాకిడి పెరిగి ధర్మ దర్శనానికి గంటల సమయం పడుతోంది. దీంతో ప్రధాన ద్వారం వద్ద తోపులాట జరుగుతోంది. అమ్మవారి సన్నిధిలోను అదే పరిస్థితి. ఆలయ ప్రధాన ద్వారం పక్కనే పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేశారు. బందోబస్తులో 800 మంది పోలీసులున్నారు. క్యూలైన్లకు అనేక ఏర్పాట్లు ఉన్నాయి.భక్తులను లైన్లలో పంపితే రద్దీ ఉండదు. కానీ ప్రధాన ద్వారం నుంచి వీఐపీల పేరుతో అడ్డగోలు దర్శనాలతో గుంపులుగా చేరుతున్నారు. వందల మంది పోలీసులుండి భక్తులను క్యూలైన్లలో పంపలేకపోవడమేమిటో అధికారులే చెప్పాలి. అమ్మవారి సన్నిధిలో పది మంది కంటే ఎక్కువ పట్టరు. అక్కడ సగం మంది (ఐదుగురు) పోలీసులే ఉంటున్నారు. సాఫీగా సాగాల్సిన క్యూలైన్లు గంటల కొద్దీ కదలకపోవడంతో చాలామంది అక్కడే కూర్చొండిపోతున్నారు. నియోజకవర్గం, వార్డు నాయకులు, దేవస్థానం ట్రస్టు మాజీ సభ్యుల పేరుతో వందలాది మంది ఉచిత వీఐపీ దర్శనాలకు రావడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దేవదాయ, పోలీసు శాఖల మధ్య సమన్వయం లేదన్న విమర్శలు ఉన్నాయి.

సింహగిరిపై సంప్రదాయబద్ధంగా తిరు నక్షత్ర పూజలు

సింహాచలం, డిసెంబరు 12 (ఆంధ్ర జ్యోతి) : వరాహలక్ష్మీ నృసింహస్వామి సన్నిధిలో తిరుమంగై ఆళ్వార్ తిరునక్షత్ర పూజలు సంప్రదాయబద్ధంగా జరుగుతున్నాయి. గురువారం వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని ఉభయదేవేరులు, ఆళ్వార్లతో శోభాయమానంగా అలంకరించి వేదికపై అధిష్ఠింపజేశారు. ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో తొలుత షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం అధ్యాపకులు నాలాయిర దివ్య ప్రబంధంలోని వెయ్యి పాశురాలను అనుసంధానం చేశారు. మధ్యాహ్నం రాజభోగ నివేదన వేళ పూజలు చేసి కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

లోన్ యాప్‌ల ఆగడాలు

... 5వ పేజీ తరువాయి

రుణం వస్తుందనే ఉద్దేశంతో ఫోన్ చేయడం లేదా లింక్ క్లిక్ చేయడం చేస్తున్నారు. రుణం మంజూరు చేసినప్పుడే టర్మ్స్ అండ్ కండీషన్స్ పేరుతో బాధితుడి ఫోన్‌లోని కాంటాక్ట్స్, ఫొటో గ్యాలరీ యాక్సిస్‌ను యాప్‌ల నిర్వాహకులు తీసుకుంటారు. దీనివల్ల ఫోన్‌లోని ఫొటోలు, కాంటాక్ట్ నంబర్లు వంటి వివరాలన్నీ యాప్‌ల నిర్వాహకులు చేతుల్లోకి వెళ్లిపోతాయి. లోన్ మంజూరుచేసిన తర్వాత రోజు నుంచి తిరిగి చెల్లింపుల కోసం ఒత్తిడి ప్రారంభిస్తారు. వాయిదాలను సకాలంలో కట్టకపోయినా, వారు చెప్పినంత వడ్డీ చెల్లించకపోయినా ఫోన్‌లోని కాంటాక్టు నంబర్లు అన్నింటికీ మార్ఫింగ్ చేసిన ఫొటోలు పంపిస్తారు. దీంతో బాధితులు అవమాన భారంతో తీవ్రమైన నిర్ణయాలు తీసుకుంటున్నారు. కొన్నాళ్ల కిందట ఎండాడ పనోరమ హిల్స్‌లో నివాసముంటున్న ఒక మహిళ సెల్‌ఫోన్‌కు రూ.30 వేలు రుణం అర్హత ఉందంటూ మెసేజ్ వచ్చింది. అదేమిటో తెలుసుకునేందుకు మెసేజ్‌ను ఓపెన్‌చేసిన వెంటనే ఫోన్ పే ద్వారా ఆమె ఖాతాకు రూ.1,240 జమ అయ్యాయి. వెంటనే 'మీరు లోన్ తీసుకున్నందున వాయిదాలు కట్టాలని ఎవరో ఫోన్‌చేసి అడగడం ప్రారంభించారు. బాధితురాలు దానిని తేలిగ్గా తీసుకుని ఆ నంబర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టేశారు. దీంతో సదరు మహిళ ఫొటోలను యాప్ నిర్వాహకులు మార్ఫింగ్ చేసి ఆమె సెల్‌ఫోన్ కాంటాక్టులోని నంబర్లకు పంపించసాగారు. ఆ విషయం తెలిసి ఆందోళనకు గురైన ఆమె వాళ్లు అడిగిన రూ.20 వేలు మొత్తాన్ని ఫోన్‌పే ద్వారా కట్టేశారు. అయినప్పటికీ ఇంకా వేధింపులు కొనసాగించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

విదేశాల నుంచే నిర్వహణ

ఇన్‌స్టంట్ లోన్‌యాప్‌ల నిర్వాహకులంతా విదేశాల్లో ఉంటూ కార్యకలాపాలు సాగిస్తుంటారు. కాల్‌సెంటర్ ఏర్పాటుచేసుకుని అన్ని భాషలు మాట్లాడగలిగే వారిని ఉద్యోగాల్లో పెట్టుకుంటారు. ఏ రాష్ట్రానికి చెందిన వారితో మాట్లాడాల్సి వస్తే ఆ రాష్ట్ర భాష మాట్లాడే వారితో ఫోన్ చేయిస్తారు. ఒకవేళ ఎవరైనా పోలీసులకు ఫిర్యాదు చేసినాసరే తమ ఉనికి తెలియకుండా ఉండేందుకు దొంగపత్రాలతో పొందిన సిమ్‌కార్డులు, బ్యాంక్ ఖాతాలను వాడుతున్నారు. దీనివల్ల నిందితులను పట్టుకోవడం పోలీసులకు సవాల్‌గా మారుతోంది.

లోన్‌యాప్‌ల వలలో పడొద్దు

- కె.భవానీప్రసాద్, సైబర్‌క్రైమ్ సీఐ



లోన్‌యాప్‌లు యమపాశాలు వంటివి. ఒకసారి వాటి వలకు చిక్కితే జీవితకాలం ఇబ్బందులు పడాల్సి ఉంటుంది. ఎవరు వాటి జోలికి వెళ్లొద్దు. ఎవరైనా లోన్ ఇస్తామని మెసేజ్‌లు పంపినా, గుర్తుతెలియని లింక్‌లు వచ్చినా వాటికి స్పందించకూడదు. కొంతకాలంగా స్తబ్దుగా ఉన్న లోన్ యాప్‌ల నిర్వాహకుల ఆగడాలు మళ్లీ మొదలయ్యాయి. లోన్‌యాప్‌ల మోసాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు సీపీ శంఖబ్రతబాగ్చి ఆదేశాలు మేరకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

గాజువాక కోర్టులో లోక్ అదాలత్ రేపు

గాజువాక, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం ఈ నెల 14న గాజువాక కోర్టు కాంప్లెక్స్‌లో లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు 13వ అదనపు జిల్లా జడ్జి జి.షణ్ముఖరావు తెలిపారు. కోర్టు కాంప్లెక్స్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని రకాల బ్యాంక్ కేసులు, భూ తగాదాలు, రెవెన్యూ, కార్మిక, కుటుంబ, మోటార్ వాహనాల ప్రమాదాలు, ఇన్సూరెన్స్, విద్యుత్, నీరు, టెలిఫోన్, తదితర తగాదాలు, రాజీపడదగ్గ అన్ని క్రిమినల్ కేసులు, ట్రాఫిక్ కేసులు, మునిసిపల్ వివాదాలు వంటి వాటిని ఈ లోక్ అదాలత్‌లో రాజీ మార్గంలో పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెందుర్తి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సుజాతనగర్ సబ్ స్టేషన్ 33/11కేవీ ఫీడర్ పరిధిలోని మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేత పనులు చేపట్టనున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ పోలాకి శ్రీనివాసరావు గురువారం తెలిపారు. ఈ కారణంగా క్రాంతినగర్, వుడా కాలనీ, రైల్వే విహార్, వీరా నగర్, జోగులమ్మ బస్టాప్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు.

వేపగుంట: పురుషోత్తపురం సబ్ స్టేషన్ కృష్ణరాయపురం 11 కేవీ ఫీడర్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని వేపగుంట ఏఈ సురేశ్ తెలిపారు. ఈ కారణంగా కృష్ణరాయపురం, పురుషోత్తపురం, సేనాతివాని పాలెం, వరలక్ష్మీనగర్, సంతోష్‌నగర్, తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు.

97వ వార్డులో ఎమ్మెల్యే పర్యటన

పెందుర్తి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): 97వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు గురువారం కార్పొరేటర్ సేనాపతి వసంత శంకరరావు, అధికారులతో కలిసి పర్యటించారు. శాంతినగర్, ఎస్సీ, బీసీ కాలనీ, ద్రోణంరాజు నగర్, ఎంఈఎస్ లేఅవుట్, శ్రమశక్తి నగర్, ప్రసాద్ నగర్ కాలనీల్లో ఆయన పర్యటించి మౌలిక వసతుల కల్పనపై ఆరా తీశారు. తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా థీమ్ పార్క్ నిర్మాణానికి రూ.రెండు కోట్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఎ.అప్పలనాయుడు, సోమశేఖర్, శంకర్‌ప్రసాద్, రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

సార్బ్ బ్రాంచిని సందర్శించిన డీజీఎం కేజీ రావు

సిరిపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సిరిపురంలోని స్టేట్ బ్యాంక్ ఇండియా సార్బ్ బ్రాంచిని హైదరాబాద్ సామ్రో డిప్యూటీ మేనేజర్ కేజీ రావు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వార్షిక సంవత్సరం రికవరీలో ఈ బ్రాంచ్ అద్భుత ప్రతిభ కనబరచిందన్నారు. భవిష్యత్తులో కూడా అత్యధిక రికవరీలు సాధించాలని సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. బ్రాంచ్ హెడ్, అసిస్టెంట్ జీఎం ఎం.విజయలక్ష్మి, సిబ్బందిని అభినందించారు. అనంతరం బ్రాంచ్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏజీఎం ఎం.విజయలక్ష్మి, చీఫ్ మేనేజర్లు బి.వరప్రసాద్, వై.శ్రీకాంత్, వై.కిరణ్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **పుష్ప-2 :** జగదాంబ, శారద, రమాదేవి, శ్రీవెంకటేశ్వర, వెంకటేశ్వర, శ్రీకన్య, సంగం, శరత్, మెలోడి, శరత్, కిన్నెర, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ, నరసింహ, సుకన్య, సౌజన్య, మౌర్య (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని, లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1,2 (పెందుర్తి), శ్రీరాములమ్మ, గణేష్, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 52, టమాటా 26, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 22, పచ్చిమిర్చి 24, కాకరకాయలు 34, బీరకాయలు 38, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 16, క్యాబేజీ 18, క్యారెట్ 60, దొండకాయలు 30, బంగాళదుంపలు 34, అరటికాయ (పెద్దది) 6, అల్లం (పాతది) 56, మునక్కాడలు (కిలో) 120, బరబాటి 26, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 55, గోరుచిక్కుడు 24 దోసకాయలు 24, వెల్లుల్లి (పెద్దవి) 300, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 60, పొటల్స్ 48, కీరదోస 28, క్యాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 40, చిలగడదుంపలు 34, కంద 64, దేముడుచిక్కుడు 46, కొండఉసిరి 55, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, మామిడి అల్లం 64, కర్రపెండలం 28, బూడిద గుమ్మడికాయ 30, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	615
విజయనగరం	619
శ్రీకాకుళం	619

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	93
ఫారం ధర	113
విత్ స్కిన్	296
స్కిన్‌లెస్	206

నిధుల బాధ్యత నాది.. విధుల బాధ్యత మీది

» మండల పరిషత్ సమావేశంలో అధికారులకు సూచించిన పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల

» గృహ నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారుల ఇళ్ల పట్టాలను రద్దు చేస్తాం

» ఆర్అండ్‌బీ అధికారుల తీరుపై మండిపాటు

» సమావేశానికి డుమ్మా కొట్టిన అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లపై రమేశ్‌బాబు ఆగ్రహం



సోలార్ విద్యుత్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పంచకర్ల

పెందుర్తి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ పరిధిలో గల గ్రామాల అభివృద్ధికి నిధులు తెచ్చే బాధ్యత తాను తీసుకుంటానని, సక్రమంగా విధులు నిర్వర్తించడం అధికారుల పని అని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఉద్బోధించారు. నిధులు లేవంటూ విధుల్లో అలసత్వాన్ని ప్రదర్శిస్తే సాకులు చెప్పి తప్పించుకుంటే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. పెందుర్తి మండల పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం గురువారం ఎంపీపీ మదుపాడ నాగమణి అధ్యక్షతన పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన పంచకర్ల పరిషత్‌తో గల శాఖలవారీగా నిధులు, విధులపై సమీక్షించారు. సమావేశానికి డుమ్మా కొట్టిన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు కూడా గైర్హాజరు కావడం పట్ల ఆయన అసహనం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు ప్రజల కోసం పని చేయడం ద్వారా వచ్చే కిక్కును ఎంజాయ్ చేసేలా ఉండాలన్నారు. వచ్చామా, వెళ్లామా అన్న రీతిన కాకుండా విధుల్లో పారదర్శకత ఉండాలని, అలా పని చేయని అధికారులు ఇళ్లకు వెళ్లిపోవచ్చన్నారు.

అనంతరం పంచకర్ల శాఖలవారీగా సమీక్షించారు. గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో జగనన్న కాలనీల్లో నిర్మించిన గృహాల్లో అవకతవకలు ఉన్నాయని పలువురు ఆరోపించారు. పట్టా పొందాక పలువురు ఇల్లు నిర్మించకుండా విక్రయాలు జరుపుతున్నారని, మళ్లీ ఇల్లు లేదని చెబుతున్నారని పలువురు సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. మండలంలో తొమ్మిది లేఅవుట్లలో 1,754 ఇళ్లు మంజూరైతే కేవలం 854 మాత్రమే వివిధ దశల్లో నిర్మాణాలు పూర్తి కావచ్చాయని, అసలు నిర్మాణాలు జరపని వాటి సంగతి ఏంటని హౌసింగ్ అధికారులను ప్రశ్నించారు. లబ్ధిదారులతో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని చెబుతున్నామని హౌసింగ్ అధికారులు చెప్పడంపై ఎమ్మెల్యే రుసరుసలాడారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారుల హౌసింగ్ పట్టాను రద్దు చేయాలన్నారు. జలజీవన్ మిషన్ పథకం పనులు అస్తవ్యస్తంగా జరుగుతున్నాయంటూ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను నిలదీశారు.

ఆర్అండ్‌బీ అధికారుల తీరుపై పంచకర్ల మండిపాటు

మండలంలోని ఆర్అండ్‌బీ రోడ్ల దుస్థితిపై తాను సీఎంకు లేఖ రాస్తే ముఖ్యమంత్రి స్పందించి నిధులు మంజూరు చేసినా అధికారులు ఎస్టిమేషన్ వేసి టెండర్లు పిలవకపోవడం దారుణమని పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు మొద్దునిద్ర వీడాలన్నారు. జెర్రిపోతులపాలెంలో తాగునీటి సరఫరా ట్యాంకర్ శిథిలమైందని, జంగాలపాలెంలో హౌసింగ్ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని, గుర్రమ్మపాలెంలోని జగనన్న కాలనీ నీటి ముంపునకు గురవుతున్నందున కల్వర్ట్ నిర్మాణం చేపట్టాలని, జుత్తాడలో 327 ఇళ్లు గల జగనన్న కాలనీకి రోడ్డు సదుపాయం లేదని, ఎస్ఆర్‌పురంలో క్వారీ లీజు పూర్తయినా, గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరుగుతుండడానికి మైనింగ్ శాఖ అధికారుల వైఫల్యమే కారణమని పలువురు సభ్యులు నిలదీశారు.

ఈ సందర్భంగా పంచకర్ల మాట్లాడుతూ ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు గ్రామాలను విజిట్ చేసి సమస్యల జాబితాను రూపొందిస్తే ఎమ్మెల్యేగా తాను వాటి పరిష్కారానికి తగిన చర్యలు చేపడతానన్నారు. అనంతరం సోలార్ విద్యుత్‌పై అవగాహన కల్పిస్తూ మండల విద్యుత్ అధికారుల ఆధ్వర్యంలో పోస్టర్‌ను రమేశ్‌బాబు ఆవిష్కరించారు. సమావేశంలో ఎంపీడీవో కొల్లి వెంకటరావు, తహసీల్దార్ ఆనంద్‌కుమార్, ఎంపీటీసీ, సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



చంద్రనగర్‌లో జరిగిన రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ గణబాబు



పినగాడిలో అర్జీ స్వీకరిస్తున్న గండి బాబ్జీ, తదితరులు

భూ సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

విప్, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు

గోపాలపట్నం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని విప్, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. 89వ వార్డు చంద్రనగర్ మైదానంలో గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజల నుంచి అందిన ప్రతి సమస్యను అధికారులు సమన్వయంతో పరిష్కరించేందుకు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కొత్తపాలెం, ఎల్లపువానిపాలెం గ్రామాల పరిధిలో గల కాలనీ ప్రజల నుంచి గణబాబు అర్జీలను స్వీకరించారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సదస్సులో పట్టాల మంజూరు కోరుతూ 144 అర్జీలు, 22-ఏ సమస్య పరిష్కారానికి మూడు అర్జీలు, పట్టాదారు పాస్‌బుక్‌లో పేరు మార్పిడికి 16 అర్జీలు, భూ ఆక్రమణపై ఒక అర్జీ అందాయి. అదేవిధంగా రేషన్ కార్డులు, పెన్షన్ల మంజూరు కోరుతూ 15 అర్జీలు అందినట్టు గోపాలపట్నం తహసీల్దార్ సీహెచ్‌వీ రమేశ్ తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ ప్రత్యేకాధికారి డీఎస్ సునీత, జెడ్పీ హైమావతి, సబ్ రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణ, దేవదాయశాఖ ఈవో శేఖర్‌బాబు, పార్టీ వార్డు అధ్యక్షుడు బి.విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి: గండి బాబ్జీ

పెందుర్తి: భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను అందరూ సద్వినియోగం చేసుకోవలసిందిగా తెలుగుదేశం పార్టీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ కోరారు. మండలంలోని పినగాడిలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ చేసుకోవాలని చాలామంది రైతులు రీ-సర్వేతో మరిన్ని ఇబ్బందులు పడుతున్నారన్నారని పేర్కొన్నారు. భూ సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయన్నారు. ఈ సందర్భంగా 13 అర్జీలను తహసీల్దార్ ఆనంద్‌కుమార్ స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బయిలపూడి వెంకటలక్ష్మి, టీడీపీ నాయకుడు వెన్నెల పెంటబాబు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

గాజువాక, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 72వ వార్డు వినాయక నగర్‌లో రూ.20 లక్షల వ్యయంతో హెచ్‌డీపీఈ వాటర్ లైన్‌కు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు పైపు లైన్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రజా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. నియోజకవర్గంలో అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. కార్పొరేటర్ ఏజే స్టాలిన్ మాట్లాడుతూ వార్డు అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ శేషాద్రి, డీఈ శ్రీనివాసరావు, ఏఈ కేదార్‌నాథ్, నాయకులు ఎ.లక్ష్మణరావు, ఎస్.రామారావు, ప్రసాదుల శ్రీనివాస్, గుడివాడ అమ్మన్న, ఎ.విష్ణుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ప్రభుత్వం

పెదగంట్యాడ: బాధితులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని, ప్రభుత్వం ప్రకటించిన అన్ని పథకాలను వర్తింపజేస్తామని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 75వ వార్డు సీతానగరం గ్రామానికి చెందిన నక్కా శ్రీనివాసరావు అనారోగ్యం కారణంగా ఇటీవల మృతి చెందారు. మృతుని కుటుంబాన్ని గురువారం పల్లా పరామర్శించారు. మృతుడు టీడీపీ సభ్యుడు కావడంతో పార్టీపరంగా రావాల్సిన ఆర్థిక సహాయాన్ని అందజేస్తామని మృతుని కుటుంబానికి తెలిపారు. పల్లా వెంట పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, 75వ వార్డు అధ్యక్షుడు నమ్మి అప్పారావు, స్థానిక పెద్దలు రమణ, సింహాచలం, తదితరులు ఉన్నారు.



వినాయక నగర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన పల్లా శ్రీనివాసరావు

కౌశల్-2024 రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు వీరే..

పెదగంట్యాడ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): కౌశల్-2024 జిల్లా స్థాయి సైన్స్ ప్రతిభా అన్వేషణ పోటీల ఫలితాలను జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ గురువారం విడుదల చేశారు. ఇందులో ఎంపికైన విద్యార్థులు ఈ నెల 30న విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కి. స్ట్రక్చర్ కళాశాలలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరు కావాలని పేర్కొన్నారు.

క్విజ్ టీమ్ 1: కణితి జెడ్పీ ఉన్నత పాఠశాల ఎనిమిదో తరగతి విద్యార్థి టి.రోహిత, భీమిలి మునిసిపల్ హైస్కూల్ విద్యార్థి డి.మనోజ్, రేవిడి జెడ్పీ హైస్కూల్ విద్యార్థి మరగడ అశ్విని.



విద్యార్థుల పేర్లను ప్రకటిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్

క్విజ్‌టీమ్ 2: జీవీఎంసీ 22వ వార్డు కేడీపీఎం హైస్కూల్ విద్యార్థి కె.డానియల్ నిరీక్షణ, భీమిలి కేజీబీవీ విద్యార్థి సోనియా, ఏడో వార్డు డాక్టర్ బీఆర్‌ఏఎంపీఎల్ హైస్కూల్ విద్యార్థి పి.సాయివర్ధన్.

పోస్టర్ విభాగంలో ఎనిమిదో తరగతి విభాగం నుంచి అడవివరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థి చైత్రవర్షిణి, క్వీన్ మేరీ ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థిని మహిత, తొమ్మిదో తరగతి విభాగం నుంచి మధురానగర్ ఎంపీహెచ్‌ఎస్ నుంచి పి.చరణ్‌కుమార్, 14వ వార్డు మున్సిపల్ హైస్కూల్ విద్యార్థిని ఎస్.విజయదుర్గ ఎంపికయ్యారు. అలాగే పదో తరగతి విభాగం రీల్స్‌కు సంబంధించి నడుపూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థి ఎల్.కౌశిక్, రెండో వార్డు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని కృష్ణ హరిణి ఎంపికయ్యారు.



స్టీల్‌ప్లాంట్ సీజీఎం గాంధీని సత్కరిస్తున్న ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రతినిధులు

ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమానికి కృషి

స్టీల్‌ప్లాంట్ సీజీఎం (హెచ్‌ఆర్) జి.గాంధీ

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమానికి విశేష కృషి చేస్తున్నామని, రూల్ ఆఫ్ రిజర్వేషన్లను పక్కాగా అమలు చేస్తున్నామని స్టీల్‌ప్లాంట్ సీజీఎం (హెచ్‌ఆర్) జి.గాంధీ అన్నారు. ప్లాంట్ హెచ్‌ఆర్‌డీ భవనంలో గురువారం ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిజర్వేషన్ పాలసీపై ఒకరోజు సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హ్యూమన్ రిసోర్స్ కోసం హెచ్‌ఆర్‌డీ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఉత్పత్తి, ఉత్పాదకలో స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు ఎంతో శ్రమిస్తున్నారని, ప్లాంట్ ప్రగతిలో కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బొండా తౌడన్న, బయ్యే మల్లయ్య ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జీఎం (వెల్ఫేర్) మధుసూదనరావు, లైజన్ అధికారి బాబు నాయక్, సెల్ అధికారి ప్రసాద్, రిటైర్డ్ జీఎం కె.సంజీవరావు, అసోసియేషన్ ప్రతినిధులు సత్యనారాయణ, మోహన్‌బాబు, పుల్లారావు, నాయక్, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులు ప్రారంభం

కూర్మన్నపాలెం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు సిద్ధార్థ నగర్‌లో గురువారంస్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ పనులను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు ప్రజలంతా దశాబ్దాలుగా స్పోర్ట్స్ కాంప్లెక్స్ కోసం ఎదురుచూస్తున్నారన్నారు. 2018లో టీడీపీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు హయాంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ కోసం రూ.రెండు కోట్లు కేటాయించారన్నారు. అయితే ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ నిధులు పక్కదారి పట్టడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయన్నారు. మళ్లీ ఎమ్మెల్యేగా పల్లా ఎన్నికవ్వడం, టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు కదలిక వచ్చిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, వర్రె రాంబాబు, డీవీ అప్పారావు, ఎస్.పెంటారావు, బి.నాగేశ్వరరావు, భాగ్యలక్ష్మి, సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న పెన్షన్ ఆర్డర్లను విడుదల చేయాలి

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గత 14 నెలలుగా పెండింగ్‌లో ఉన్న అధిక పెన్షన్ ఆర్డర్లను తక్షణమే విడుదల చేయాలని కోరుతూ ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ పవన్‌కుమార్ జాస్తికి గురువారం పీఎఫ్ కార్యలయంలో స్టీల్‌ప్లాంట్ పెన్షనర్ల సంఘం సభ్యులు వినతిపత్రం అందజేశారు. గత ఏడాది సెప్టెంబరులో సుమారు 2,500 మంది పెన్షనర్లకు అధిక పింఛన్ మంజూరు చేయడానికి బకాయి మొత్తాలను చెల్లించాలని నోటీసులు జారీ చేయగా, స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం సుమారు రూ.410 కోట్లు జమ చేసిందన్నారు. అయితే రెండు, మూడు నెలల్లోనే పింఛన్లు మంజూరు చేయాల్సి ఉన్నా, ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేదన్నారు. దీనిపై స్పందించి పెన్షన్ల మంజూరుకు కృషి చేయాలని కోరారు.

ఉక్కు ఆస్పత్రిలో మెరుగైన సేవలందించాలి

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ జనరల్ ఆస్పత్రి ఇన్‌చార్జిగా నియమితులైన డాక్టర్ గౌతమ్‌ను ఉక్కు కార్మిక సంఘ నాయకులు గురువారం కలిసి అభినందనలు తెలిపారు. అనారోగ్యంతో ఆస్పత్రికి వచ్చే ఉక్కు ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన వైద్య సేవలందించాలని, ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలు కల్పించాలని కార్మిక నాయకులు కోరారు. గౌతమ్‌ను కలిసిన వారిలో నాయకులు జి.బోసుబాబు, పి.పెద్దిరాజు, రామసత్యం, తదితరులు ఉన్నారు.



రోడ్డుకు అడ్డంగా వాహనాన్ని నిలిపి డెబ్రిస్‌ను డంపింగ్ చేస్తున్న దృశ్యం

యారాడ రోడ్డులో ఇష్టానుసారంగా డెబ్రిస్ డంపింగ్

ఇబ్బందులకు గురవుతున్న పర్యాటకులు, స్థానికులు

సింధియా, డిసెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతమైన యారాడ బీచ్‌కు వెళ్లే ఘాట్ రోడ్డుకు ఇరుపక్కలా భవన నిర్మాణాలకు సంబంధించిన డెబ్రిస్, ఇతర వ్యర్థాలను పలువురు ఇష్టారాజ్యంగా పడేస్తున్నారు. దీనివల్ల యారాడ తీరానికి నిత్యం రాకపోకలు సాగించే పర్యాటకులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఒక్కోసారి డెబ్రిస్‌ను డంపింగ్ చేసేందుకు వచ్చే వాహనాలను రోడ్డుకు అడ్డంగా నిలిపివేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టపగలే ఇష్టానుసారంగా భవన నిర్మాణదారులకు సంబంధించిన కాంట్రాక్టర్లు రోడ్డు పక్కన డెబ్రిస్‌ను డంపింగ్ చేస్తున్నా అధికారులు తమకేమీ పట్టనట్టు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే ఇతర వ్యర్థాలను ఇక్కడే పడుస్తుండడంతో ఈ మార్గంలో దుర్వాసన రాజ్యమేలుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందువల్ల జీవీఎంసీ అధికారులు స్పందించి ఈ మార్గంలో డెబ్రిస్, ఇతర వ్యర్థాలు వేయకుండా తగిన చర్యలు చేపట్టాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

దేశాభివృద్ధికి అందరూ పాటు పడాలి

అగనంపూడి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధికి ప్రతి పౌరుడు పాటు పడాలని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ అజిత్‌కుమార్ అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు వికసిత్ భారత్-ఇన్నోవేట్ ఇండియా అనే అంశంపై జరిగిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 2047 నాటికి అభివృద్ధిలో అగ్రగామిగా మన దేశం నిలిచేందుకు యువత కృషి చేయాలన్నారు. పరిశ్రమల స్థాపనకు మన ప్రభుత్వాలు అన్ని రకాలుగా ప్రోత్సాహాన్ని అందిస్తున్నాయని, వాటిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. అనంతం విజ్ఞాన్ యాజమాన్యం అజిత్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధాకర్, రెక్టార్ మధుసూదనరావు, అర్చన, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నూకాంబిక ఆలయ వార్షికోత్సవం



అమ్మవారి దర్శనానికి బారులుతీరిన భక్తులు

మల్కాపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జింక్ గేటు సమీపంలో ఉన్న హిమాచల్‌నగర్‌లో గల శీనూకాంబిక అమ్మవారి ఆలయ తొమ్మిదో వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి నూకాంబికను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. నూకాంబికను దర్శించేందుకు క్యూ లైన్లలో బారులుతీరారు. కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీ, జనసేన నాయకుడు పుర్రె సురేశ్, కూటమి నాయకులు పూజల్లో పాల్గొన్నారు.

కార్మికుల సస్పెన్షన్‌ను రద్దు చేయాలని ధర్నా

ఎన్.ఎ.డి.జంక్షన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎన్ఏడీలో అక్రమంగా సస్పెండ్ చేసిన 36 మంది ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకునేంత వరకు పోరాటాలను కొనసాగిస్తామని వివిధ యూనియన్ల నాయకులు పేర్కొన్నారు. ఎన్ఏడీ గేటు ఎదుట యాంటీ విక్టమేజన్ నిరసన వారంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ, రక్షణ రంగ ఉద్యోగ యూనియన్ నాయకులు గురువారం సాయంత్రం భారీ ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎన్ఏడీసీఈ యూనియన్ ఏర్పాటు చేసిన సమావేశంలో డిఫెన్స్ కో-ఆర్డినేషన్ ఛైర్మన్ రెడ్డి వెంకటరావు మాట్లాడుతూ ఎన్ఏడీ యాజమాన్య నిరంకుశ విధానాన్ని ఎదుర్కొనేందుకు అందరూ సమష్టిగా పోరాటాలు చేయాలన్నారు. ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగభూషణరావు మాట్లాడుతూ రక్షణ రంగంలో ఉన్న కొద్దిపాటి సంస్థలను కూడా ప్రైవేటుపరం చేసేందుకు కేంద్రం చూస్తుందని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు అచ్యుతరావు, కుమార్, మౌలాలి, జ్యోతీశ్వరరావు, పీఏ రాజు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

79వ వార్డులో మొక్కలు నాటిన కార్పొరేటర్

అగనంపూడి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు పరిధి షిర్డీసాయి అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం గల్లవానిపాలెం, షిర్డీసాయి నగర్ ప్రాంతాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని వివిధ రకాల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలుష్య నివారణకు అందరూ విరివిగా మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు నాయుడు, సుబ్బరాజు, సత్యారావు, మాడిశ వెంకటరావు, జి.వెంకటరావు, ఎస్.సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యం బారినుంచి కాపాడాలని వినతి

అక్కిరెడ్డిపాలెం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మింది కాలనీకి ఆనుకుని ఉన్న పలు గొడౌన్లలో నిల్వ చేస్తున్న గ్రీన్ పెట్రోలియం కోక్ వల్ల ఏర్పడుతున్న కాలుష్యం నుంచి పరిసర ప్రాంతాల ప్రజలను కాపాడాలని విశాఖ పోర్టు ఇంజనీరింగ్ విభాగం ఎస్ఈ ఎ.వేణుప్రసాద్‌కు 68వ వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష గురువారం పోర్టు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అక్కిరెడ్డిపాలెం పంచవటి కాలనీకి ఆనుకుని పోర్టు అధికారులు నిర్మించనున్న గొడౌన్ల వల్ల ఇక్కడి డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతినకుండా చూడాలన్నారు.

ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలంటూ సీపీఐ ధర్నా

వేపగుంట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 97వ వార్డులో ఆక్రమణలకు పాల్పడుతున్న కూటమి నాయకులు, కార్పొరేటర్ వసంత కుటుంబీకులకు అడ్డుకట్ట వేయాలంటూ సీపీఐ నాయకులు గురువారం జీవీఎంసీ వేపగుంట జోన్ కార్యాలయం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ చినముషిడివాడ పంచాయతీ పరిధిలో రెండెకరాల ప్రభుత్వ స్థలం ఆక్రమించారన్నారు. సర్వే నంబర్-93లో 563 గజాల గెడ్డ స్థలంలో రెండంతస్థుల భవనం, బంజరు భూములో భారీ రేకుల షెడ్డుల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. వీటిపై టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం ఏసీపీ రామలింగేశ్వరెడ్డికి నాయకులు వినతిపత్రం అందజేశారు.

'చంద్రబాబుతోనే కార్యకర్తలకు భవిత'

కూర్మన్నపాలెం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుచూపుతోనే కార్యకర్తలకు ఉజ్వల భవిత ఉంటుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ అన్నారు. 87వ వార్డు ఎన్టీఆర్ నగర్‌లో గురువారం నిర్వహించిన టీడీపీ సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యకర్తల శ్రేయస్సు కోసం టీడీపీ ఎంతో కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, మాటూరు రాము, సిరసపల్లి శ్రీను, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి భరోసానిచ్చే ఆహార పదార్థాలు

సేంద్రియం... దివ్యౌషధం

- ఏయూలో ఆర్గానిక్ మేళా
- 300 స్టాల్స్‌లో సేంద్రియ ఉత్పత్తుల విక్రయం
- కొనుగోలుకు ఆసక్తి చూపుతున్న నగరవాసులు

మద్దిలపాలెం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): **ఆరోగ్యమే మహాభాగ్యం అని అందరికీ తెలిసిందే. అయితే మారుతున్న ఆహార అలవాట్లు, అధిక దిగుబడి పేరుతో రసాయన ఎరువుల వినియోగం విపరీతంగా పెరిగిపోవడంతో విషతుల్య పదార్థాలు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. తప్పనిసరి పరిస్థితుల్లో వాటినే కొనుగోలు చేసి, ఆహారంలో భాగం చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంటోంది. అయితే ఇటీవల సేంద్రియ ఉత్పత్తులు గణనీయంగా పెరుగుతుండడం, మార్కెట్‌లో అందుబాటులోకి రావడంతో వాటిని వినియోగించే వారి సంఖ్య పెరుగుతోంది. ఈ నేపథ్యంలో సేంద్రియ ఉత్పత్తులను ప్రజలకు మరింత చేరువ చేసే ఉద్దేశంతో ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ఆర్గానిక్ మేళాను ప్రారంభించారు. ఇక్కడ సుమారు 300 స్టాల్స్‌లో వివిధ రకాల వ్యవసాయోత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలు చేపడుతున్నారు.**

రసాయనాలతో పండించిన ఆహార పదార్థాలను తీసుకోవడంతో చిన్న వయసులోనే అనేక అనారోగ్య సమస్యలతో జనం సతమతమవుతున్నారు. నాలుగైదు తరాలకు ముందు పంటల్లో రసాయనిక ఎరువుల వినియోగం లేదు. గో ఆధారిత ప్రకృతి వ్యవసాయం మాత్రమే సాగేది. క్రమేపీ రసాయన ఎరువుల వినియోగం పెరిగిపోయింది. దీంతో నేల నిస్సారమై పంటలు సైతం కలుషితమయ్యాయి. పురుగుమందుల వినియోగంతో వాటి అవశేషాలు కూరగాయలు, ఇతర ఆహారపదార్థాలపై ఉండిపోయి రోగాలకు హేతువులవుతున్నాయి. దీంతో సేంద్రియ ఉత్పత్తులకు ఆదరణ పెరిగింది. ఈ దశలో ఆర్గానిక్ మేళాకు నగరవాసుల నుంచి విశేష స్పందన లభిస్తోంది.


ఆర్గానిక్ విత్తనాలు


సేంద్రియ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్న మహిళా రైతులు

అందుబాటులో 300 స్టాల్స్

రాష్ట్రంలోని పలు ప్రాంతాల రైతులు ఆర్గానిక్ మేళాలో 300 స్టాల్స్‌లో తమ ఉత్పత్తులు ప్రదర్శించారు. తృణధాన్యాలు, చిరుతినుబండారాలు, ఆకుకూరలు, చేనేత వస్త్రాలు, వంటింటిలో వినియోగించే మట్టి, కర్ర, రాతితో చేసిన వస్తువులు, ప్రసిద్ధి నొందిన మాడుగుల హల్వ, అందమైన పూలమొక్కలు, ఆర్గానిక్ విత్తనాలు, గోధుమ గడ్డి, పిచ్చుకలకు మేత వేసే వరికంకులు, డ్రైఫ్రూట్స్, పప్పుధాన్యాలు, ఏజెన్సీలో లభ్యమయ్యే దుంప జాతులు, ఆహార ధాన్యాలు, మసాల దినుసులు, నూనెలు వంటి ఉత్పత్తులెన్నో నగరవాసులకు అందుబాటులో ఉంచారు. అన్ని ఉత్పత్తులు సేంద్రియ పద్ధతిలో సాగు చేసినవే కావడంతో కొనుగోలుకు జనం ఎగబడుతున్నారు.


కొత్తరకం బంతి, చామంతి పూలమొక్కలు


పిచ్చుకల ఆహారానికి వరికంకులు


మ్యాంగో ఐస్‌ఫ్రూట్

20 రకాల బియ్యం...

దుకాణాలు, స్టోర్స్‌లో విక్రయించే మూడు, నాలుగు రకాల బియ్యమే చాలా మందికి తెలుసు. కానీ ఆర్గానిక్ మేళాలో 20 రకాల బియ్యం అందుబాటులో ఉన్నాయి. కేన్సర్ వంటి ప్రమాదకర వ్యాధులను దరిచేరనివ్వని కర్పు కవని, వీర్య కణాలు వృద్ధి చేసే మాపిళ్లై సాంబ, శరీర నొప్పులు రాకుండా పనిచేసే రాజముడి, గర్భిణులకు సంపూర్ణ పోషకాలనిచ్చే కుళాకర్, బహురూపి, మధుమేహం, బీపీ వ్యాధులను నియంత్రించే అరిక, సామ, అండుకొర్ర, కొర్ర బియ్యం ప్రదర్శనలో ఉంచడమే కాకుండా వాటి ఉపయోగాలు కూడా రైతులు వివరిస్తున్నారు. ఆరోగ్యం కోసం వినియోగించే బియ్యం ధరలు కాస్త కేజీ రూ.80 నుంచి రూ.200 వరకు ఉన్నాయి. రోగాలను దరి చేరనివ్వని తృణధాన్యాలు, పప్పు దినుసులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. అలాగే మిద్దె పంటలతో ఆర్గానిక్ వ్యవసాయం చేయాలనుకునే వారికి అన్ని రకాల విత్తనాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. మేళాలో మ్యాంగోఐస్‌కు విపరీతమైన ఆదరణ లభిస్తోంది. మామిడి పండు గుజ్జును ఐస్‌గా రూపొందించి, మధ్యలో వెదురుపుల్లతో అందించే ఈ ఐస్‌ను సందర్శకులు ఆరగించి, ఆనందపడుతున్నారు.

ఏయూలో ప్రారంభమైన ఆర్గానిక్ మేళా


సేంద్రియ ఎరువులతో పండించిన ధాన్యం ప్రదర్శిస్తున్న తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ, జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్

మద్దిలపాలెం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గో ఆధారిత ప్రకృతి వ్యవసాయంతో పండించిన ఆహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటామని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో గురువారం గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం నిర్వహించిన ఆర్గానిక్ మేళాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎరువులు, పురుగు మందుల వినియోగంతో పండించిన పంటలు తినడం వల్ల ప్రాణాంతక వ్యాధులు సంక్రమిస్తున్నాయన్నారు. గో ఆధారిత ప్రకృతి వ్యవసాయోత్పత్తులను ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ పురుగు మందులు, రసాయన ఉత్పత్తుల కారణంగానే వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. సేంద్రియ ఉత్పత్తులను ఆహారంగా తీసుకుంటే ప్రజారోగ్యం మెరుగుపడుతుందన్నారు. గో ఆధారిత ప్రకృతివ్యవసాయదారుల సంఘం అధ్యక్షుడు వర్మ మాట్లాడుతూ 300 స్టాల్స్‌తో 15వ తేదీ వరకు మేళా నిర్వహిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ ఆర్గానిక్ మేళాను నగర వాసులు ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జలగం కుమార్‌స్వామి, జేవీ రత్నం, తదితరులు పాల్గొన్నారు.


విక్రయానికి సిద్ధంగా వివిధ రకాల క్రోటన్ మొక్కలు

సుస్థిర వృద్ధికి ఏపీని నమూనాగా మార్చాలి

- గ్రాసిమ్ ఇండస్ట్రీస్ అధ్యక్షుడు నరసింహశాస్త్రి

సాగర్‌నగర్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సుస్థిర వృద్ధికి ఆంధ్రప్రదేశ్‌ను నమూనాగా మార్చడమే ధ్యేయంగా పనిచేయాలని చేసుకోవాలని ఆదిత్యా బిర్లా గ్రూప్ గ్రాసిమ్ ఇండస్ట్రీస్ అధ్యక్షుడు ఎస్.నరసింహశాస్త్రి పిలుపునిచ్చారు. పారిశ్రామిక భద్రత, విపత్తు ప్రమాద తగ్గింపు, నిర్వహణపై రాడిసన్ బ్లూ రిసార్ట్‌లో సీఐఐ ఆధ్వర్యంలో గురువారం జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. ప్రజా జీవితాల్లో మార్పు తెచ్చే శక్తి పారిశ్రామికరంగానికే ఉందన్నారు. పారిశ్రామిక రంగంలో రాణించాలంటే రిస్క్‌కు వెనకాడకూడదన్నారు. హిందూస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆర్.రామకృష్ణన్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలు, సుస్థిరత, భద్రతలో సంస్థ నిబద్ధతను వివరించారు. డెక్కన్ ఫైన్ కెమికల్స్ ఈడీ డీవీఎస్ నారాయణరాజు పారిశ్రామిక కార్యకలాపాల్లో భద్రత ముఖ్యమన్నారు. సీఐఐ ఏపీ చైర్మన్ డాక్టర్ వి.మురళీకృష్ణ పారిశ్రామికరంగంలో భద్రతను కట్టుదిట్టం చేయడానికి జపాన్ విధానాలను వివరించారు. విశాఖ చైర్మన్ రాజేష్ గ్రంధి పారిశ్రామిక భద్రత అవసరమన్నారు.



సదస్సులో పాల్గొన్న వక్తలు

చెస్ ప్రపంచంలో చరిత్ర సృష్టించిన గుకేష్

- ఏపీ ఫెడరేషన్ అధ్యక్షుడు అడుసుమిల్లి సురేష్

డాబాగార్డెన్స్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): చెస్ ప్రపంచంలోనేభారతదేశం తరపున గుకేష్ దొమ్మరాజు కొత్త చరిత్రను సృష్టించారని ఆంధ్రప్రదేశ్ చెస్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ అడుసుమిల్లి సురేష్ తెలిపారు. సింగపూర్‌లోని ఐల్యాండ్ వేదికగా ఈ నెల 6 నుంచి 12 వరకు జరిగిన ప్రపంచ చెస్ పోటీల్లో 14 రౌండ్లు సమానంగా జరగ్గా, చివరి రౌండ్‌లో రెండు పాయింట్స్‌తో గుకేష్ విజయం సాధించారన్నారు. డిఫెండింగ్ చాంపియన్ చైనాకు చెందిన డింగ్ లిరెన్‌ను గుకేష్ ఓడించారని, విశ్వనాథ్ ఆనంద్ తరువాత వరల్డ్ చాంపియన్‌గా నిలిచారన్నారు. ఇప్పటికే క్యాండిడేట్స్ 2024 టోర్నీ, చెస్ ఒలింపియాడ్‌లో గుకేష్ బంగారు పతకం సాధించారన్నారు. 2023 ఆసియన్ చెస్ ఫెడరేషన్ ప్లేయర్ ఆఫ్ ది అవార్డు కైవసం చేసుకున్నారన్నారు .గుకేష్ స్వస్థలం తూర్పుగోదావరి జిల్లా అని, అతని తండ్రి రజనీకాంత్ సర్జన్‌కాగా తల్లి పద్మ గృహిణి అన్నారు. ఏడేళ్ల వయసులోనే చెస్‌పై ఆసక్తి పెంచుకున్నారని, 18 ఏళ్ల వయసులో చెస్ ప్రపంచ విజేతగా నిలిచి భారతదేశ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిచెప్పారన్నారు. 2023 చెస్ ఫెడరేషన్ నుంచి మరింత మంది ఆటగాళ్లను తీర్చిదిద్దుతామన్నారు.



ప్రపంచ చెస్ వరల్డ్ కప్‌తో అడుసుమిల్లి సురేష్

భక్త జన సంద్రమైన కనకమహాలక్ష్మి ఆలయం


కనకమహాలక్ష్మికి పూజలు చేస్తున్న భక్తులు


కిక్కిరిసిన ఆలయ వీధులు

జగదాంబ కూడలి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మార్గశిర రెండో గురువారం సందర్భంగా వన్‌టౌన్ బురుజుపేటలోని కనక మహాలక్ష్మి ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. అమ్మవారి దర్శనానికి భక్తులు వెల్లువలా తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచీ ఆలయం ప్రాంగణం కిటకిటలాడింది. ఉచిత, టికెట్ దర్శన క్యూలు నిండిపోయి, గంటలకొద్దీ నిరీక్షించాల్సి వచ్చింది. కాగా ఆలయ పరిసరాల్లో విపరీతంగా మోహరించిన పోలీసులతో భక్తులు తీవ్ర అవస్థలు పడ్డారు. టౌన్ కొత్తరోడ్డు, స్టేడియం రోడ్డు, రీడింగ్ రూమ్ పరిసరాల్లో వందలాదిగా పోలీసులు మోహరించారు. ఆలయం ప్రాంగణం, గర్భగుడి కాకీమయమయింది. గతంలో ఎన్నడూ లేని విధంగా మార్గశిర మాసోత్సవాల్లో పోలీసుల హవా కనిపించింది. అవసరానికి మించి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం పట్ల భక్తులు స్వేచ్ఛగా దర్శనం చేసుకునే వీలు లేకుండా పోయింది. వీఐపీ, వీవీఐపీ దర్శనాలకు భక్తులు బారులు తీరారు. ఈవో కె.శోభారాణి, ఉభయదాతల సమక్షంలో అమ్మవారికి అర్థరాత్రి పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, ప్రత్యేకంగా పూజలు చేశారు. ఒంటిగంట దాటి తరువాత భక్తులను దర్శనాలకు అనుమతించారు. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు పటిష్ట చర్యలు తీసుకున్నారు. కాగా మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం ఆలయం వద్ద వేద సభ నిర్వహించారు.

నేడు కలెక్టరేట్ వద్ద వైసీపీ నిరసన

విశాఖపట్నం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అన్నదాతకు అండగా పేరుతో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలపనున్నారు. తుఫాన్ కారణంగా తడిచిన ధాన్యాన్ని ప్రభుత్వమే అధిక మద్దతు ధరతో కొనుగోలుచేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా పరిషత్‌కూడలి నుంచి ర్యాలీగా వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, నేతలు కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు హాజరవుతారన్నారు.

స్వర్ణాంధ్ర విజన్ వేడుకలకు జిల్లా వాసులు



కలెక్టరేట్ వద్ద బస్సులు ప్రారంభిస్తున్న జేసీ మయూర్ అశోక్

మహారాణిపేట, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో జరగనున్న స్వర్ణాంధ్ర 2047 విజన్ వేడుకలకు గురువారం నగరం నుంచి జిల్లా వాసులు బయలుదేరి వెళ్లారు. ఇందిరాగాంధీ స్టేడియం వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో విజన్ డాక్యుమెంటరీ ఆవిష్కరణ వేడుకలు శుక్రవారం జరగనున్నాయి. ఈ మేరకు జిల్లాలోని వివిధ విభాగాలకు చెందిన అధికారులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, సామాజికవేత్తలు, ఎస్ఎంఎస్‌ఈ పారిశ్రామికవేత్తలు సుమారు మూడు వందల మంది ఆరు ప్రత్యేక బస్సుల్లో వెళ్లారు. ఈ బస్సులను కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ మయూర్‌అశోక్ జెండా ఊపి ప్రారంభించారు.

గీతంలో స్మార్ట్ ఇండియా హాకథాన్ పోటీలు



హాకథాన్‌లో విద్యార్థి బృందాలు

సాగర్‌నగర్, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ ఇండియా హాకథాన్-2024 పోటీలు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో గురువారం ప్రారంభమయ్యాయి. ఎస్ఐహెచ్ 7వ సంచికను గురువారం ఏకకాలంలో దేశంలోని 51 నోడల్ కేంద్రాల్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించారు. ఇందులో భాగంగా సాఫ్ట్‌వేర్ ఎడిషన్‌ను 36 గంటల పాటు ఎలాంటి విరామం లేకుండా నిర్వహిస్తూ, హార్డ్‌వేర్ ఎడిషన్ 15వ తేదీ వరకు కొనసాగించనున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి హాజరైన విద్యార్థి బృందాలు స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ పోటీలో వివిధ మంత్రిత్వశాఖలు, విభాగాలు, పరిశ్రమలు ఇచ్చిన సమస్యలపై కసరత్తు చేస్తున్నాయి. జాతీయ ప్రాముఖ్యమున్న రంగాలకు సంబంధించిన 17 ఇతివృత్తాల్లో తమ ఆలోచనలను స్టూడెంట్ ఇన్నోవేషన్ కేటగిరీ కింద సమర్పిస్తాయి. ఆరోగ్య సంరక్షణ, వస్తు సరఫరా, ఆధునిక వస్తు రవాణా వ్యవస్థ, స్మార్ట్ టెక్నాలజీలు, సంస్కృతి సంప్రదాయాలు, సుస్థిరత, విద్య, నైపుణ్యాభివృద్ధి, నీరు, వ్యవసాయం, ఆహారం, కొత్తగా వృద్ధిలోకి వస్తున్న టెక్నాలజీ, విపత్తు నిర్వహణ ఇందులో ఉన్నాయి. ఆసక్తిదాయమైన అంశాలకు చోటు కల్పించారు. దేశంలోని 14 రాష్ట్రాల నుంచి 290 మంది యువతీ యువకులు హాజరై ఈ పోటీలకు హాజరయ్యారు. తమిళనాడు నుంచి అత్యధికంగా 11 జట్లు హాజరవగా, ఏపీ సహా ఇతర రాష్ట్రాల నుంచి రెండేసి జట్లు పాల్గొన్నాయని పర్యవేక్షకుడు రాజ్‌కుమార్ తెలిపారు.

చీటీల పేరుతో మోసం: దంపతుల అరెస్టు

భోగాపురం, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): చీటీలు, స్కీముల పేరుతో సుమారు రూ.రెండు కోట్ల వరకు వసూలు చేసి, మోసం చేసిన దంపతులను పోలీసులు అరెస్టు చేశారు. విజయనగరం జిల్లా భోగాపురం సీఐ ఎస్వీ ప్రభాకర్ తెలిపిన వివరాల మేరకు... విశాఖ జిల్లా భీమిలి మండలం వలందపేటకు చెందిన భార్యాభర్తలు సరగడ పార్వతి, లక్ష్మణ రెడ్డి చెరుకుపల్లిలో చీటీలు, రకరకాల స్కీములు నిర్వహించి గ్రామస్థుల నుంచి సుమారు రూ.రెండు కోట్లు వరకు వసూలు చేసి చీటింగ్ చేశారు. ఈ మేరకు గ్రామానికి చెందిన మజ్జి త్రినాథమ్మ చేసిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు అనంతరం గురువారం దంపతులను అరెస్టు చేశారు.

To,
1.Chakka Santosh S/o Late Ramamohan, Aged 36 Years,R/o Door.No.9-7-16. Plot No.304, Paila palace, Near Rama Talkies Junction A.U. Engineering College, C.V.M Compound, Visakhapatnam Urban, Visakhapatnam District.
2.Chakka Balachandra S/o Late Ramamohan, Aged 34 Years,R/o Door.No.9-7-16. Plot No.304, Paila palace, Near Rama Talkies Junction A.U. Engineering College, C.V.M Compound, Visakhapatnam Urban, Visakhapatnam District.
3.Chakka Manideep S/o Late Ramamohan, Aged 36 Years,R/o Door.No.9-7-16. Plot No.304, Paila palace, Near Rama Talkies Junction A.U. Engineering College, C.V.M Compound, Visakhapatnam Urban, Visakhapatnam District.
4.Chakka Siddhardh S/o Late Venkateswararao, Aged 30 Years, Door.No.24-141/2, Main Road, Parvathipuram , Vizianagaram District.
5.Chakka Varsha D/o Late Venkateswararao, Aged 28 Years, Door.No.24-141/2, Main Road, Parvathipuram , Vizianagaram District.
6.Chakka Suryateja S/o Late Ravisankar, Aged 22 Years, Near LIC Building, Rajam, Srikakulam District.

Ref:-W.P 31157 of 2022

Take notice that my client **Smt. Theegala Lalitha**,has filed the above WP 31157 OF 2022 , before the Hon'ble High court of Judicature for the state of Andhra Pradesh. The above WP 31157 OF 2022, came up for hearing on **02-12-2024** before his Lordships Hon'ble Sri Justice **R RAGHUNANDAN RAO AND** Honourable Sri Justice **HARINATH.N.** The court directed me to take out fresh personal notice on you and posted the above matter on **30-12-2024.** You are hereby informed to make appearance either in person or through your advocate on or before **30-12-2024.** Otherwise the matter will be decided ex-Partie This is for Your information.

Date: 12-12-2024
Place: Amaravathi

SWATI GUDA
Advocate,
Cell: 98486 29551